1644 MB0IR2407

హైదరాబాదు నరభక్షకి

M. V. KRISHNA RAO
Minister for Education & Cultural Affairs,
Executive President,
WORLD TELUGU CONFERENCE
HYDERABAD 1975.

ఆంగ్లమూలం

కెన్నెత్ ఆండర్సన్

అనువాదం

ఎన్. సి. వెంకటేశ్వర్లు, ఎమ్. ఎ.

సాహితీ కేంద్రం
తెనాలి.

HYDERABAD NARA BHAKSHAKI

Telugu translation of the last four chapters of

The Black Panther of Sivanipalli

BY

KENNETH ANDERSON

Translator :

N. C. Venkateswarlu, M.A.

First Edition : 3,000 Copies. July 1964.

Copyright :

M/s George Allen & Unwin Ltd.,

40, Museum Street, London,

Price : Rs. 1-80

Published under the auspices of
The Southern Languages Book Trust, Madras-34
Second Series : Telugu : 34

Publishers :

SAHITI KENDRAM,

TENALI

The Guntur Dt, Co-op. Printing Works Ltd., Tenali-2

MR01R407
H1-1.0
W1-8.5

తొలిపలుకు

ప్రాంతీయభాష లన్నింటిలోను ఒక భాషలోని ఉత్తమ రచనలను ఇతర భాషల లోనికి తర్జుమా చేయించుటకూ, దక్షిణ భాషలు నాల్గింటిలోనూ మంచి పుస్తకములను చౌకగా ప్రచురించుటకూ సంకల్పించి, దక్షిణ భాషా పుస్తకసంస్థ కావించుచున్న ప్రశంసనీయమైన కృషికి నేనా సంస్థను అభినందించుచున్నాను. మన భాషలలో చౌకధరలకు దొరకు మంచి పుస్తకము లకు ఎంతేని అవసరమున్నది. ఈ అవసరమును ఈ పుస్తక సంస్థ తీర్చగలదని నా నమ్మకము. ఈ సంస్థ తలపెట్టిన కార్యకలాపము ఫలప్రదముగా కొనసాగవలెనని నేను ఆశించుచున్నాను.

హైదరాబాదు
26–9–1960.

డి. సంజీవయ్య,
ముఖ్యమంత్రి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము.

౧

ఉపోద్ఘాతము

ఈ సంపుటములోని తొలి అయిదు ప్రకరణములలో పూర్తిగా చిరుతలను గురించి వ్రాసితిని. నేను, ఇతర వన్యమృగములను గూర్చి కాక, చిరుతలను గూర్చి వ్రాసినందులకు, మీకాశ్చర్యము కలుగవచ్చును. ఇట్లు వ్రాయుట కనేక కారణములు గలవు. మొదటి కారణము : చిరుత హిందూదేశములోని వన్యమృగములలో కెల్ల సాధారణమైన జంతువై యున్నది. రెండవ కారణము చిరుతలను కనుగొనుట చాల తేలిక, మరియు ఈరోజుకు సహితము చిరుతలను పెద్దపెద్ద పట్టణములకు కొద్ది మైళ్ళ దూరములోనే చూడవచ్చును. మూడవ ముఖ్య కారణము చిరుతలను చాల తక్కువ వ్యయముతో వేటాడవచ్చును. మరియు సగటున ప్రతి ఒక్కరు ఈవేటను కొనసాగించుటకు వీలగును. కుక్కలు, మేకలు, గాడిదలు మొదలగు ఎరలు చిరుతలను ఇట్టే ఆకర్షించును. పులుల నాకర్షించవలె ననిన, గేదెలు, ఎద్దులు, మొదలగు వానిని ఎరలుగా ఉంచవలెను. అదీగాక ఇది కొంచెము ఖరీదైనదికూడ.

చెట్లపై మకాములలో (మంచె) సురక్షితముగా యుండి వేటాడుట కన్న, భూమిపై కూర్చుండి చిరుతను వేటాడుట, పులి వేటవలెనే చాల భయంకరముగా నుండును.

నేను ఒక ప్రకరణములో పులులను, తదితర వన్యమృగములను గూర్చియు, ఇంకనూ విషసర్పములనుగూర్చి వ్రాసితిని. పులులు, ఏనుగులు, సింహములు, ఇంక తదితర ప్రదేశములలోని పెద్దపెద్ద జంతువులనుగూర్చి ఎక్కువగా వ్రాయబడుటయే గాక, వీనినిగూర్చి ప్రజలకు బాగుగా తెలియును. ఈ విషసర్పములను గురించి చాల తక్కువ వ్రాయబడుటయే కాక, వీనినిగూర్చి చాల కొద్దిగా తక్కువ మందికి మాత్రమే తెలియును. అందువలన నేను విషసర్పముల విషయమును వ్రాసితిని. పాములు కూడ ముఖ్యమైన జంతువులు కాబట్టి, నేను వానినిగూర్చి వ్రాయుటలో కొంత

వరకు కృతకృత్యుడ నయితినని తలచెదను. కాని, పులులు, చిరుతలు, ఎలుగుబంట్లు, ఏనుగులు మొదలగు జంతువులను అడవులలో ఎదుర్కొనుట ప్రమాదకరమని క్షణమాత్రము కూడ తలచవద్దు. త్వరిత గమనము, సాధ్యమైనంతవరకు ఇతరుల దృష్టి కగుపించక తిరుగు జంతువు విష సర్పమై యున్నది. ఇవి పొదలలోగాని, లేక గడ్డిలోగాని నక్కి తిరుగు చుండును.

నేను వన్యమృగమైన మచ్చికకాని ఎద్దు, పెద్దపులులతో జరిగిన రెండు సాహసకృత్యములను గూర్చి కూడ చెప్పితిని. చివరి రెండు సంఘ టనలు నరమాంస భక్షియైన పులులను కాల్చుటలో ఎదుర్కొనిన కష్ట ములు, నిరాశలు మొదలగు విషయములను గూర్చి మీరు కొంతవరకు తెలుసుకొన గలుగుదురు. ఒక దాని విషయములో పూర్తిగా అపజయము పొందితిని. రెండవదాని విషయములో కృతకృత్యుడ నయితిని. దీనికి కారణము అదృష్టమే. నేను ఆ ప్రకరణమును, వింత నడవడిగల పులిని గూర్చి చెప్పుటతో ముగించితిని. నేనీ గ్రంథమును వ్రాయునపుడు ఆ జంతువు సజీవియే—అది యిప్పటికిని.

నేను ఈ సాహస కృత్యములను క్రోడీకరించునపుడు, వర్తమానము లోని దృశ్యములు, ధ్వనులు చెరిగిపోయి పాతవిషయములు జ్ఞప్తికొచ్చు చుండెను. రాత్రుల యందలి అడవిలోని కారుచీకటి, పైననక్షత్రములతో నిండిన ఆకాశము, క్రింది అడవి యను తివాచీలో పొదగబడిన రాళ్ళ మెరపులు, అ కారుచీకటిలో వేలకొలది మిణుగురు పురుగులకాంతి చిన్న చిన్న దీపములవలె మెరయుట, మరియు ఇంక తదితరమైన ప్రకాశవంత మైన దీపములు, పులి, చిరుత, ఎద్దు మొదలగు జంతువుల వాడియైనకళ్ళు, మనోహరమైన, పచ్చని కళ్లు కలిగినలేడి అతి నాజూకుగా పొదలలోనికి పరుగెత్తుట వలన, నేను కదలుచున్న చెట్లక్రింద నడచుచున్నప్పుడు నాటార్చిలైటు యొక్క కాంతి ప్రతిబింబించుచుండెను.

నావెంట కొద్దిగంటలసేపు గడుపుము. పులి, చిరుత, ఏనుగు మొద లగు వన్యమృగములను పెద్దపెద్ద చెట్లయొక్క నీడలయందున్నటువంటి

ఈజంతు జాలమును గూర్చి వ్రాసిన ఈపుస్తకమును ఇట్టే చదువ కలుగుదువు. ఈపెద్దపెద్ద చెట్లయొక్క కొమ్మలతోనే, నేనీ అద్భుతమైన భవనమును నిర్మించితిని. దురభిప్రాయములతో కూడియున్న నాగరికతను మరచిపొమ్ము. ఈనాగరికత వలననే అతి సహజమైన స్వేచ్ఛాజీవితములపై అనేక నిబంధనలను విధించిరి. అడవిలో వాస్తవమును, ప్రశాంతతను, స్వర్గతుల్యమైన ఆనందమును కనుగొనగలవు. అక్కడ మోసమునకు, నటనకు పీసమైనను తావులేదు. మోసము, నటన మొదలగునవి కృత్రిమమైనవి. నీవు అచట సూటిగా సహజమైన విషయములు చూడవచ్చు. అదియే నిజము. అదియే దైవము.

నేను మిమ్ములను కొద్ది క్షణములసేపు ఐహిక విషయములనుండి వేరు చేయగలిగి, మీఅంతరాత్మను అడవిలోని వింతయైన ప్రకృతివైపుకు, మళ్లించగలిగి, అచట నీవు కనుక గాయపడిన నరమాంస భక్షియైన జంతువును అడవిలోని పొదలు, రాళ్ళగుట్టలలోను వెంటాడునట్లు చేయగల్గిన నేను ధన్యుడనైతినని తలంచుదును. నీ ప్రాణము నీబుద్ధి, నైపుణ్యము చివరకు ప్రకృతి యనుదైవముపై ఆధారపడి యుండును.

The Black Panther of Sivanipalli

అనే ఆంగ్లమూలంలోని చివరి నాలుగు ప్రకరణాలు మాత్రమే ఈసంపుటంలో అనువదింపబడినవి. తొలి ఐదు ప్రకరణములు "శివనిపల్లి నల్లచిరుత" అను పేర తొలిసంపుటముగ ప్రకటించితిమి.

ప్రకరణ క్రమం

1. హైదరాబాదు నరభక్షకి 1
2. గడేసాల్ అడవి ఎనుము 96
3. చోర్డి ప్రాంతపు జడల పులి 156
4. పెగిపాలయము నరమాంసభక్షి 171

1

హైదరాబాదు నరహంతకి

హిందూదేశము బ్రిటిషువారి పరిపాలనక్రింద నున్నపుడు, మైసూరు రాష్ట్రమునకు ఉత్తరముగనున్న బళ్లారి, అనంతపురము, కర్నూలు, నంద్యాల మొదలగు జిల్లాలన్నియు పూర్వపు మదరాసు రాష్ట్రములోనివి. ఈ జిల్లాలకు ఇంకను ఉత్తరముగ హైదరాబాదు రాష్ట్రముగలదు. దీనినే నిజాము రాష్ట్రమనిగూడ పిలుతురు. నైజామునవాబు బ్రిటీషువారితో మైత్రి నేర్పరచుకొని పరిపాలన గావించెను. నిజామునవాబు ఢిల్లీ చక్రవర్తులైన మొగల్ పాదుషాల వంశములోనివాడు.

హైదరాబాదు రాష్ట్రము ఇపుడు ప్రత్యేక రాష్ట్రముగ లేదు. నిజామురాష్ట్రములో ని కొంతభాగమును, అనంతపూరు, కర్నూలు, నంద్యాల మొదలగు ప్రదేశములను కలిపి, భాషా ప్రయుక్త రాష్ట్రవిభజన సమయమున ఆంధ్రప్రదేశమను తెలుగురాష్ట్రముగ విభజించిరి. ఆంధ్రప్రదేశము ఇండియన్ యూనియన్ రాష్ట్రములలోకెల్ల రెండవ పెద్దరాష్ట్రము. మధ్యప్రదేశము మాత్రమే ఆంధ్రప్రదేశమునకన్న వైశాల్యములో పెద్దది.

నేను చెప్పబోవుకథ చాలకాలము క్రితము జరిగినది. పైన పేర్కొన్న జిల్లాలలో తెలుగు ముఖ్యభాష, అయినప్పటికి, ఇవన్నియు పూర్వపు మదరాసు రాష్ట్రములో అంతర్భాగములై ఉండెడివి. ఆ రోజులలో ఈ జిల్లాలన్నియు

అభివృద్ధిచెందక వెనుకబడియున్నవి. వర్షపాతము చాల తక్కువ. ఇక వాతావరణము పదినెలలు చాలవేడిగనుండును. మిగిలిన రెండునెలలూ ఇంకను ఎక్కువ వేడిగనుండును. అక్కడ జనసమ్మర్దము చాలతక్కువ. అనంతపూరు,కర్నూలు పట్టణములపేర్లే ఆయా జిల్లాలపేర్లయియున్నవి. ఆయా జిల్లాలకు ఆయా పట్టణములే ముఖ్యపట్టణములై యున్నవి. పైపట్టణమ్ములు మినహా, తక్కిన ప్రదేశమంతయూ చెదురు మదురుగా చిన్నచిన్న గ్రామములతో నిండియున్నది.

మదరాసునుండి బొంబాయికిపోవు రైలుమార్గము ఈ జిల్లాలలోగుండాపోవు ముఖ్యరైలుమార్గము. ఈ రైలు మార్గము గుంతకల్ జంక్షను మీదుగా పోవును. ఇది బ్రాడ్ గేజిలైను. గుంతకల్లునుండి మూడు మీటరుగేజిలైనులు కలవు. ఒకటి పశ్చిమముగా బళ్లారి, హుబ్లివైపునకు, రెండవది దక్షిణముగా మైసూరురాష్ట్రములోని బెంగుళూరునకు, మూడవది తూర్పుగా ద్రోణాచలం, నంద్యాలమీదుగా విజయవాడకు, అచటినుండి తూర్పుతీరమువరకు రైలుమార్గము కలదు. విజయవాడవద్ద మద్రాసునుండి కలకత్తాపోవు బ్రాడ్ గేజిలైనుతో కలియును. ద్రోణాచలమువద్ద మీటరుగేజి లైను చీలి ఈశాన్యదిక్కుగా సికిందరాబాదు హైదరాబాదు వెళ్లును.

తూర్పుగావెళ్లు మీటరుగేజిలైను, గుంతకల్లు, ద్రోణాచలం, నంద్యాల దాటినతరువాత ఐదుస్టేషనులవరకు అడవిగుండా వెళ్లును. ఆ స్టేషనులు వరుసగా, గాజులపల్లి

బసవపురం, చల్మ, బాగర, దిగువమెట్ట అయియున్నవి. ఈఅడవి ప్రాంతములోనే నేచెప్పబోవుకథ జరిగినది. ఈప్రదేశము కృష్ణానదినిదాటి ఉత్తరముగా వ్యాపించిన అడవికిని, దక్షిణముగానున్న కడప పట్టణమునకును మధ్యగా యున్నది.

మీటరుగేజిబండ్లు చాలనిదానముగా వెళ్ళును. ఆ లైనులో ఎగువకువెళ్ళుబండ్లు దిగువకువచ్చుబండ్లు యింజను డ్రయివర్లు, యింజను లైటుకాంతితో జంతువులు పరుగిడుటను, మరియు అడవిపందికాని లేక దుప్పిగాని చిట్టచివరిసారి లైనును దాటుటకు ప్రయత్నించునపుడు ఆయా జంతువులను చూచుట పరిపాటియైన విషయము.

పైన పేర్కొనిన ఐదు స్టేషనులలోని ప్రదేశములో రాళ్ళతోనిండిన దుర్గమములైన బండ్లత్రోవలు, కాలిబాటల గుండా అడవిలోనికి వెళ్ళవచ్చును. ఆ రోజులలో మోటారు కార్లు వెళ్లుటకు రోడ్లు అనుకూలముగలేవు. ఈ ముఖ్య కారణమువలననే ఆ ప్రాంతములోని జంతువులు వేటకాని తుపాకికి గురికాకుండ యుండినవి. ప్రయాణము చేయుటకు రోడ్లుఅనువుగానున్న ప్రదేశములలోనే జంతువులను పూర్తిగా వేటాడిరి. వేటగాండ్రు ఉత్సాహవంతులైనప్పటికి, చెప్పుడు మాటలువిని, తప్పుదారిపట్టి, రోడ్లపై మోటారు వాహనములలో కూర్చొని, లైట్లువేసి, ఆ కాంతికి ఏ జంతువు కండ్లు మిణుమిట్లు గొలుపునో ఆ జంతువులను కాల్చెడివారు. వీరు తెలివితక్కువగా, ఏజంతువును వేటాడవలయునో, దానినైజము ఎటువంటిదో తెలియకనే వేటాడు చుండెడివారు. వీరు

కావలయునని, ఈవిధముగా అతిదారుణముగా జంతువులను వేటాడుటవలన, అడవి మృగములకు తీరని నష్టము కల్గెను. అడవి జంతువులను, పసికూనలను సహితము నిరంకుశముగా నాశనము గావించిరి. ఇంతేగాక, చాల జంతువులు గాయ పడి, మొరుగుచూ బాధతో చనిపోవుటకు చావు బ్రతు కులతో తప్పించుకొని పోయెడివి. బ్రిటీషు ప్రభుత్వము, తమ పరిపాలనా కాలములో ఈ దొంగవేటను అరికట్టుటకు ప్రయత్నించినది. ఇప్పుడు భారత ప్రభుత్వమువారుకూడ ప్రయత్నించు చున్నారు. మొదటిగా ప్రయత్నించిన బ్రిటిషు ప్రభుత్వమువారు, ఇపుడు భారత ప్రభుత్వమువారుకూడ ఈ విషయములో విజయమును సాధించలేకపోయిరి. అతి దారుణమైన, భయంకరమైన, క్రూరమైన ఈపనులు ఇంకనూ కొనసాగుచునే యుండెను. ప్రజలందరూ ఈ అడవి జంతువు లన్నియూ జాతీయనిధియని, వాటిని అనవసరముగా నాశ నము గావింపకూడదని గుర్తింపవలెను. లేనిచో ఈ జంతువు లన్నియు పూర్తిగా సర్వనాశనము గావించిననే తప్ప, ఈ పద్ధతి మారదు.

నేను చెప్పినట్లు, అదృష్టవశాత్తు రోడ్లు, కార్లు వెళ్ళు టకు అనువుగా లేనందున, గాజులపల్లి, దిగువమెట్ట ప్రాంత ములలో, రాత్రులయందు మోటారు వాహనములలో వెళ్ళి దొంగతనముగా వేటాడుటకు వచ్చు కసాయివాళ్ళ ప్రమా దమునుండి ఆప్రాంతపు జంతువులు మాత్రము రక్షింపబడెను. ఎవరైననూ రాత్రులయందు ఆ అడవులలో యున్నయెడల,

కారుశబ్దమునుగాని, మిణుమిట్లు గొలుపు లైటుకాంతిగాని, లేక కారు ఆగినపుడు వినిపించు శబ్దముగాని, లేక తుపాకి లేదా రైఫిల్ కాల్చుటవలన జంతువు చనిపోవునపుడు మ్రోగిన శబ్దముగాని—ఏమియూ కన్పించవు.

ఈ ప్రాంతమున నివసించు ప్రజలు తెలుగు భాషను మాట్లాడు చెంచు తెగకు చెందినవారు. ఆదిమ నివాసులవలె వారు, ఆడ, మగ, రెండు తెగలుకూడ చిరిగిన పీలికలను ధరింతురు. పురుషులు విల్లంబులను, అంబులను చేగొని మెడలయందు పూసలను, ఈకలను అలంకరించు కొందురు. నెమలికన్నులను ప్రత్యేక సందర్భములలో అలంకరించు కొందురు. వీరికి మద్యపానమన్న మిక్కిలి మక్కువ. వీరు మోవా పుష్పము, తుమ్మ చెక్కలతో తయారుచేయబడిన సారా త్రాగుదురు. ఈ చెట్లు ఆ ప్రాంతములో చాల ఎక్కువగా నుండుటవలన బ్రిటీషువారి పరిపాలనలో ప్రోహిబిషన్ ఉద్యోగులకు వీరి నొక పెద్ద సమస్యగా నుండెడిది. ఈ ప్రోహిబిషను ఆంధ్రరాష్ట్రములో కొన్ని ప్రాంతములలోనే అమలులో నున్నందున, త్రాగుడును అరికట్టుట ఆంధ్రప్రభుత్వమునకు మరీ పెద్దసమస్యగా నుండెను.

ఈకథలో నాఆశయము కారులలో కూర్చొని రాత్రులయందు దొంగతనముగా వేటాడుట మంచికార్యము కాదని గాని, ప్రభుత్వమువారి ప్రోహిబిషను పద్ధతిని విమర్శించుట గాని, చెంచుజాతివారి జీవితవిశేషములను చెప్పుటగాని కాదు. నరమాంస భక్షణ చేయు గొప్పపులి యొకటి నాల్గుసంవత్స

రము లపాటు ఈ ప్రాంతములోని ప్రజలను భయకంపితులుగా జేసెను. ఈపులి మొదట తనహంతక చర్యలను హైదరాబాదు రాష్ట్రములో ప్రారంభించి, చెంచుజాతి వారిని ప్రయాణీకులను భక్షించి, అర్ధసంవత్సరముపాటు ఈ విధముగ గడిపి, తదుపరి దక్షిణ దిశగా వెళ్లి చలమనుండి పశ్చిమదిశగా నున్న బసవ పురము వైపున ప్రతిరోజు రైల్వేలైను వెంబడి పోవుచుండు గ్యాంగు కూలీని చంపి, తిని, అమితాశ్చర్యము కలుగునట్లుగా తన ఆగమనమును ప్రకటించెను.

ఆ రోజులలో ఆప్రదేశమంతయూ, పులులతో నిండి యుండెను. ఈ జంతువులకు, తమఆహారమునకు పనికివచ్చు జంతువులుకూడ కొల్లలు కొల్లలుగ నుండుటవలన, చాల అరుదుగనో పశువులను ఎత్తుకొని పోవునపుడు ప్రాంతీయ ప్రజలను ఎదుర్కొన వలసి వచ్చెడిది. గ్యాంగు కూలీ కన్పించక పోయినప్పటికిని, నరమాంసభక్షణ సేయు పులియే కారణ మని ఎవ్వరును ఊహించలేరు. అతని అవశేషములు కన్పడక పోవుటవలన, అతను ఏదో కారణములచేత ఈ ప్రదేశమునుండి పరారి అయినట్లూహింపబడెను. కొన్ని నెలలు గడచిన తరు వాత అక్కడక్కడ కొందరు చెంచువాండ్రు అదృశ్యమగునప్ప టికి ఏదోగ్రహచారమని అనుమానింప దొడగిరి. తరువాత ఇదిఅంతయూ పులివలననే జరుగుచున్నదని ప్రజలుఅభిప్రాయ పడిరి. అయినప్పటికి ఆ ప్రాంతములో నరమాంసభక్షణ సేయుపులి తిరుగుచున్నదని ఋజువుకాలేదు. పులికాలి గుర్తులు బాటలవెంబడి అక్కడక్కడ కన్పించుచుండెను గాని,

కన్పించని గ్యాంగిగుకూలీ, చెంచువాండ్రకు మధ్యనున్న దూరమును కలుపుచూ పులి కాలిగుర్తులు కన్పించలేదు.

గ్యాంగుకూలీ చంపబడిన తరువాత మూడునాల్గు నెలలకు, పులితన ఉనికిని తెలియపరచెను. ఇద్దరుబొగ్గు కాల్చువారు అడవికి దగ్గరగానున్న చిన్నకుగ్రామమైన వాడపల్లి అను ఊరునకు ఒకరోజు సాయంత్రము వెళ్ళుచుండిరి. వారిద్దరు ఒకరివెనుక మరొకరునడచుచూ, గ్రామము ఇంక అరమైలుదూరమున్నదనగా ముందునడచు మనిషి చిన్న చిన్న మచ్చలుగల కోకిల ఎత్తైన చెట్టుపైనున్న గూడునుండి ఎగురుటను చూచెను. నేనీచుక్కలుగల కోకిలను గూర్చి చెప్పినపుడు మీరాశ్చర్యము చెందవచ్చును. మొగ కోకిల నల్లగానుండును గాన దానిని సాయంసమయమున గుర్తించ లేము. ఆడపక్షి బూడిదరంగుగా చుక్కలను కలిగియుండును. కోకిలజాతి పక్షులలో ఈ కోకిలలేచాల ఎక్కువగా నుండును. "బ్రెయిన్-ఫీవర్ బర్డు" (brain-fever-bird) అనునది హిందూదేశపు కోకిలజాతిపక్షి అయియున్నది. అన్ని కోకిల (Cuckoo) జాతి పక్షులవలెనే, ఈ కోకిలలుకూడ స్వంత గూళ్ళను నిర్మించుకొనక, గ్రుడ్లను ఇతర పక్షుల గూండ్లలో పెట్టి, పొదగుపనిని వానికే వదలివేయును.

ముందున్న చెంచువాడు కోకిల గ్రుడ్డుబెట్టి ఎగురు చున్నదని నిస్సందేహముగా ఊహించెను. చెంచువారికి కోకిలగ్రుడ్లు దొరకుట చాలకష్టము. ఎందువలననగా

ఆపక్షులు సాధారణముగా గ్రుడ్లను ఇతర పక్షుల గూళ్ళలో పెట్టును. అదీగాక వారు ఆ గ్రుడ్లను నాజూకైన ఆహారముగా పరిగణింతురు. అందువలన అతడు ఆవిషయమును రెండవ వానితో చెప్పెను. రెండవవాడు యువకుడగుటవలన గ్రుడ్లను తెచ్చుటకు చెట్టెక్కుచుండెను. అతను చెట్టుపైకెక్కునప్పటికి, క్రింద పెద్దఅరుపు వినబడెను. అతను క్రిందకుచూచెను. తన మిత్రుడు పులినోటినుండి వ్రేలాడుట, అతను సహాయము కొరకు అరచుచుండుటను చూచి ఆశ్చర్య చకితుడయ్యెను. చెట్టుపైనున్నవాడు చెట్టుచిటారి కొమ్మకువెళ్లెను. ఇంతలో పులి తననోట తన్నుకొనుచున్న మనిషితో అదృశ్యమయ్యెను.

రాత్రిఅయ్యెను. కాని చెట్టుపైనున్న చెంచువాడు భయముతో చెట్టుదిగుటకు సాహసింపక అక్కడనేయుండెను. వాడు ఆ రాత్రి పన్నెండుగంటల కాలము భయముతో చలితో వణకుచూ, పులి ఏ నిముషమైననూ రావచ్చునను భయముతో ఆచెట్టుపైననే గడపెను. మరుసటి దినము సూర్యోదయమైన తదుపరి వాడు చెట్టుపైనుండి అక్కడకు సమీపముననున్న వాడపల్లి గ్రామపరిసరములో నున్నవా రెవరైన తనకేకలు వినుదురేమో యన్నట్లుగా కేకలు వేయుచూ అరచుచుండెను. గాలి ఆగ్రామము వైపుకే వీచుట వలన అతని అరపులు విన్పించి, కొంతమంది గ్రామస్థులు విషయమేమిటో తెలుసుకొనుటకు బయలుదేరిరి.

"చలమ" ప్రాంతములో నరమాంస భక్షియైన పులి తన యునికిని ఈ విధముగా బయలుపరచుకొనెను.

చెంచువాండ్రు వాడపల్లినుండి ఈ వార్తను చలమ స్టేషను మాస్టరుకు తెలియజేసిరి. స్టేషనుమాస్టరు ఈవార్తను తంతిద్వారా నంద్యాల పంపెను. అచటినుండి ఈ వార్త పోలీసువారికి, అటవీశాఖవారికి, రైల్వేశాఖవారికి, జిల్లా కలెక్టరుగారికి తెలియజేసిరి. ఈ వార్త ఆనోట ఆనోట అందరికి తెలిసెను. ఆశ్చర్యముగా, నాల్గు నెలలక్రితము అదృశ్యమైన చెంచువానికి, గ్యాంగుకూలీకి కారణము నర మాంస భక్షణము సేయు ఈ పులియే అని నిర్ధారణచేసిరి.

సాధారణముగ అడవిలో ఏ ప్రాంతములోనైనను నరమాంస భక్షణచేయు జంతువుల జాడ తెలిసిన, అటవీ శాఖవారు ఆ పరిసర ప్రాంతపు అడవిలో స్వేచ్ఛగా ఎవరై ననూ లైసెన్సు లేకుండ ఆ జంతువును వేటాడనిచ్చెదరు. నరమాంసభక్షకిని హతమార్చుటకు అట్లు చేయుచుందురు. అటవీశాఖవారు ప్రకటన చేయగనే ఎవరునూ ముందునకు రాలేదు. అందులకు కారణము లేకపోలేదు. ఆ ప్రదేశములో రోడ్లు సరిగాలేవు. ఎవరైననూ వేటకుపక్రమించిన యెడల ప్రతి అంగుళము దూరము కాలినడకన వెళ్ళి నరమాంస భక్షిని ఎదుర్కొ-నవలసి యుండుటచే ఎవరునూ సాహసించ లేకపోయిరి.

ఒకరిద్దరు రైల్వే ఉద్యోగులు ఆసక్తి లేకయే గాజుల పల్లి, చలమ స్టేషనులమధ్య పులి కన్పించునను యుద్దేశ్య ముతో ట్రాలీబండిపై రైఫిల్సుతో అటునిటు తిరిగిరి. ఒకవేళ పులి కన్పించిన కాల్చవచ్చునని తలచిరి. కాని వారి

ఆశలు అడియాసలయ్యెను. పులి కన్పించలేదు. వారు పులిని చూడలేక పోయిరి. పులి వాతను పడు చెంచువారిసంఖ్య రోజురోజుకు పెరిగిపోవు చుండెను. గ్యాంగు కూలీతో కలుపుకొని, పులి వాతను పడినవారి సంఖ్య మొత్తము పదకొండునకు పెరిగెను. వీరిలో యిద్దరను పులి ఎత్తుకొని పోవునపుడు ప్రజలు, కర్రలు, విల్లంబులు, గొడ్డళ్లు తీసికొని ఆ జంతువును వెంబడించిరి. వారి అవశేషములను కనుగొనగలిరి. తక్కిన వారిని గురించి మాత్రము ఆచూకీ తెలియలేదు. ఆ ప్రాంతములోనికి వెళ్ళి వెదకుటకు త్రోవలుసరిగా లేనందుననూ, మరియూ పులిచేత చంపబడి తినగా మిగిలిన అవశేషములను కనుగొనుట కొరకు తమ ప్రాణములను త్యాగమొనరించుటకు వారు యిష్టపడక పోవుటవలనను, తక్కిన వారిని గురించిన జాడలు తెలియలేదు.

ఈ విధమైన ప్రవర్తన, ఆసక్తిని చూపలేక పోవుటయే గాక, యితరుల బాధలను గుర్తించలేనిదని తలచవచ్చును. నిరుపేదలయిన చెంచు జాతి వారికి ఆయుధములు లేకపోవుటయే గాక, పులి నెదుర్కొన వలెనని వారిలో ఐకమత్యముకూడ లేదు. అటువంటి వారు పులిని ఎట్లు చంపగలరు? అందులోనూ ఆ ప్రాంతపు అడవి వైశాల్యములో చాల పెద్దది. దట్టమైనది. బాటలు అక్కడక్కడ పొదల మధ్యగా పోవును. ఎక్కడ చూచినా రాళ్ళమయం. సెలయేళ్ళు అన్ని వైపులకు వ్యాపించియున్నవి. పులిగనుక ధైర్యముగ ఎదుర్కొన దలచిన గుంపులో అది కనీసము ఒకరినయిన చంపగలదు. ఈ

విషయము ప్రతి ఒక్కరికీ తెలిసిన విషయమే. ఎవ్వరును తమకు తాముగ పోయి పులికి ఆహుతి యగుట కిష్టపడరు. కనుక వారెవ్వరూ సాహసించలేక పోయిరని నిందమోపు వారెవరు ? ప్రాచ్యఖండ ప్రజల ఆధ్యాత్మిక సిద్ధాంత ప్రకారము చనిపోయినవారి శవమును కనుగొనుటకు రెండవ జీవి ప్రాణత్యాగ మొనర్చుట కేవలము అర్ధరహితమని భావన.

ఈపదకొండు మందిని చంపిన తదుపరి, నరమాంస భక్షియైన ఈ పులి కొంతకాలము ఆ ప్రాంతమును విడిచి పోయెను. ఆప్రాంతములో మూడు నాల్గు నెలలవరకూ, ఎవరూ చనిపోయినట్లుగా లేదు. కృష్ణానది ప్రాంతములో మాత్రము అక్కడక్కడ పులితిరుగుచున్నదను వార్తలు బయలు దేరెను. అపుడు మాత్రమే హైదరాబాదు నరమాంస భక్షియైన పులియు, చలమ ప్రాంతపు నరమాంస భక్షియు ఒకటియేనని స్పష్టముగా తేలెను.

హైదరాబాదు రాష్ట్రములో అటవీశాఖ వారి ప్రకటనకు సమాధానముగా పులిని చంపుటకు వేటగాండ్రా యత్తమైరి. ఒకరిద్దరు నవాబులు ఆజంతువును చంపుటకు ప్రయత్నించు చుండిరి. ఇంతలో పులి మేడికొండయను పల్లెకు సమీపముననున్న ప్రయాణీకు నొకనిని చంపెను. ఇతని విషయములో మాత్రము, ఆశవమును తిననీయకయే పులిని పారదోలిరి. ఈవార్తను క్యాంపులోనున్న ఆ ప్రాంతపు నవాబునకు చేరవేసిరి.

నవాబు అతివేగమున ఆ ప్రదేశమునకు వచ్చెను. అదృష్టవశాత్తు శవమును అంత్యక్రియలకొరకు తీసికొని పోవుటకు ముందుగనే ఆప్రదేశమునకువచ్చి, ప్రక్కనున్న చెట్టుపై మకాము (మంచె) నిర్మించుకొని పులి తాను చంపిన యతని శవము కొరకు తిరిగివచ్చు వరకు, మకాములోనే యుండుటకు నిశ్చయించుకొనెను. ఆచనిపోయిన ప్రయాణీకుడు స్థిరనివాసములేని వాడగుటచేత, ఆప్రాంతములో ఆ దురదృష్టవంతునికి చుట్టపక్కాలు లేనందున, అతని శవముకొరకు ఎవరనూ రాలేదు. ఆ శవము కొరకు ఎవరునూ రాకపోవుట వలన, ఇక ఆ పులిని కాల్చుటకు మిగిలిన అవకాశము అది ఒక్కటియే.

నవాబు అదృష్టవంతుడు. పులి ఆ ప్రదేశమునకు రానే వచ్చినది. కాని ప్రయోజనము లేకుండ పోయెను. పులి రాకతోపాటు, ఉరుములతో కూడిన వానకూడ వచ్చెను. కారణము ఏమయినప్పటికీ, అతను దురదృష్టవశాత్తు పులిని కాల్చగలిగెనేగాని, చంపలేకపోయెను. మరుసటి దినమున చూచుసరికి, అక్కడక్కడ రక్తపుబొట్లు మాత్రము కనిపించుచుండెను. కాని నవాబునకు, పులిని కాల్చగలిగినను తృప్తి మాత్రము మిగిలెను. మరుసటి దినము పులి శవము ఎక్కడున్నదీ కనుగొనుటకు ఎవ్వరును ప్రయత్నించలేదు. నవాబు మాత్రము పులి చచ్చినదని విశ్వసించెను. పులి చచ్చినదని అందరూ నమ్మిరి.

కొంతకాలము ప్రశాంతముగ గడచెను. గాజులపల్లి ప్రాంతములో నివసించు చెంచు వాడొకడు అడవిలో కౌజుపిట్ట లను పట్టుకొను వృత్తితో జీవించుచుండెను. ఒకనాడతను పిట్ట లను పట్టుకొనుటకు అడవికి వెళ్ళెను. కానివాడు మధ్యాహ్న భోజనమునకు తిరిగిరాలేదు. అతడా రోజు ఉదయముననే లేచి తను క్రితమురోజు పన్నిన వలల దగ్గరకు వెళ్ళెను. అతను అడవికి వెళ్ళుచూ, తను మామూలుగా మధ్యాహ్నము వేళకు తిరిగి వచ్చెదననికూడ చెప్పివెళ్ళెను. మధ్యాహ్నము గడ చెను. రాత్రికూడ అయ్యెను. కాని అతను తిరిగిరాలేదు. అతని భార్య, అతని ఏకైక పుత్రుడు, అతడు తిరిగి రాలేదని చాల ఆతురత పడిరి. చలమ ప్రాంతములో జరిగిన సంఘటనలు వారికి సుపరిచితములే. కాని, ఆవిషయము కొన్ని నెలల క్రితము జరిగిన విషయములు గాన, అందరూ మరచి పోయిరి. పక్షులను పట్టువాడు చనిపోవునప్పటికి, అతడే ఆ కుటుంబము నకు వెన్నెముకలాంటివా డగుటవలన, వారు అమిత భయ ముతో బాధ పడసాగిరి.

ఈ నరమాంసభక్షులైన పులుల దండయాత్రలను చిత్రించునపుడు, అవి ఒకేవిధమైన పద్ధతిని అవలంబించునను విషయము గుర్తించదగినది. క్రూరముగ నరమాంసభక్ష ణము చేయుచున్న ఈ పులిని, ఎవరో వేటకాడు దానిని సహజ ఆహారమును సంపాదించు కొనలేనిదానిగా చేసెను. అప్పటినుండి అది అకస్మాత్తుగా నరులమీద పడుటకు అల వాటు పడినది. మొగపులిగాని లేక ఆడపులిగాని, నరమాంస

మనిన ప్రీతికలిగిన తల్లివద్దనుండి ఈ అలవాటును నేర్చుకొనుట చాలఅరుదుగ నుండును. మనుష్యులు పులివాతను పడు దుస్సంఘటనలు మొదట చాలతక్కువగ ఎప్పుడో చాల కాలమున కొకటిగ జరుగుచుండెడివి. పోనుపోను, ఆ జంతువు తనబలమును తాను తెలుసుకొనినకొలది మరియు మానవులు నిస్సహాయులని తెలుసుకొనిన తదుపరి, మనుష్యులను చంపుట ఎక్కువయ్యెను.

నరమాంస భక్షణ గావించు పులిగాని, చిరుతగాని, వింత స్వభావమును కలిగియుండును. వీటికి సాధారణముగ మానవులన్న అసూయ, అసహ్యము, కాని వీనికి మనుష్యులన్న మిక్కిలి భయముకూడ. అందువలన కొంతమంది వేటగాండ్రు అవి పిరికిపందలని తలంతురు. అవి సాధారణముగా మనుష్యులను చాటుగా, అందులో ఒంటరిగా యున్నపుడో లేక గుంపుగా వెళ్ళినపుడు చివరివాడినో లేక మొదటివాడినో ఎదుర్కొనును. మొత్తముమీద మనుష్యులు గుంపుగా నున్నపుడు పులి ఎదుర్కొనిన సంఘటనలు చాల అరుదు. అంతియేగాక, జంతువునకు ఆహుతియగు జంతువుగాని లేక మనిషిగాని ఎదిరించినయెడల నరమాంసభక్షి పారిపోయిన సంఘటనలనేకము కలవు. ఇటువంటి సంఘటనలు పులులకన్న చిరుతల విషయమున చాల ఎక్కువ. పులులు చాల పౌరుషముగల జంతువులు. పులి ఎదుర్కొనిన తరువాత, వానిని ఎదుర్కొని, ప్రాణములతో బయటపడి మనకీ విషయమును తెలియచేసినవారు చాల అరుదు. అది

వాటి స్వభావమునుడు పిరికితనమనుడు. అట్టి పులులను ఆదిలో నే అంత మొందించుట చాల కష్టమైనపని. ఆ జంతువులను చుట్టుముట్టి నాశనము గావించుటకు అనేక ప్రయత్నములు జరిగెను గాని, అవి యన్నియూ విఫలమయ్యెను. అవి అతిజాగరూకత కలవియేగాక, జిత్తులమారివికూడ. అవి, వానిని చంపినవారికి కొంత బహుమాన మిచ్చెదరను విషయమునుకూడ తెలిసికొన్న వాని వలె ప్రవర్తించెడివి.

నరమాంస భక్షణచేయు పులి తన సంచారములో ఒకేవిధమైన పద్ధతిని, మార్గమును అవలంబించుచూ వందల కొలదిమైళ్ళు తిరుగును. అట్లు తిరుగునపుడు చిన్న చిన్న పల్లెలవద్దను, గ్రామములవద్దను ఒకటిరెండు వారముల చొప్పునఆగుచూనెల్లును. ఏదైన ప్రమాదము సంభవించినపుడు తప్పించుకొనుచు, క్షేత్రప్రదేశములకు, మైదానములకు వెళ్ళి అక్కడ తనయునికి వారికి తెలియనందున, తన ఆహారమును తేలికగా సంపాదించుకొనును. అది ఒక ప్రదేశమును వదలి వెళ్ళినపుడు, అచటి మరణసంఖ్య తగ్గినపుడు ప్రజలు ఆ విషయమునే మరచి నిర్భయముగ సంచరించుచుందురు. అందువలన పులితిరిగి అదేమార్గమున వచ్చిన పులి సునాయాసముగ ఆహారముగ కనీసము ఒకనినైనా సంపాదించుకొనగలదు. కనుక పులి ఎప్పుడునూ వర్తులాకారములో తిరుగుచూ అదితిరుగు ప్రదేశ వైశాల్యమునుబట్టి, తప్పక మరల అదేమార్గమున వచ్చును. ఒక నెలకుగాని లేక రెండు నెలలకుగాని.

M. V. KRISHNA RAO
Minister for Education & Cultural Affairs,
Executive President,
WORLD TELUGU CONFERENCE
HYDERABAD 1975

నేను మొదట చెప్పినట్లు, ఓర్పు ఉన్న యెడల, అవసరమైన విషయమును సేకరించిన యెడల (విషయ సేకరణ చేయుట చాలకష్టము) పులితిరుగుచున్న దారిని పటముగా గీచి ఏ ప్రాంతములో ఏ తేదీన మనుష్యుని చంపినదో క్రాస్ లతో గుర్తించిన యెడల పులి మరల ఏ ప్రదేశమునకు ఎపుడు వచ్చునో పది పదిహేను రోజులు అటుయిటుగా చెప్ప వచ్చును. నరమాంస భక్షియైన పులిని చంపుటకు శాస్త్రీయ పద్ధతిలో లెక్క వేసిన, ఈ విషయము వేటగానికి ఎంతో ఉపయోగించును.

చిరుతపులుల విషయములో అవిశ్చిక పద్ధతి ననుసరించి తిరుగవు. క్రమములేకుండ యిక్కడ అక్కడ తిరుగుచుండును చిరుతపులి సామాన్యముగా రాత్రులందే వేటకు బయలు దేరును. పట్టపగలు బయలుదేరుట చాల అరుదు. చిరుత ఆకృతిలో చిన్నది యగుటవలన ఎక్కడ అయినను నక్కి యుండగలదు. ఆజంతువు సాహసించిన కొలది, ఒకొ్కక్కప్పుడు గుడిసెలలో జొరబడి లోనుండు మనుష్యులను సహితము ఈడ్చుకొని వెళ్ళును. పులులు ఎక్కడో గాని ఈవిధముగ చేసినట్లులేదు. అదియుగాక పులులు మనుష్యులను పగటికాలములో ఎప్పుడయినను ఎదుర్కొనును. అడవిదారుల ప్రక్కనుగాని, గ్రామము పరిసరములలో నెక్కడయినను నక్కియుండి ఎదుర్కొనును.

నేనింతకు పూర్వము చలమప్రాంతమున మనుష్యులను చంపిన పులినిగూర్చి చెప్పితిని. దీనిని హైదరాబాదు నుండి

వచ్చిన "హంతకుడు" అని కూడా పిలుతురు. గాజులపల్లి సమీపములో అది పక్షులను పట్టుకొను చెంచువానిని చంపి కొంతవరకు తినెను. పిదపఅతని అవశేషములను, అతనికొడుకు కనుగొనెను. పిదప దీనియొక్క దండయాత్రలను వివరముగా తెలుసు కొనవలెననిన, ఈవిషయమును మనము తప్పక జ్ఞాపక ముంచుకొనవలెను. ప్రతిసంఘటన ఒకే మాదిరి గాను, మరియు పులి తన గమనమును, దక్షిణముననున్న గాజులపల్లి చలమ మధ్యలో, హైదరాబాదుకు ఉత్తరముగ నున్న కృష్ణానదివైపునను, తన గమనమును, మాటిమాటికి మార్చుకొనుచు, సంచరించుచుండెడిది. ఈ ప్రాంతములో జరిగిన సంఘటనలు చాలఉన్నవి. నీవు ఒకసారి మ్యాపులో చూచిన తెలియును. అదియుగాక, కుడికొండవద్ద నవాబు చేతులో గాయపడినప్పటినుండి దానికి నరమాంస భక్షణము నందభిరుచి రెట్టింపుఅయ్యెను. చివరకు అది నరమాంసభక్షణ చేయుటలో, పెద్దరాక్షసియో ఒక విధమయిన పిశాచమో అనుకొనుచుండిరి. ఇందువలన అది మనుష్యులను చంపగనే, సాధ్యమైనంత యెక్కువగతిని, మరల రెండవసారి రాకుండు నట్లుగా, అలవాటు పడవలసివచ్చెను. అది రెండవసారి చాల అరుదుగా మాత్రము తిరిగి వచ్చెడిది. పులి ఈ పద్ధతిని అవలంబించుట వలన, దానిని వెంబడించు వేటగాండ్రు అనేక యిబ్బందులకు గురికావలసి వచ్చెను. అందువలన, పులి ప్రతి దినము వేటాడవలసి వచ్చెను. ఆ విధముగ మరణములు యెక్కువయ్యెను. ప్రతిసారి చంపి తినగామిగిలిన అవశేష

ములను వదలివేయవలసి వచ్చుచుండును. ప్రదేశము వైశాల్యము మైనదగుటవలనను, దూరప్రాంతమగుట వలనను, జంతువుచేయు నాశనమునకు, ప్రచారము చాల తక్కువగ నుండెడిది. అప్పుడప్పుడు, ప్రాంతీయ పత్రికలలో దీనివిషయము కొద్దిగ ప్రకటించెడివారు. పులి ఒకరిని చంపగనే ఆ విషయమును పత్రికా ప్రకటనద్వారా తెలియజేసెడివారు. ఈ విధముగా మూడున్నర సంవత్సరముల కాలములో పులి విషయమును తీవ్రముగా పరిగణించి ఈ భయంకర పిశాచమునుగూర్చి శ్రద్ధగయోచించి ఏదియో చేయవలెనను కొను నప్పటికి పులి 80 మందిని హతమార్చెను.

80 మంది ప్రజలు పులిచేత చంపబడెనను విషయము పట్టణములలో నివసించువారికి బ్రహ్మాండముగా తోచును. ముఖ్యముగ పాశ్చాత్యుల దృష్టిలో అతిరాల నిజము. కాని సువిశాల భారతావనిలో అందులో మానవుని సరాసరి ఆయుర్దాయము ప్రస్తుతము ముప్పది సంవత్సరముల లోపుగ నున్నను, ఇదివరలో ఇంకనూ తక్కువ అయినటువంటి దేశములో కరువులు, కాటకములు, వరదలు, జబ్బులు, మొదలగు వానితో వేలాది జనము చనిపోవుటయేగాక, ఇంకనూ ఎన్నియో వేలమంది పాముకాటువలన మరణించుచుండిరి. ఈ విధముగ ప్రజలు అనేక విధములుగ చనిపోవుచున్ననూ, జననము నానాటికి పెరిగి పోవుచుండెను. ఇన్ని విధముల ప్రజలు చనిపోవుచున్నప్పటికీ, 80 మంది పులిచేత చంపబడిననూ, ఈ విషయమును సముద్రములో నొక నీటి బొట్టుగా

పరిగణించి రేకాని• ఈ విషయమునుగూర్చి ఎవరునూ పెద్దగ ఆందోళన చెందలేదు. పులి ఈ ఎనుబదినుందిని 1300 రోజుల కాలములో చంపి తినెను. ఈ విషయమువలన ఈ పులి మనుష్యులను దయదలచు చున్నదనియేగాక వేటగానికి ముఖ్యమైన విషయమే మన, అది చాల తరచుగ మనుష్యులను చంపుటకాదని, తన ఆహారమునకై పశువులను, ఇతర జంతువులనుకూడ చంపుచుండెనని స్పష్టమగు చున్నది. వేటగాడు ఎవరైననూ ఎరను ఉంచిన, పులి దానిని చంపుటకు రావచ్చును.

ఈ నరమాంస భక్షియైన పులియేగాక, ఇంక తదితర పులులు, చిరుతలు మొదలగునవి అటు హైదరాబాదు రాష్ట్ర అడవులలోనూ, ఇంకనూ ఇటు దక్షిణప్రాంతమునను, ప్రతి సంవత్సరము పశువులను, పెంపుడు జంతువులను ఎక్కువగ చంపుచుండెడివి. ఈ పరిస్థితిలో ఎన్ని జంతువులు నరమాంస భక్షియైన పులిచేత చంపబడెనో, ఎన్ని ఇతర జంతువులు, ఇతర పులుల, చిరతలచేత చంపబడెనో ఊహించుట కష్టసాధ్యము. పైన చెప్పినట్లు ఎక్కువ జంతువులను మనుష్యులను నరమాంస భక్షియగు మన పులియే చంపియుండును. నరమాంస భక్షి పూర్తిగా నరమాంసము పైననే ఆధారపడి యుండెననుట కేవలము హాస్యాస్పదము. కనుక అది తప్పక కొన్ని పశువులనుకూడ చంపియుండును. ఇచట మనము గమనించ దగిన విషయమొకటి కలదు. వేటకాడు గనుక, పులితిరుగాడుచున్న

ప్రదేశమును, అది ఏప్రదేశములో ఏతేదీన చంపినదియు వివరములన్నియు సేకరించిన, పులి మరల ఆప్రదేశమునకు ఎపుడు వచ్చునో పది పదిహేను రోజులు కుడి ఎడముగా ఊహించి ఆకాలములో పశువునుఎరగాయుంచిన సులభముగా వేటాడవచ్చును. పైవిషయమును చిత్రపటములో గుర్తించి పులిరాకన్ను తెల్సుకొన వచ్చును.

నేను వార్తా పత్రికలలో అప్పుడప్పుడు పులిని గూర్చిన ప్రకటనలను చదువు చుండెడివాడను. అటవీశాఖ ఉద్యోగులు పులిని చంపవలసినదిగా కోరుచు నాకు కొన్ని ఉత్తరములు గూడ వ్రాసిరి. కాని నేను మాత్రము వెళ్ళుటకు అంగీక రించలేదు. అందుకు తగిన కారణము లేకపోలేదు. అచ్చటికి వెళ్ళవలయునన్న నేను కొంతకాలమును ఆపని కొరకు విని యోగించుటయేకాక, దూర ప్రాంతమునకు ప్రయాణము చేయవలెను. అదియునుగాక పులితిరుగు చున్న ప్రదేశము బెంగుళూరునకు చాలా దూరము. అందువలన పులి యే ప్రాంతమున కైన వచ్చినదని, లేక ఎక్కడనైనను మనుష్యుని చంపినదనివార్త తెలియగనే అచటకుసకాలములో వెళ్ళుటకు వీలుపడదు. కాని నాకు మాత్రము నరమాంస భక్షియైన చిరుతగాని, పులిగాని, క్రూరమైన యేనుగుగాని, యన్న మిక్కిలిఇష్టము. కానిఈపులి విషయములో మాత్రము నేను, హైదారాబాదు, మద్రాసు, రాష్ట్రప్రభుత్వముల పోలీసు, మరియు అటవీశాఖలవారికి ఈ జంతువును గురించిన భోగట్టాయంతయు సేకరించనుని వ్రాసితిని. ముఖ్యముగ

అది యెక్కడ ఏ తేదీలలో మనుష్యులను చంపినదియు సేకరించమని వ్రాసితిని. ఈ విషయమునంతయు, చిత్రపటము గీసి పులి చంపిన ప్రదేశమువద్ద "+" గుర్తుతో తారీఖులు తేదీలవారిగా గుర్తించితిని. ఆ చిత్రపటమును పూర్తిగా అవగాహనము చేసికొనినపిదప జంతువు గాజులపల్లి చలమ ప్రాంతములో రెండు, మూడు నెలలు గడిపి తరువాత ఉత్తర దిశగా హైదరాబాదు అడవులలో నాలుగు, ఐదు నెలలు గడుపుటకు వెళ్ళినదను విషయము తెలియుచున్నది. అది మరల కొంతకాలమునకు ఈ ప్రదేశమునకు తిరిగి వచ్చెడిది. గాజులపల్లి, బసవపురము మధ్యదూరము ఆరుమైళ్ళు. మరియు బసవపురము, చలమ మధ్యదూరము 5 మైళ్ళు మాత్రమే. పై ప్రదేశములలో షుమారు పదిహేను మైళ్ళకు పైగా అడవివ్యాపించి యుండెను పై సేషనులన్నియు, హైదరాబాదు రాష్ట్రములోని ప్రదేశములకన్న బెంగుళూరునకు అతి సమీపమున నుండుటయేగాక, అవి అన్నియు తక్కువ వైశాల్యముగలిగి ఒకదానితో నొకటి బెంగుళూరువరకు మీటరుగేజి లైనుతో కలుపబడియున్నవి. హైదరాబాదులో నున్న ప్రదేశములతో బెంగుళూరునకు రైల్వేలైనుతో కలుపబడి లేకపోవుటయే గాక కారులో ప్రయాణము చేయుటకు గూడ రోడ్లు అనువుగాలేవు. అదియుగాక, దక్షిణప్రాంతములో జనసమ్మర్దము యెక్కువ. కనుక ఆ ప్రదేశములో యెక్కువ సహకారము లభించుటయేగాక, హైదరాబాదు అడవులలోకన్న ఈ ప్రాంతములలో జరిగిన విషయములు త్వరగా తెలియును.

నాకు కొంతకాలమునుండి పులిని చంపవలెనను ఉద్దేశము దృఢముగ లేకున్నను, ఈ నరమాంస భక్షియైన పులి రాక తెలియఁగనే దానిని చంపుటకు నిశ్చయించు కొంటిని. ఒకరోజు రైల్వేలైను ఇన్‌స్పెక్టరు చలమనుండి బనవపురము వరకు ట్రాలీపై లైనును తనిఖీ చేయుటకు వెళ్లెను. మన హిందూదేశపు రైల్వేశాఖలలో రెండు జతల చక్రములు కలిగి, పైన కొయ్యబల్లతో తయారు జేసిన ట్రాలీ బండ్ల నెక్కువగా వాడుదురు. ఆ ట్రాలి ఉపరిభాగమున . చెక్క ఆరు అడుగుల పొడవుగలిగి, దానిపై మరల యింకొక బల్లను కూర్చొనుటకు అమర్చుదురు. ఈ బండిని యిద్దరు కూలీలు పట్టాలపై నడచుచూ ముందుకు నెట్టుచుండెదరు. వారిని ట్రాలీ వాళ్లు అందురు. వారు పట్టాలపై నడచుటను అలవాటు చేసుకొని, కడు సమర్థులుగా తయారగుదురు. బండిని త్రోయునప్పుడు వారు ట్రాలిబండిని సమ ప్రదేశములలో గంటకు ఎనిమిది మైళ్ల వేగముతో నెట్టుచూ, కొంచెము వాలుగానున్న ప్రదేశములలో ట్రాలీపైకి దూకుదురు. ట్రాలిపై కూర్చున్న ఉద్యోగి, ట్రాలీబండి వేగమును చేతి బ్రేకుతో అదుపులలో నుంచు కొందురు. ఈ విధముగ వారు ఒక స్టేషనునుండి మరియొక స్టేషనుకు ప్రయాణముచేసి, స్టేషనులో ట్రాలీనిదింపి రాకపోకలకు ఆటంకము గలుగకుండ చేయుదురు.

ఆ రోజు కొంతదూరము వెళ్లినపిదప రైల్వేలైను ఇరుప్రక్కల పెద్ద మట్టికట్టలుండెను. అచట వర్షపు నీటి వలన

కట్టకు కొంచెము గండి పడినట్లుండుటవలన, దిగి తనిఖీ చేయుటకు ఆ ఉద్యోగి ట్రాలీబండిని ఆపెను. ఇంకను రెండు గంటలవరకు అటువచ్చు రైలుబండ్లు లేకపోవుటవలన వారికి చాల వ్యవధి దొరకెను. ఒక ట్రాలీవాడు బండిపైననే కూర్చుండెను. ఇన్‌స్పెక్టరు మాత్రము గండిని తనిఖీ చేయుటకు వెళ్లెను. రెండవట్రాలీవాడు ప్రక్కనున్న సుమారు ఏడడుగుల ఎత్తుగల కట్టపైకిఎక్కి కూర్చుండి బీడీ వెలిగించెను. హిందూదేశములో తయారు చేయబడు సిగరెట్లలోకెల్ల బీడి చవుక అయినదేగాక దానిని శుభ్రపరచని పుగాకుతో తయారు చేయుదురు. వాడు బీడీ వెలిగించి త్రాగుచుండెను.

ఇన్‌స్పెక్టరు మాత్రము ట్రాలీ దగ్గరనుండి కొంత దూరము వెళ్ళెను. ట్రాలీపై కూర్చున్నవాడు నిద్రపోయెను. కట్టపైకూర్చున్న ట్రాలీవాడు మొదటిబీడీతుంపును పారవైచి రెండవ బీడీని వెలిగించి ఘాటుగా పొగపీల్చి తనపైఉద్యోగి తాను పొగత్రాగుట చూచుచుండునన్న జాగ్రత్తతో ఒక ప్రక్క చూచుచూ ముక్కులలోనుండి పొగ వదలుచుండెను.

ఇన్‌స్పెక్టరు వందగజములు వెళ్ళిన తదుపరి తిరిగి రెండవలైను వెంబడి తనిఖీ చేయుచూ వచ్చుచుండెను. ఇన్‌స్పెక్టరు ట్రాలీవైపు చూచినప్పుడు ట్రాలీపై నిద్రించుచున్నవానినీ కట్టపై గూర్చుని బీడీత్రాగు వానినీ యిద్దరిని చూచెను. రైల్వే లైనుకు యిరుప్రక్కల యాభైగజముల దూరములో అడవి యుండెను. మధ్యకాళీలో పిచ్చిచెట్లు, పొదలు, రైల్వేలైను వరకు దట్టముగ పెరిగి యుండెను. ఇన్

స్పెక్టరు బాగుగా పెరిగిన పొద నొకదానిని చూచెను. ఆ పొదలో ఏదో అటునిటు కదలు చుండుట చూచెను. ఆ సూర్యరశ్మి ఆకులపైబడి ప్రతిబింబించు చుండెను. ఇన్ స్పెక్టరు చూచిన ఏదో ఒక వస్తువు, ఆపొదలో నిటునటు కదలుచుండెను. ఇన్ స్పెక్టరు. ఆవస్తువు ఏమిటాయని ఆశ్చర్యముతో చూచుచుండెను. ఆవస్తువు భూమిపై పరుండునట్లు కన్పించక నక్కియుండెను.

ఇన్ స్పెక్టరు మాత్రము లైనును దాటి ట్రాలీ దిక్కునకు వచ్చుచుంచెను. ఇన్ స్పెక్టరు వెంటనే రెండవపైపు గండిచూచు నప్పుడు పొదలో చూచ్చిన వస్తువును మరచి పోయెను. కొద్దిక్షణములలో చాలా బాధాకరమైన అరుపు వినబడెను. ఇన్ స్పెక్టరు కట్టపైకి చూచునప్పటికి కట్టపై నున్న కూలీని ఏదో ఈడ్చుకొని వెళ్ళెను. అతని అరుపు మాత్రము వినిపించు చుండెను. ఇన్ స్పెక్టరు చాలా ఆశ్చర్యపడి విషయము ఏమిటో తెలుసుకోవలెనని కట్టపైకి ఎక్కెను. పులిట్రాలీ వానిని నోట గరచుకొని అడవిలోనికి వెళ్ళుచుండెను. కూలీమాత్రము పులి నోటినుండి వ్రేలాడుచు కాళ్ళు చేతులతో తన్నుకొనుచూ అరచు చుండెను. పులి, మనుష్యుడు, కొంతసేపటికి అదృశ్యమైరి.

ఇన్ స్పెక్టరు నిశ్చేష్టుడై ఒక నిముషములనే యుండెను. తరువాత వెంటనే చర్యతీసుకొనవలెనను ఉద్వేగముతో కట్టపైనుండి దిగివచ్చి ట్రాలీదగ్గరకు వచ్చుచుండెను. ఈలోపుగా సహచరుని అరపులకు నిద్రించుచున్న ట్రాలీవాడు

నిద్రలేచెను. కాని అతడు అరపువినిన తమపరి ఏమిజరిగినదీ తెలియక "ఆశ్చర్యముచెందెను." ఇంతలో తనవైపునకు పరుగిడివచ్చుచుండిన ఇన్‌స్పెక్టరును చూచెను.

ఇన్‌స్పెక్టరు ట్రాలీవద్దకువచ్చి ఏమిజరిగినదో తెలియక తికమకపడుచున్న ట్రాలీవానినిచూచి, "పులి రెడ్డిని ఎత్తుకొని వెళ్ళెను. ట్రాలీని త్వరగా నెట్టుము" అనిచెప్పెను. వాళ్లు యిద్దరు ట్రాలిని వాలునుచేరువరకు సాధ్యమైనంత వేగముగా నెట్టుకుపోయిరి. పల్లములో దానియంతటయదే పరుగిడ గలదు. తరువాత వారిద్దరు ట్రాలీపైకిఎక్కి కూర్చొని ఆభయంకర ప్రదేశమునుండి దూరముగ పోయిరి.

ట్రాలీవాని చావును గురించి వార్తాపత్రికలలో విశేష ముగ ప్రకటించిరి. అందరు ఇన్‌స్పెక్టరును విమర్శించుట యేగాక, తోటిమానవునికి ప్రాణాపాయము కలిగినప్పుడు సహాయముచేయలేని పిరికిపందయనియు, కూనీకోరుఅనియు, మనుష్యుడై పుట్టుటకన్న, ఏ కీటకముగానో జంతువుగానో పుట్టవలసినదనియు, అనేకవిధములుగా నిందించిరి. ఇతనిని విమర్శించిన వారిలో నెందరు అదేపరిస్థితిలో ఎట్లువ్యవహ రించెడివారో ఊహించుకొనిన, నాకు ఆశ్చర్యముగలిగెను. అదియంతయు చాలా అకస్మాత్తుగ జరిగిన విషయమని అతడు నిరాయుధుడని మనము జ్ఞాపకముంచుకొనవలెను.

నరమాంసభక్షి అయిన పులిని ఎదుర్కొనవలయునని నేను నిశ్చయించుకొంటిని. ఆరోజురాత్రి నేను బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నమునకు గాజులపల్లి చేరితిని. నేను

ఒకవైపునుండి పులిని వేటాడుటకొరకు ప్రయత్నించుట మంచిదని ఊహించితిని. ఆ ప్రయత్నము బసవపురము, చలమ ప్రాంతములో చేయదలచు కొంటిని. మధ్యలో తల వని తలంపుగా పులికొరకు ప్రయత్నించుట అంతమంచిగాదు. ఒకవేళ అట్లుచేసిన విజయము కేవలము అదృష్టముపై ఆధారపడి యుండును. ముఖ్యమైన విషయము ఏమనగా నాకు ఆ ప్రాంతములో సహకారముచాల అవసరము. నేను యిదివరలో ఆ ప్రాంతమునకు ఒకటి రెండుపర్యాయములు మాత్రనే వెళ్లుటచేత నాకు ఆ ప్రాంతముతో పరిచయము చాలాతక్కువ. నేను పులివెళ్లిన మార్గమును పటముగీచి గుర్తించితిని. ఆ ప్రదేశములోనే పశులను పట్టుకొను వాడొ కడు మొట్టమొదటిగా ఆపులికి ఆహుతి అయినవాడు గాబట్టి అతని కుమారుడు నాకు ఉపయోగపడగలడు.

బండి స్టేషనునుండి వెళ్ళగనే నేను ఆస్టేషను మాష్టరు తోను, యింకా అక్కడవున్న యితర ఉద్యోగులతోను, పరి చయము చేసుకొంటిని. వారు నా రాకనుగూర్చి విన్న తరు వాత నాచుట్టూమూగి, నేను ఆ పనిమీద వచ్చినందులకు ఎంతో సంతోషము వెలిబుచ్చి నాకు ఏవిధమైన సహాయము నైనను చేయుటకు ఉత్సాహమును చూపిరి. ఆ ప్రాంత ములో వాడుకభాష తెలుగు గాబట్టి నాకు కొంచెమిబ్బం దిగా నుండెను. నేను తెలుగు బహు కొంచముగ మాత్రము మాట్లాడగలను కాని, అక్కడి ప్రజలు అందరు అరవము, హిందీ, తెలిసిన వారగుటవలనను , నేను ఆ రెండుభాషలు

మాట్లాడగలను గనుక అంతగా యిబ్బందిపడ నవసరము లేకపోయెను. ఏదోవిధముగా ఒకరినొకరము అర్థము చేసు కొన గలుగుచుంటిమి. స్టేషనుమాష్టరుకు ఇంగ్లీషు వచ్చును. గాన అతడే నాకు అర్థము చెప్పుచుండెను.

నేను పులిని గురించి కొంత తెలిసికొనవలయునని చెప్పితిని. ముఖ్యముగ దాని అలవాట్లనుగూర్చి తెలిసికొనుట చాల అవసరము. నేనుఎదుర్కొనబోవు తక్కిన పులులనుండి నరమాంసభక్షిని, తేలికగా గుర్తించవచ్చును. ఆస్టేషనులోని వారందరూ అది చాల పెద్దజంతువని చెప్పిరి. వారందరూ కూడ పులులు అనేక పర్యాయములు రైలుపట్టాలను దాటి వెళ్ళుటనుకూడ చూచితిమని చెప్పిరి. కాని తక్కిన పులుల నుండి నరమాంసభక్షిని గుర్తించుటకు, దానికిగల ప్రత్యేక మైన గుణములనుగూర్చి తమకు ఏమియూ తెలియదని చెప్పిరి. ఆ గ్రామములో నివసించుచున్న ఆ ప్రాంతీయ అటవీ శాఖో ద్యోగులు నాకు కొంతవరకు సహాయ మొనర్చగలరని తెల్పిరి.

పులి వాతను బడిన పక్షుల వేటగాని కొడుకును పిల్పించమని కోరితిని. కాని వారతనిని చూచితిమనియేగాని, అత డెచట నివసించుచుండెనో తెలియదని చెప్పిరి. అతను అడవిలో నివసించుచున్నాడని మాత్రము తెల్పిరి.

నేను కోరినమీదట ఒక గ్యాంగు కూలీని. ఫారెస్టు గార్డులను పిలుచుటకు పంపిరి. వారు యిరువది నిముషములలో కెల్ల తిరిగి వచ్చిరి. వారిలో నొకడు మహమ్మదీయుడు

అతని పేరు ఆలీబేగ్. నేను అతనితో హిందూస్థానీ భాషతో మాట్లాడ వచ్చును, రెండవవాడు కృష్ణప్పయను చెంచుజాతి వాడు. ఇతనికి తెలుగు తప్ప మరియొక భాష రాదు. మేమందరము స్టేషను వెనుక భాగములో నున్న మామిడి చెట్టు క్రింద కూరుచుండి మాట్లాడు కొనుట మొదలిడితిమి.

కృష్టప్ప చెప్పిన విషయములను ఆలీబేగ్ నాకు వివరించి చెప్పుచుండెను. నేను పులిని గురించి తెలుసుకొనుటకు, ఆ యిద్దరిలో నెవరు పులినిగూర్చి పూర్తిగా చెప్పుదురో వారికి తగిన బహుమానము నిచ్చెదనని ఆశపెట్టితిని. ఈ విషయము చెప్పగనే వారిద్దరూ నే చెప్పు విషయమును అతి శ్రద్ధగా వినసాగిరి. ఆలీబేగ్ తన ప్రాణత్యాగ మొనర్చి అయినాసరే పులివద్దకు తీసుకొని వెళ్ళుదునని చెప్పెను. కృష్ణప్పకూడ ఆలేబేగ్ ద్వార—తనుకూడ ఆ విధముగనే చేసెదనని చెప్పెను. కాని, ప్రాణత్యాగ మొనర్చుటకు మాత్రము యిష్టపడలేదు. పులిఆచూకీ తెలిసినయెడల, దాని వద్దకు తప్పక తీసికొనివెళ్ళెదనని కృష్ణప్ప వాగ్దానముచేసెను.

ఆనిష్కపటమైన సమాధానములనువిని ఉత్సాహపడి నేనువారిని అమితముగ మెచ్చుకొంటిని. అన్ని జాతుల ఆదిమ నివాసులవలె ఈ చెంచుమనిషియు కేవలము నిజాయితీపరుడే గాక, కార్యాచార పరాయణుడని తలచితిని.

నేను పులినిగురించి వారిని పలువిధములుగ ప్రశ్నించితిని. వారిద్దరు పులినిజూచితిమని చెప్పిరి. పులి మనుష్యులనుచంపుట మొదలిడినప్పటినుండి, అడవిలో ఒంటరిగతిరుగక

గుంపుగ గొడ్డలిచేబూని వెళ్లెడివారమని తెల్పిరి. వారు గ్రామమువిడచి ఎక్కువదూరము పోవుచుండుట లేదనికూడ చెప్పిరి. పదిరోజులక్రితము తాముపులిని జూచితిమనియు, అది వారినిచూచి భయపడి పొదలలోనికి వెళ్లినదనికూడ చెప్పిరి. అదియుగాక, ఒక నెలక్రితము వారు, ఒకనీటిపట్టువద్ద, ఉదయం తొమ్మిదిగంటల ప్రాంతములో పులిఅచ్చటికి వచ్చుటను చూచితిమనికూడ చెప్పిరి. అంతకుముందు—అనగా నాల్గు నెలలక్రితము వారు పులిని రెండుఫర్లాంగుల దూరములో జూచితిమనియు, కాని అది తక్కినపులులవలె పారిపోక కొద్ది క్షణములుపాటు నిలబడి బిగ్గరగా గాండ్రించెననియు, దాని అరపుకుభయపడి తాము ప్రాణములను కాపాడుకొనుటకు పారిపోయితిమనియు చెప్పిరి. కాని కృష్ణప్పఅను చెంచుగాడు మాత్రము ఆలీబేగుతో యిద్దరము ఒకేసారి, చప్పట్లు కొట్టవలయునని చెప్పెను. వారు చేతులతో శబ్దము చేయగనే పులి వారిని ఎదుర్కొనుటకు ఇష్టములేక భయంకరముగా గాండ్రించుచూ వెళ్లిపోయెను. కాని అది వెళ్లిపోవుచూ గూడ మరలమరల వెనుదిరిగి వీరిని చూచుచూ, అరచుచూ వెళ్లెను. అది కనుచూపునుండి అదృశ్యమైన వెంటనే వీరు త్వరగా గ్రామమునకు వచ్చిరి.

నాకు వెంటనే ఒక ఆలోచన తట్టెను. నేను గీసిన చిత్రపటము ప్రకారము మధ్య వ్యవధి నాలుగునెలలు మాత్రమే. అసాధారణ గుణములు గలిగిన ఈ జంతువు నా వుద్దేశ్యమును ధ్రువపరచెను. కనుక వారు తప్పక పులిని

చివరిసారి గాజులపల్లి వచ్చినప్పుడు మాత్రమే చూచి యుందురు. వారిద్దరి అభిప్రాయముగూడ అదియే.

ఇంకను ఆశ్చర్యము గలుగజేయు విషయమేమన మరల సరిగా నాలుగు నెలలు తరువాత పులి చలమ, బసవ పురములమధ్య ట్రాలీకూలీని చంపెను. అతడే ఆ ప్రాంతములో చిట్టచివర చంపబడిన వ్యక్తి. పులినిగూర్చి నా అంచనాలు నిజమై వున్నయెడల, పులి యిప్పుడు తప్పక బసవపురము, గాజులపల్లి ప్రాంతములో యుండవలెను. విషయము పరిశీలించిన తదుపరి అదృష్టదేవత నన్ను వరించినటులే కనిపించెను, కాని ఏమి జరుగనున్నదో!

వారిరువురినిచూచి అరచిన పులినిగూర్చి నేను అనేక ప్రశ్నలడిగితిని "మీరు ఆపులిలో ఏమయినా ప్రత్యేకత చూచితిరిరా యని"! ప్రశ్నించితిని. అది ఆకృతిలోచాల పెద్దజంతువని ఆలీబేగ్ చెప్పెను. తిరిగి కృష్ణప్పమాత్రము అదే మగపులి అని చెప్పెను. అది లేత పసుపురంగుగల శరీరము గలిగినదనిగూడ చెప్పెను. జ్ఞాపకము తెచ్చుకొనుచూ, "అయ్యగారు! ఆసమయములో అది మామీద పడునేమో యని అమితముగా భయపడితిమి. కనుక అటువంటి సమయములలో ఈ విషయములను ఎవరు చూడగలరు?" అనిరి.

నేను పక్షులనుపట్టు చెంచువాని కుమారుని యెరుగుదురా యని ప్రశ్నించితిని. ఆ పక్షులనుపట్టు చెంచువాడు పులికి ఆహుతిఅయినవారిలో నొకడు. వారు అకుర్రవానిని యెరుగుదురు. ఆ కుర్రవాడు తల్లి, భార్య, బిడ్డతోసహా

ఉత్తరదిశగా రెండుమైళ్ల దూరములో అడివిలో ఒకచిన్న గుడిసెలో నివసించుచుండెను. అతడుగూడ తనతండ్రివలె పక్షులను పట్టుకొను వృత్తినే అవలంబించెను. కాని ఈ సైతాన్ (పులి) ఆపరిసరములలో సంచరించుచున్నప్పుడు గూడ ఈ చెంచువాడు పక్షులను ఎట్లుపట్టుకొనుచుండెనో ఊహకందని విషయము. అటవీశాఖవారి రూల్సుప్రకారము అడవులలో పక్షులను పట్టుకొనగూడదు. అతని తండ్రిని అనేక పర్యాయములు పక్షులను పట్టుకొనిన నేరమునకై అటవీశాఖవారు శిక్షించిరి. ప్రతిపర్యాయము ఆ ముసలి వాడు తనపైనున్న కేసు అయిపోగనే మరల అదేపని చేసెడివాడు. వారసత్వము పోకుండా అతని కుమారుడుగూడ అదేపని చేయుచుండెను. యిదివరలో ఈ చెంచువాళ్ళు అప్పుడప్పుడు నెమలినో, లేక దుప్పినో కొట్టి అటవీశాఖ ఉద్యోగులకు లంచముగా యిచ్చుచుండెడివారు. ఈ చెంచువాళ్లుచేయు దొంగతనమును అటవీ శాఖ ఉద్యోగులు చూచిచూడనట్లుగా వూరకుండెడి వారు. కాని యిప్పుడు మాత్రము అటువంటి వేమియులేవు. ఆపేద చెంచు కుర్రవాడిని ఇప్పుడెవరు నిందింతురు? ఈ రోజులలో అతడు తనయింటి లోనికి పక్షులను కొట్టి తెచ్చుకొనుటయే చాలా కష్టముగా నుండెను. యెందువల ననగా నరమాంస భక్షి ఆ ప్రదేశములలో తిరుగుటయేగాక అది వెనుకున్నదో ముందున్నదో అనుభయ మెక్కువగ నుండెను. నాకు మొట్ట మొదటగా కావలసినది నేను వేటాడబోవు జంతువును నాకు

చూపించుటకు సహాయపడ గలవారు. వారు నాకు సమీపములోనే యుండిరిగాని నా సంతోషమునకు మేరలేదు. నేను లేచి నా 405 తుపాకిని భుజమున పెట్టుకుని ఆ గార్డు లిరువురిని నన్ను ఆ కుర్రవాని దగ్గరకు తీసుకొని వెళ్లుమని కోరితిని.

మేము రైల్వే లైనును దాటికాలి బాట వెంబడి అడవి లోనికి వెళ్ళితిమి. అడవిలో పొదలు. మొట్టమొదటిగా పలుచగాను పోయినకొలది దట్టముగా పెరిగి యుండెను అందువలన మేము ఒకరి వెనుక మరియొకరుగా నడువ వలసి వచ్చెను. ముందు కృష్ణప్ప, తరువాత ఆలీ బేగు చివర నేను వరుసగా నడచుచుంటిమి. నేను ముందుగనే రైఫిలును తోటాలతో నింపి కుడిమోచేతి వద్ద నుంచుకొని, ఏ విధమయిన ప్రమాదమునైనను ఎదుర్కొనుటకు సిద్ధముగా నుంటిని. పులిగనుక యెదుర్కొనదలచిన ముగ్గిరిలో అటు ముందున్న కృష్ణప్పనుగాని, లేక యిటు వెనుకనున్న నన్నుగాని యెదుర్కొనును. మధ్యలోనున్న ఆలీబేగును మాత్ర మెదుర్కొన జాలదు. అతనికి ఏమియు ప్రమాదము లేదు.

మేము అప్పటికి సుమారు మూడుమైళ్లు వచ్చిన తదుపరి ఒక చిన్న రాళ్లతో నిండిన సెలయేటిని దాటి కొండ దిబ్బ పైకి వచ్చితిమి. ఆ కొండపై ఒక చెంచువాని గుడిసె గలదు. ఆ గుడిసె ద్వారమువద్ద ఇరువై సంవత్సరముల ప్రాయముగల్గి, చక్కని ముఖవర్చస్సు గలిగిన చెంచు కుర్రవాడు కూర్చుని యుండెను. అతను చిన్న బాకుతో వెదురు

బద్దలను చీల్చుచుండెను. అతని చేతి దగ్గరలో అల్లిక సగము పైగా పూర్తి అయిన పక్షులను పట్టు వల యొకటి యుండెను.

మేము అచటికి వెళ్లగనే అతడు లేచి సగౌరవముగా మాకు సలాము చేసెను. కృష్ణప్ప తెలుగు భాషలో నన్ను ఆ కుర్రవానికి పరిచయము గావించెను. ఆ చెంచువాడు చిరునవ్వుతో సమాధానము చెప్పెను. మా యిరువురిలో ఒకరి భాష మరియొకరికి రానందున మాకు ఆలీబేగ్ మధ్యవర్తిగ నుండి ఆ చెంచువాని పేరు "బాలా" అని చెప్పెను. ఆ గుడిసెలో నుండి యిద్దరు స్త్రీలు కన్పించుచుండిరి. వారిలో నొక స్త్రీ ముసలి. రెండవ స్త్రీ పదునారు సంవత్సరములు ప్రాయము గలది.

ఆ రెండవ స్త్రీవద్ద ఒక సంవత్సరము వయసు గలిగిన ఒకబిడ్డ తల్లిపాలు త్రాగుచుండెను. నేను ఆ ముసలిస్త్రీ చెంచువాని తల్లియనియు, రెండవస్త్రీ బిడ్డ, అతని భార్య బిడ్డలని తలచితిని.

మేము ఆ గుడిసెకు కొద్ది యడుగుల దూరములో గడ్డిపై కూర్చుంటిమి. నేను ప్రశ్నలు అడుగుట మొదలిడితిని. ఆలీబేగ్ నా ప్రశ్న లన్నింటిని తెలుగులో చెంచువానికి చెప్పుచూ, ఆ కుర్రవాని సమాధానములను నాకు చెప్పుచుండెను. కృష్ణప్ప మధ్యలో జోక్యము కల్గించుకొని ఫలాన విషయము స్పష్టముగా లేదని చెప్పుచుండెడివాడు. చెంచువాడు మాత్రము తనతండ్రిని చంపిన పులిని చంపుటలో

తెల్లదొరగారికి సహాయ మొనర్చుటకు సిద్ధముగ నుండెను. అతడు మాత్రము ఏ విధమైన ప్రతిఫలమును కోరుటలేదు. అతడు ప్రతిఫలమును ఆశించిన తన తండ్రిగారి ఆత్మ క్షోభించు నట! అతడు తనతండ్రికి ఏకైక పుత్రుడుగావున, తన తండ్రి మరణమునకు కారణమైన ఆ పులిపై ప్రతీకార చర్య జరుపు టయో లేక అతని మరణమునకు కారణమైన ఆ శత్రువును తానే చంపుటకో ప్రయత్నించినచో తండ్రి ఆత్మకు శాంతిని చేకూర్చిన వాడగును. అతడు నరమాంసభక్షియైన పులిని అనేక పర్యాయములు చూచెను. అతడు ఒకసారి మేము దాటివచ్చిన సెలయేటివద్దకు పాత్రతో నీరు తెచ్చుటకు వెళ్లెను. అది సరిగా వారు మధ్యాహ్న భోజనము చేయువేళ. అతను పాత్రను నీటిలో ముంచునపుడు పైకిచూడగానే, పులి ఆవలి గట్టుపైనుండి క్రిందికి దిగుచుండెను. అదృష్టవశాత్తు అతడు సకాలములో తనవైపునకు ప్రాకివచ్చుచున్న పులిని వందగజములదూరములో చూచెను. అతను పాత్రను నీటిలో వదలి, గుడిసె దగ్గరకువెళ్ళి పులి ఎప్పుడైనను గుడిసెపైబడ వచ్చునను భయముతో తలుపును ముళ్ళకంచెతో వీలైనంత గట్టిగా బిగించి, కుటుంబ రక్షణ చేసెను. కాని పులిమాత్రము అటురాలేదు. పులి రాత్రులయందు సెలియేటిలో నీరు త్రాగుటకు వచ్చినపుడు, పులి అరపులను చెంచువాడు అనేక సార్లు వినెను. అది పెద్ద మగజంతువు. లేత పసుపురంగు శరీరము కలది. ఈ పులిని గూర్చి తనుచూచిన వింతను దొరగారికి కావలయునా? బాలా కొద్ది క్షణములసేపు ఆలోచించి, వివర్ణమైన గోధుమ — పసువు రంగుపై నల్లటి

చారలు గలవని చెప్పెను. ఈ విషయము దొరగారికి ఏమైనా ఉపయోగించునా? ఆ చెంచువాడు తనజీవితములో చాల పులులను చూచెనుగాని, సన్నని చారలు కలిగిన పులిని మాత్రము ఎప్పుడునూ చూచి యుండలేదు.

అతడు చివరిసారి పులిని ఎప్పుడు చూచెను? బాలా కొంచెముసేపు ఆలోచించి "నాల్గు నెలలు క్రితము" అని సమాధానమిచ్చెను. తర్వాత అతడు ఏపులినైనాచూచితివా? అతను రెండుసార్లు చూచెను. అవి పులులేగాని, తన తండ్రిని చంపిన పులిని మాత్రము చూడలేదు. అతని కీవిషము ఎట్లు తెలియును? అవి యన్నియూకూడ ఆకృతిలో చిన్నవియే గాక నల్లని మచ్చలను గలిగి, అవి వీనిని చూడగనే పారి పోయెడివి.

ఇంతలో బాలా, నేను ఎదురుచూచుచున్న వార్తను గొనితెచ్చెను. అతను పులినిచూడక పోయినప్పటికినీ, అది ఈప్రాంతములోనే ఉన్నదనియు, అతడు దానికాలిగుర్తులను సెలయేటిదిగువ భాగములో చూచెనని చెప్పెను. ఆపులి ఇదివరకు ఈప్రాంతములో తిరిగినప్పటి కాలిగుర్తులు ఇపుడు కనిపించిన గుర్తులు ఒకే మాదిరిగ నున్నవని చెప్పెను. అదీగాక ఆగుర్తులన్నియూ, పులితినగా మిగిలిన తనతండ్రి శవముచుట్టు కన్పించుచుండెను.

నేను వెంటనేలేచి ఆగుర్తులను చూడవలెనని చెప్పితిని. బాలా ఇంటిలోనివారితో జాగ్రత్తగా ఉండుడని హెచ్చరించి

తలుపును జాగ్రత్తగా వేయుమనిచెప్పి, మమ్ములను సెలయేటి దగ్గరకు తీసికొని వెళ్లెను. అతడు మమ్ములను, మేముఇంతకు ముందు సెలయేటిని దాటివచ్చిన చోటికే తీసికొనివచ్చి, అచటినుండి సెలయేటి వాలునకు రెండుమూడుఫర్లాంగుల దూరమువరకు తీసికొనివచ్చెను. అచటసెలయేరు వెడల్పుగా నుండుటవలన, నీరుమధ్యలోకొద్దిగా నుండెను. నీటికిరువైపులా ఇసుకదిబ్బలుండెను. పులిరెండురోజులక్రితము ఇసుకదిబ్బల పైగాదాటి తూర్పునుండిపడమరకు వెళ్ళెను. పులికాలిగుర్తులు పెద్దవిఅగుటవలన, మేముదూరముగనుండగనే, అవిస్పష్టముగ కన్పించుచుండెను.

ఆకాలిగుర్తులు నిస్సందేహముగ మొగపులివైయున్నవి. నేను ఆగుర్తులనుచూచిన పిదప, ఆమెత్తని యిసుకలో చిన్న పులికాలిగుర్తులు కూడపెద్దవిగ కన్పించుటకు వీలున్నను, ఆ గుర్తులు తప్పక పెద్దజంతువువే అని అభిప్రాయ పడితిని.

మేము గుడిసెవద్దకు తిరిగివచ్చినపిదప నేను ఈ ప్రాంత ములో ఉన్నంతవరకు తనకుటుంబమును గాజులపల్లిలో ఉంచమని బాలాతో చెప్పితిని. అతడు అట్లుచేసిన యెడల అతను స్వేచ్ఛగా నాకు సహాయమొనర్చుటకు వీలగును. నరమాంసభక్షి పరిసరములలోనుండగా బాల తనతల్లిని, భార్యను, బిడ్డను, అటువంటి భయంకరమైన అడవిలో ఆ గుడిసెలో ఏకాంతముగా వదలుట చాలప్రమాదకరమైన విషయము. అందులో తనకుటుంబములో నొకరు పులికి ఆహుతి అయినపిదప అచట ఉండుట ఇంకను ఎక్కువ

ప్రమాదకరము. ఈ నవీనయుగములోని యుద్ధరంగములలో ధైర్యము, శౌర్యము చూపిన సైనికులకు, పతకములు మొదలైనవి బహుమతుల నిచ్చుటయేగాక వారికీర్తిప్రతిష్ఠలను గీతములద్వార పాడుటను మనము నిత్యము చూచుచున్నాము. దేశశ్రేయస్సుకొరకు ఎందరో గూఢచారులు ప్రాణత్యాగ మొనర్చినను, వారినిగూర్చి తలచెడివారు లేరు. చెంచుకుటుంబము, అడవిలో ఏకాంతముగ నుండుట, అందులో నరమాంసభక్షి పరిసరములలో నుండుట, ఇంకను ఆకుటుంబపుపెద్ద జీవనోపాధిని సంపాదించువాడు పులికి ఆహుతియైన పిదపకూడ వారు ఆ అడవిలోనే ఉండుట—నిజముగా సాహసకృత్యమే! ఆరోజుమాత్రము ఈ విషయము విన్నతరువాత నా ఒళ్లుఝల్లుమనెను. మనమనేక సాహసగాథలను వినియుంటిమి. వారందరికన్నా, ఈ చెంచువారు చాల సాహసికులనుటకు సందేహములేదు.

మొదట ఆ చెంచు యువకుడు తన నివాసమును మార్చుటకు ఇష్టపడలేదు. కాని నా వత్తిడి వలనను, అటు కృష్ణప్ప, ఆలీబేగ్ అను యిద్దరుకూడ చెప్పుటవలనను, అతడు చివరకు ఒప్పుకొనెను. నేను, గార్డులిద్దరూ—ముగ్గురము ఆ దగ్గరి చెట్టుక్రింద కూరుచుంటిమి. ఇంతలో వారు తమ కొద్ది సామాన్లను మూడు మూటలుగా కట్టిరి. బాలా గుడిసె తలుపును కట్టి, చెంచువాళ్ళు ముగ్గురూ మూడు మూటలను నెత్తిన పెట్టుకొనిన పిదప, అందరమూ గ్రామమునకు బయలు దేరితిమి.

ఆరోజు రాత్రి స్టేషను మాస్టరు నన్ను తన ఇంటికి విందారగించుటకు ఆహ్వానించెను. వారు శాఖాహారులు. స్టేషను మాస్టరు భార్య అమిత శ్రద్ధతో నే నదివరకెన్నడునూ తిని చూడనంత రుచిగా పలురకముల కూరలను తయారు చేసెను. కప్పులనిండుగా కాఫీ, పెరుగు ఉంచబడెను. మేము భోజనాంతరము స్టేషనుకువచ్చి మా కార్యక్రమము గురించి ఆలోచించవలెనని తలచితిమి. ఎందువలననగా రాత్రిపూట గుంతకల్లు వైపునకు మెయిలుబండి, తర్వాత రెండు మూడు గూడ్సుబండ్లు వెళ్ళునుగాన, స్టేషను మాస్టరు తప్పక స్టేషనులో ఉండవలయును. కనుక మే మిరువురము మాట్లాడు కొనుటకు స్టేషను తగిన ప్రదేశమని తలచితిమి. మేము భోజనానంతరము స్టేషనుకు వచ్చి ప్లాటుఫారముపై నున్న బెంచిపై కూర్చుంటిమి. గార్డులిద్దరును, బాలా మా ముందర నేలపై కూరుచుండిరి.

ఇక నేను చేయవలసిన ముఖ్యవిషయము – రెండు సజీవములైన ఎరలను తెచ్చి, ఒక ఎరను, గార్డులకు పులి కన్పించిన చోట, రెండవదానిని బాలాగుడిసెకు సెలయేటికి మధ్యలో పులి కాలిగుర్తులు కన్పించిన చోటనూ కట్టివేయుట ఉచితమని తలచితిని. బాల మరియు కృష్ణప్ప అక్కడనే యుండి, ఆజంతువులు చంపబడిన యెడల వారు నాకు తెలియజేయునట్లు ఏర్పాటు గావించితిమి. నేను ఈలోగా ఆలీబేగ్‌ను వెంటతీసికొని, బసవపురము చలమవరకు పులిని గురించి తెలిసికొనుటకు వెళ్లుటకు నిశ్చయించితిని. ఒక వేళ

గాజులపల్లిలో కట్టినఎరను పులి చంపినయెడల, స్టేషను మాష్టరయిన బాలసుబ్రహ్మణ్యంగారు ఆవార్తను తంతి ద్వారా బసవపురముగాని, చలమగాని నేను ఈ రెండు తావులలో ఎచటనున్న అచటకు వార్తను పంపునట్లుగా ఏర్పాటు గావించితిని.

స్టేషను మాష్టరు నన్ను తన ఆఫీసునకు తీసికొనివెళ్ళి, ఆ రెండు స్టేషన్లలోని తన సహోద్యోగులైన స్టేషను మాష్టర్లను విషయము తెలిసికొనుటకు పిలచెను. వారివుపురుకూడ, నరమాంసభక్షియైన పులి మరల కన్పించలేదనియూ, కాని ఏ ఒక్కరుకూడ రాత్రులయందు ఒంటరిగా బయటికి వెళ్లుటకు సాహసించుట లేదనియూ, అందరూ జాగరూకులై మెలగుచున్నారనియు తెలియజేసిరి. చలమ స్టేషనుమాష్టరు ట్రాలీబండీని స్టేషనుకు తీసికొని వచ్చిరని తెలియజేసెను. అతడు ఇంకనూ, ఇన్‌స్పెక్టరుగారు నంద్యాలలో యుందురనియూ, ఆ యా స్టేషన్లమధ్య అత్యవసరముగా వెళ్ళవలసి వచ్చినపుడు ట్రాలీబండిని నేను ఉపయోగించుకొనునట్లుగా అనుమతింప వలసినదని తంతిద్వారా బాలసుబ్రహ్మణ్యంగారు తెలియజేయుట ఉత్తమమనికూడ సలహాయిచ్చెను. బాలసుబ్రహ్మణ్యం వెంటనే తంతిద్వారా నంద్యాలలోని ఇన్‌స్పెక్టరును అవసరమైన ట్రాలీని ఉపయోగించుకొనుటకు పర్మిషనును కోరెను. ఈ రైల్వే ఉద్యోగులు నాకు చేయుచున్న సహాయమునకే, నేనెంతయో సంతసించితిని. నేను ఈ సాహస కార్యమును కొనసాగించి నంతవరకూ, వారు తమశక్తివంచన లేక నాకు సహాయ మొనర్చిరి.

స్టేషను మాస్టరును పనిచేసికొనుటకు వదలి, నేను ఇద్దరు గార్డులను, చెంచువానిని తీసికొని గ్రామమునకు బయలు దేరితిని. అప్పటికి రాత్రి బాగా ప్రొద్దుపోయినది. ఆ మరుసటి దినము ఆలస్యము లేకుండ ఉండుటకు, పశువుల యజమాని ఇంటికి వెళ్ళి యజమానిని నిద్రలేపి, మారాకమునుగూర్చి తెలియ జేసి, మధ్య వయస్సులోనున్న రెండు ఎద్దులు ఎరలుగా నుండుటకు కావలయునని చెప్పితిమి.

పశువులను, బెంగుళూరు, ముఖ్యముగా మైసూరు ప్రాంతములో ఎరలుగా ఉపయోగించుటకు కొనవలెననిన చాల కష్టము. పశువులను ఎరలుగాయుంచి, పులిచేతగాని లేక చిరుత చేతగాని చంపించుట నీచమైన పాపకృత్యమని వారు భావించెదరు. ఎంతోమంది మనుష్యులను చంపిన పులిని చంపుటకు ఎద్దులను ఎరలుగా ఉపయోగించుటకు వారు ఇష్టపడరు. కనుక ఈ సహకారముకొరకు వారికి అనేక విధముల నచ్చజెప్పుటకు కొన్ని గంటలకాలము పట్టును. ఈ పనికొరకు పశువులను కొనుట, అందులో అర్ధరాత్రి సమయమున, చాలసాహసోపేతమైన పని. కాని ఈ ప్రాంతపు ప్రజలు కార్యాచరణ పరాయణులు. ఆ పశువుల యజమాని మేము వచ్చినపని తెలియగనే సమ్మతించి, కావలసిన రెంటిని నన్నే ఎన్నుకోమని చెప్పెను.

పశువులశాల ఇంటివెనుక భాగములో నుండుట వలన నేను నా టార్చిలైటు సహాయముతో మధ్యవయస్సులో నున్న రెండు గోధుమవర్ణము కలిగిన ఎద్దులను ఎన్నిక చేసితిని.

పశువుల యజమాని ఒక్కొక్క ఎద్దును రు. 35-0-0 లకు అమ్మెను. నేను డబ్బుయిచ్చిన పిదప, అతనికి కృతజ్ఞత తెలియజేసి, రేపు ఉదయము వరకు ఇచటనే యుంచమని చెప్పితిని, అందులకు ఆ యజమాని సమ్మతించెను.

మేము స్టేషనుకు తిరిగి వెళ్ళునప్పటికి, స్టేషనులో గూడ్సుబండి ఆగియుండెను. ఆంగ్లో - ఇండియన్ డ్రయివరు స్టేషను మాస్టరయిన బాలసుబ్రహ్మణ్యం గారితో మాట్లాడు చుండెను. ఆ డ్రయివరు ఒక చేతితో కాఫీగ్లాసొక్క పట్టుకొని, రెండవచేతితో కాఫీత్రాగు చుండెను. స్టేషను మాస్టరు డ్రయివరుతో నన్నుగుర్చి చెప్పుచుండెను. నేను వెళ్ళగనే అతడు తనపేరు విలియం రోడ్జర్సు అని పరిచయముగావించు కొని కాఫీ పాత్రను అందించెను. అడగకుండగనే, ఆ డ్రయివరు వెంటనే, తనునాలుగు రాత్రులక్రితము నంద్యాలకు మైలు దూరములో పులియొకటి రైల్వేలైనును దాటినదని కూడ చెప్పెను. ఆ పులికి ప్రత్యేకమైన రంగు మొదలగు వింత విశేషములేమైనా ఉండిన తెలుపుమని నేను అతనిని అడిగితిని. యింజను ముందున్న లైటు కాంతితో అటువంటి వివరములను చూచుటకు వీలులేదనియు, అందులోనూ దూరమునుండి చూచిన అసలు కన్పించవనియు, కాని పులి మాత్రము చాల పెద్దదనియు జెప్పెను. నేనుగనుక దుప్పులను అడవిపందులను వేటాడదలచిన దిగువమెట్ట ప్రాంతములో కొల్లకొల్లలుగ నున్నవని, ఇచట చాల తక్కువనిగూడ అతడు చెప్పెను.

నేను రోడ్జర్సుకు కృతజ్ఞత తెలియజేసి, పులిని చంపిన తదుపరి దుప్పుల సంగతి చూచెదనని చెప్పితిని. అతడు నాతో కరచాలనము గావించి, రైనుక్లియరు తీసికొని, ఇంజను వైపు నకు వెళ్లెను. ఒక క్షణములో ఇంజను కూతవేసి, నల్లని పొగ వదలుచూ శబ్దము చేయుచూ బయలుదేరెను. బండి కొద్ది దూరము పోయిన పిదప వంకర తిరుగుట వలన, వెనుక నున్న ఎర్రని లైటు కన్పించకుండ పోయెను. మరల స్టేషను అంతయూ ప్రశాంతముగ నుండెను.

ఇంతలో నంద్యాలలోని ఇన్‌స్పెక్టరు వద్దనుండి చలమ లోని ట్రాలీబండిని నేను ఉపయోగించుటకు అనుమతి తంతి ద్వారా వచ్చెను.

స్టేషను మాస్టరు విశ్రాంతి గది తలుపులు తెరచెను. నేను అగ్గిపుల్ల వెలిగించి పైనుండి వ్రేలాడుచున్న నూనె దీప మును వెలిగించితిని. బాలా రైఫులును, ప్రక్కచుట్టను, నీళ్ళ సీసాను, టిఫెనునుంచు పెట్టెను లోనికి తెచ్చెను. స్నాన ముల గదిలో నీళ్ళులేవు. బాలసుబ్రహ్మణ్యంగారిని నీళ్ళను ఏర్పాటు గావించమని అడుగుటకుకూడ చాల ప్రొద్దు పోయెను. రూములో ప్రక్కకూడ లేదు. గదిలో ఉన్నదల్లా —మేజా ఒకటి, రెండు కుర్చీలు, ఒక పడక కుర్చీ మధ్యలో పెద్ద కన్నముగలది ఉండెను. ఆగది పైకప్పునందులకే సంతో షించి, లైటునుతగ్గించి, పడకకుర్చీలోపడుకుంటిని. నాశరీరములో నొక పార్శ్వము కుర్చీమధ్య కంతలోగుండ దూరిపోయెను. నేను బూట్లను విప్పి, పడుకుంటిని. తెలియకుండగనే నిద్రించితిని.

మరియొక గూడ్సుబండి తెల్లవారుజాము 4½ గంటలకు స్టేషనుకు వచ్చెను. తరువాత నేను మరల నిద్రించితిని. కొద్ది నిముషములు తర్వాత బాలా గదిలో ప్రవేశించి నన్ను మెల్లగా నిద్రనుండి మేల్కొల్పెను. నేను లేచి చూచునప్పటికి తెల్లవారిపోయెను. బాల సుబ్రహ్మణ్యముగారు కొద్ది గంటల సేపు విశ్రాంతి తీసుకొనుటకు యింటికి వెళ్ళెను. నా సూచనల ప్రకారము, బాలా మూడు రాళ్లనుచేర్చి పొయ్యిగా అమర్చి పుల్లలను తెచ్చి నిప్పంటించి టీ తయారు చేయుటకు గిన్నెలో నీళ్లు పెట్టెను. నేను వెంటతెచ్చిన చేతి స్టౌను వెలిగించి మాంసపు ముక్కలను కొన్నింటిని కాల్చితిని. నేను మాంసపు ముక్కలు వేడిచేయులోపల ఇంకనూ టీ నీళ్లు వేడెక్కలేదు. రైలుఇంజనులకు నీటిని సరఫరా చేయు పంపు ప్లాటుఫారము చివరలో యున్నది. నేను తుండును, సబ్బును టూత్ పేస్టు, బ్రెష్‌ను, కొన్ని దుస్తులను తీసికొని నీళ్ళపంపు దగ్గరకు వెళ్ళితిని. నేను ఈ వస్తువులను దూరముగానుంచి, తుండును కట్టుకొని నీళ్ళచక్రమును త్రిప్పగనే, 10,000 గాలన్లనీరు నిలువయున్న టాంకీనుండి నీరు పడుచుండెను. అంత ఎత్తునుండి నీరు వేగముగ నాపై పడునప్పటికి, నాకు దెబ్బ తగులుటయేగాక, నేను ఆ వత్తిడికి క్రిందపడితిని. నేను పండ్లు తోముకొని, స్నానము పూర్తిగావించితిని. అడవులలో మకాములలో నున్నప్పుడు నేను గడ్డము చేసుకొనవలయునను నియమమును అంతగా పాటించను. నావద్ద వళ్లుతుడుచు కొనుటకు రెండవ టవల్ లేనందున, నేను తడితుండుతో యున్నందున, కొద్దిగా చలిగా ఉండెను. నేను కొద్ది

నిముషములలో దుస్తులు ధరించి బాల దగ్గరకువెళ్ళు వరకు టీ నీళ్లు కాగుచుండెను. నేను బెంగుళూరునుండి తెచ్చిన చపాతీలు మాంసపుకూర గట్టిపడిపోయెను. నేను ఆ రోజు ఉదయము ఈ పదార్థములనే తిని, టీ త్రాగితిని. హిందూ దేశములో తెల్లదొరలు ఉదయముపూట అటువంటి పదార్థములను భోజనముగా తిందురు.

నేను ఈ పని అంతయూ పూర్తిచేసికొను నప్పటికి, ఫారెస్టు గార్డులిద్దరూ గ్రామమునుండి తిరిగివచ్చిరి. మేము నలుగురము కలసి బయలుదేరి గతరాత్రి కొన్న రెండుఎద్దులను తీసికొని, క్రిందటిదినము మేము ఎన్నికచేసిన తావులలో కట్టి వేయుటకు బయలుదేరితిమి. మొదటి ప్రదేశము యిద్దరు గార్డులు పులినిచూచిన ప్రదేశము. ఈ చోటు గ్రామమునకు ఒకమైలు దూరములో నుండును. కృష్ణప్ప గొడ్డలితో చెట్టు కొమ్మ నొకదానిని నరికి, ఒకకొనను చెక్కి భూమిలోనికి పాతెను. మకామును నిర్మించుటకు ఒకచెట్టును ఎన్నికచేసితిమి. నేను నావెంట తెచ్చిన తాడుతో ఒకఎద్దు వెనుక కాలును ఆ మేకునకు కట్టివేసితిమి, తరువాత మేము స్టేషను వైపుకువెళ్ళి పట్టాలనుదాటి బాలా ఇంటివరకు గల మూడు మైళ్ళదూరమును నడచివెళ్ళితిమి. క్రొత్తగుర్తులు ఏమియూ కన్పించనందున రెండవ ఎద్దును చెట్టుక్రింద యేటికట్ట స్లోపులో 50 గజముల దూరములో కట్టివేసితిమి.

మధ్యాహ్నమునకు కొంచెము ముందుగా మేము స్టేషనుకు వచ్చితిమి స్టేషనుమాస్టరు నన్ను తనతో భోజనము

చేయమని బ్రతిమాలెను. కాని నేను స్టేషనుమాష్టరుకు నచ్చ చెప్పి భోజనమునకు రానని తెల్పితిని. నేను వారిఇంటికి భోజనమునకు వెళ్ళిన అతడు కొంచెము బాధపడవచ్చును. అందువలన నేను గార్డులను తీసికొని భోజనము చేయుటకు గ్రామములోని ఒక చిన్న హోటలుకు వెళ్ళితిని ఆ హోటలు చాల చిన్నగది. పైకప్పు జింకుషీటుత్తోనూ, సగము గడ్డితోనూ కప్పబడి యుండెను. భోజనము ముగిసిన పిదప, స్టేషనుకువచ్చి. ఇద్దరు చెంచువాళ్ళకూ. ఎద్దులకు మేత నీళ్ళు పెట్టుట మొదలగు విషయమునుగూర్చి తగు సూచన లిచ్చితిని ఈ రెండు, ఎద్దులలో దేనినైన పులి చంపిన యెడల, వారీవార్తను స్టేషనుమాష్టరుంకు తెలియజేయు నట్లుగా ఏర్పాటు చేసితిని. స్టేషను మాష్టరయిన బాల సుబ్రహ్మణ్యంగారికి నేను వేరుగా చెప్పవసరములేదు. వారు వెంటనే ఈ వార్తను తంతిద్వారా నాకు తెలియజేసెదరు.

స్టేషనుమాష్టరు నాకొనర్చిన సహాయమును గూర్చి యిచట ఒకసారి వివరించుట మంచిదేమో. గోవునుగాని లేక ఎద్దునుగాని చంపించుటకు ఏవిధమైన సహాయ మొనర్చుట కైనను, అతని మతాచారములు సమ్మతించవని నాకు బాగుగా తెలియును. అసలు గోవులు హిందువులకు పవిత్రజంతువులు అతడు విశాల దృష్టితో, ప్రజల శ్రేయస్సు కొరకు, మతాచారములను ఖాతరుచేయక, నాకు ఏ విధమైన సహాయ మొనర్చుట కైననూ అతడు సిద్ధముగా నుండెను.

అచటికి ఆరుమైళ్ళ దూరములో నున్న బసవపురము స్టేషనుకు వెళ్ళుబండి సాయంత్రము రెండున్నర గంటలకు బయలుదేరెను. నేను యింజనులో ప్రయాణము చేయుటకు అనుమతిని కోరినదే తడవుగ డ్రయివరు అంగీకరించెను. నేను రెండువైపులనున్న అడవిని చూచుటకు యింజనులో వెళ్ళ వలయునని కోరితిని. ఆలీబేగ్ మాత్రం యింజను ప్రక్కనున్న మూడవ తరగతి పెట్టెలో ఎక్కెను.

నన్ను ఆబండి, బసవపురం యిరువది అయిదు నిముషములలో చేర్చెను. రైల్వేలైను కిరుప్రక్కల నున్న అడవిని చూచిన తదుపరి, నేను పులినీ చంపుపనిలో కృత కృత్యుడ నౌదునను ఆశ అడుగంటినది. ఆ ప్రదేశమంతయూ బ్రహ్మాండమైన అడవితో కూడుకొని యుండెను. కనుక పులి ఆ ప్రదేశములో ఎక్కడైననూ ఉండవచ్చు.

బసవపురం రైల్వేస్టేషనుకూడ గాజులపల్లి స్టేషనువలెనే యుండెను నేను బండిదిగి, డ్రైవరుకు కృతజ్ఞత తెలియజేసిన పిదప, గాజులపల్లిలో నేనురెండు ప్రదేశములలో ఎరలను కట్టి వేయించుట కేవలము నా పిచ్చిభ్రమ యనిపించినది. ఎందు వలననగా, ఈ ప్రదేశమంతయూ దట్టమైన అడవితో వ్యాపించి యున్నందున, పులి ఇచ్చటగాని, లేక ఇంకను దిగువ ఐదు మైళ్ళ దూరములో నున్న చలములోగాని ఉండవచ్చును.

యిచ్చటి స్టేషను మాస్టరుగూడ చాల సహాయకారి వలె కన్పించెను. అతడు మతాచారముల పట్టుదలలేని అరవ దేశీయుడని, అతనిపేరు మసిలామణి అనియు తెలిసెను. పరి

చయ మయిన వెంటనే అతని ఆదరణ, ఆప్యాయతలవలన, నేను ఎంతో సంతసించితిని. అతడు నన్ను విశ్రాంతిగదిలోనే బస ఏర్పాటు గావించుకొనమని చెప్పి, పులి తప్పక ఈ ప్రదే ములోనే యుండుననికూడ పల్కెను.

మామూలు ప్రకారము నేను స్టేషనులో నున్న వారిని విషయ సేకరణ కొరకు కొన్ని ప్రశ్నలడిగితిని. ఒక ఫారెస్టుగార్డు, గ్రామమునుండి కూడ వచ్చెను. అతడు ఆంధ్రుడు. అతడు స్టేషను మాస్టరుద్వారా, తనతోపాటు ఈ ప్రాంతములో నున్న తన సహచరుడైన రెండవ గార్డు, చలి జ్వరముతో బాధపడుట్వలన, సెలవుపై నంద్యాల వెళ్లెనని చెప్పెను. వారందరుకూడ పులులను అనేకసార్లు చూచితి మనియు, ప్రతివారు నరమాంస భక్షినే చూచితిమనికూడ చెప్పిరి. కాని వారిలో ఒక్కరూకూడ పులిరంగును, ఆకార మునుగూర్చి ప్రత్యేకతలను ఎవరూ చెప్పలేదు. వారిలో గార్డు ఆయిన కిట్టూమాత్రము రైల్వేలైనుకు ఉత్తరముగా ఒక మైలుదూరములో నీటి పట్టుగలదనియూ, జంతువు లన్నియూ నీళ్ళ త్రాగుటకు అచటకు వచ్చినపుడు, పులి కాలిగుర్తులు చాలా కనిపించినవనియు చెప్పెను.

మేము అరోజు సాయంత్రము నీటిపట్టువద్దకు వెళ్ళితిమి. నేను అచటకొన్ని పాతబడిన పులికాలి గుర్తులను, కొద్ది రోజుల క్రితపు చిరుత గుర్తులను చూచితిని. చిరుత కాలి గుర్తులు చూచిన పిదప, పులికన్న చిరుతయే ముందు నేను కట్టివేయించిన ఎరలను నాశనము చేయునని భయము

కొంచెముగ చిరాకుగూడ నాకు కలిగెను.• చిరుత తిరుగాడు ప్రదేశములలో, పులికొరకు ఎరలనుంచుట అంత మంచి పని కాదని తలచితిని. ఈ ఎరలను తప్పక చిరుతకు సమర్పించ వలసినదే.

నేను ఆ రాత్రి విశ్రాంతి గదిలోనే గడిపితిని. మరుసటి దినము ఉదయము ప్రక్క గ్రామములో నడివయస్సులోనున్న దున్నపోతునుగొని తెచ్చితిని. దీనిని నీటిమట్టమునను అర మైలు దూరములో కట్టివేసి, కిట్టూను ప్రతిరోజు అతని స్నేహితులతో వెళ్ళి దానికి మేతను, నీళ్ళను పెట్టమనీ, ఒక వేళ అది చంపబడిన వెంటనే, స్టేషను మాస్టరుకు ఈ విషయమును తెలియజేయుమని కూడ చెప్పితిని, బాల సుబ్రహ్మణ్యము గారివళె, మసిలామణి కూడ, ఈవార్తను నాకు వెంటనే తెలియజేయుటకు, తన సమ్మతిని తెలియ జేసెను.

కొంచెము లేటుగా వచ్చిన సాయంత్రము (గం.3-15) లకు బండి యింజనులో బయలుదేరి ఏడుమైళ్ళ దూరము లోనున్న చెలమ చేరితిని. ఇంజను డ్రయివరు హిందూ దేశీయుడే. ప్రయాణము చేయునపుడతడు, నాకు కట్టఎత్తుగా నున్న ప్రదేశమును చూపించి అచటనే ట్రాలీవానిని పులి ఎత్తుకొని వెళ్ళినదని చెప్పెను. ఆ ప్రదేశము సుమారుగా రెండు స్టేషనులకు మధ్యగ నున్నదనికూడ చెప్పెను.

మేము చెలమలోదిగి మామూలు పద్ధతినే అనుసరింప దలచితిమి. స్టేషనుమాస్టరువచ్చి సంతోషమును వెలిబుచ్చెను.

నేను వదలివచ్చిన• స్టేషనుమాస్టరుద్వార నారాకనుగూర్చి వినెననికూడ చెప్పెను. ఆయన ఆ ప్రాంతపు గార్డులను పిలిపించెను. వారు నేను వెళ్ళినప్పటికే ప్లాటుఫారముపై నుండిరి.

మేము మాట్లాడుకొన్న తదుపరి విశ్రాంతిగదిలో నిద్రించితిని. ఈ లోగా బసవపురంనుండి వచ్చిన గూడ్సుబండి గార్డు దిగువమెట్టలో ఒక స్త్రీని పులి చంపెనను వార్తను తెచ్చెను. దిగువమెట్ట స్టేషను ఇంకనూ దిగువ పదిహేను మైళ్ళ దూరములో యుండెను. బసవపురములో ఆ గూడ్సు బండి ఆగకుండా వెళ్ళినందున, గార్డు మాకీ విషయమును చెప్పుటకు వీలుపడలేదు.

ఈ తాజావార్తలు, నా ఊహలను తారుమారు గావించెను. నా ఆశలు అడియాసలైనట్లుగా నాకు తోచెను. నేను కేవలము అడివితోనిండిన నైశాల్య ప్రదేశములో పులి కొరకు వెదకుట, శ్రమతో కూడినపని. దీనికితోడు నేను పటముపై గుర్తించిన గుర్తులుకూడ తారుమారైనవి. కనుక పులి తప్పక గాజులపల్లి ప్రాంతములో నుండునని ఊహించితిని. కాని పులి దిగువ మెట్టప్రాంతములో అనగా ఇచటకు 27 మైళ్ళ దూరములో స్త్రీని చంపెను

కాని పులికి 27 మైళ్లు దూరమన్న అంతగా లెక్కించ వలసిన పనిలేదు. నేను, స్టేషను మాష్టరుని వీలైనచో ఈ వార్తను గురించి దిగువమెట్ట స్టేషను మాస్టరును విచారించ

మని అడిగితిని, తంతిద్వార పదునైదు నిముషములు సంజ్ఞ చేసిన తదుపరి దిగువమెట్ట స్టేషనుమాస్టరు పోలీసువారిని సంప్రదించి వార్తను గూఢి పరచెను. మొగలి పువ్వులను ప్రోగుచేసెడి చెంచు స్త్రీ రెండు రోజుల క్రితమునుండి కని పించుటలేదని పోలీసులకు రిపోర్టు వచ్చినదని చెప్పెను. ఆమె తరపు మనుష్యులు, ఆమె ప్రోగుచేసిన పువ్వుల బుట్ట కనిపిం చెను గాని, ఆమె జాడ తెలియలేదని చెప్పిరి. దిగువమెట్ట స్టేషను మాస్టరు, నేను, దిగువ అన్ని స్టేషనులలోనూ సజీవము లైన జంతువులను ఎరలుగా నుంచిన విషయమును తెలుసు కొనిన పిదప దిగువమెట్టలోనూ, దిగువమెట్ట చలను మధ్యలో నున్న "బొగాడ" స్టేషను సమీపములోనుకూడ ఎరలను తప్పక ఏర్పాటు చేయమని సలహా యిచ్చెను.

ఇంతటి విశాల ప్రదేశములో రైల్వేలైను పొడవునా ప్రతి స్టేషనులోనూ ఎరలను ఉంచి పులిని చంపవలయును.

మరుసటి దినమున నేను చలములో ఎరను ఎట్లు సంపా దించినది మొదలగు విషయములనుగూర్చి విపులముగా చెప్పిన యెడల, చదువుటకు మీ కాసక్తి యుండకపోవచ్చును. కాని నేను ఆ మరుసటి బండికే ఎందుకు బయలుదేరలేదో మీరు జ్ఞాపకముంచుకొనవలయును. ఆ చెంచుస్త్రీ చనిపోయి ఇప్పటికే రెండు రోజులయినదనీ, ఈపాటికే ఆమె శవమును ఎముకలతో సహా పూర్తిగా భక్షించి యుండవచ్చునని నాయూహ. కనుక నేను చలమనుండి బయలుదేరు లోపలనే ఎరను ఏర్పాటు చేసి వెళ్ళుట మంచిదని తలంచితిని.

ఆ రోజు సాయంత్రమే నేను బాగాడవచ్చి ఎరను ఏర్పాటు చేసితిని. మరుసటిరోజు ఉదయమే నేను దిగువమెట్ట వచ్చితిని. అక్కడ రెండు ఎరలను ఏర్పాటు గావించితిని. ఒక ఎరను చెంచుస్త్రీని చంపినచోట, రెండవదానిని సెలయేరు కాలి బాటకూడలి స్థలములోను ఉంచితిమి.

దిగువమెట్టలో కడుసమర్థుడు, తెలివిగల ఆటవికు డొక డుండెను. అతడు క్రైస్తవ మతస్థుడు. పూర్వము "హంగీ" చెట్టుకొమ్మలపై నిర్మించిన మకాముల నుండి అనేక పులులు కాల్చబడినవని చెప్పెను. అటువంటి చెట్టు రెండవఎర ఉంచిన ప్రదేశమువద్ద ఉండెను.

నేను ఈప్రాంతములో ఇప్పటివరకూ ఐదు రోజులు గడిపితిని. ఇంతవరకు ఏడు ప్రదేశములలో ఎరలను ఉంచితిమి. అనుకొన్న అంచనాకన్న ఎక్కువడబ్బు కూడ ఖర్చుపెట్టితిని. యిప్పటి వరకూ ఆ పులినిగూర్చి కథల రూపములో వినుట యే — గాని పులినిచూచి గాని, పులి అరపునుగాని ఇంత వరకూ వినలేదు. నేనువచ్చినప్పటినుండి అడవిప్రశాంతముగనే యుండెను.

దిగువ మెట్టలో, రెండు ఎరలను ఏర్పాటు చేసిన అడవి ప్రదేశమునకు నేను, జోసఫ్ కలిసి వెళ్ళితిమి. అతను నావలెనే పూర్తిగా మాంస హారి, పైగా బ్రహ్మచారి. నేను అతని ఆహ్వానమును పురస్కరించుకొని వెళ్లుటవలన అతనికి ఏమియు ఇబ్బంది కలుగదు. నేను దిగువమెట్టలో నుండు కొద్ది రోజులు అతని యింట వరండాలో నిద్రించుటకు ఏర్పాటు చేసికొంటిని

అంతకు ముందుగనే స్టేషను మాస్టరు ప్రయాణీకుల విశ్రాంతి గదిలో నుండుమని చెప్పెను. కాని వచ్చిపోవు బండ్ల రద్దీవలన నిద్రాభంగము కలుగునని తలచితిని. జోసఫ్ వద్దనున్న మలయాళీ నౌకరు, అతనితోపాటు కాలికట్‌నుండి వచ్చెను. అతనే జోసెఫ్‌కు ఆహారము నీళ్లు మొదలగు సౌకర్యములను చూచెడివాడు. అతనే, వంటచేసికొనుట మొదలగు పనుల నుండి నన్ను విముక్తుని గావించెను. అంతవరకు నేను కేవలము ఈవంటపనికొరకు ఎక్కువ కాలమును వినియోగించుచు సతమత మౌచుండెడివాడను.

నేను దిగువమెట్టులోనే ఉండవలెనని నిశ్చయించుకొనుటకు మరియొక కారణము గలదు. ఇచట మూడు రోజుల క్రితమే పులి చెంచు స్త్రీని చంపెను. మేము పులి చేత చంపబడిన దురదృష్టవంతురాలైన స్త్రీ యొక్క అవశేషములను కనుగొనుటకు తీవ్రముగా కృషి చేయనందుకు మీకాశ్చర్యము కలుగవచ్చును. మొదటికారణం, ఆస్త్రీ అవశేషములను కనుగొన్నందువల్ల కలుగుప్రయోజనము శూన్యము. అదియునుగాక పులి ఆమె శరీరమును ఈపాటికి ఏమాత్రము మిగులకుండా తినుటకు కావలసినంత వ్యవధికలదు. రెండవ కారణము అడవియంతయు పొడిగా నున్నది. అసలు పులి ఆమెను ఏవైపునకు ఎత్తుకొని వెళ్లినదోకూడ తెలియదు. మేము రెండువందల గజముల వృత్తాకారములో వెదకితిమి గాని మాకు ఏ విధమైన గుర్తులూ కన్పించలేదు. చివరకు ఆమె ధరించిన దుస్తులనుండి చిన్న పీలిక పడియున్నట్లుగాకూడ

కన్పించలేదు. చివరి కారణము నేను పైన చెప్పినట్లుగా, ఉపయోగము లేనప్పటికి, యిప్పటికే ఆమె బంధువులు ఆ ప్రదేశమంతయూ గాలించి, ఆమె బుట్టను కనుగొనిరి. యిపుడు ఆ ప్రదేశములో సంచరించి వాతావరణమును కలుషితము చేయదలచుకొనలేదు.

ఆ ప్రాంతపు అడవి అంతయూ చూచుటకు చాల అందముగ నుండెను. యిచట పక్షులనుగాని లేక లేళ్ళనుగాని వేటాడ వలయుననన్నూ, వేటగానికి నిజముగా ఆప్రదేశము స్వర్గతుల్యమైనటువంటిది. అడవిఅంతయూ గడ్డితో నిండి యుండెను. మా ర్యాకను గుర్రించి లేళ్ళు పరుగిడుటను చూచితిమి. అచట లేళ్ళే కొల్లకొల్లలుగ నుండెను. అడవిలో చిన్నచిన్న జంతువులు ఎక్కువగ ఉండుటవలన, నేను పులికొరకై ఏర్పాటుచేసిన ఎరలను పులి త్వరగా చంపదని ఊహించితిని. అసలు అడవిలో అన్ని జంతువులుండగా, పులి నరమాంస భక్షణకు అలవాటు పడుటకు అంతగా కారణము కనబడుటలేదు.

ఇచట ఆలీబేగ్‌తో పెద్దపనిలేదు కావున అతనికి టికెట్టుకొనియిచ్చి రాత్రికి గాజులపల్లి వెళ్ళుమనిచెప్పి నేను పెందలకడ పరుండుటకు వెళ్ళితిని. జోసఫ్ ఇంటివరండాలోకి రైళ్ళురద్దీ పెద్దగా వినిపించదు. కనుక నేను ఆరాత్రి సుమారు పదిగంటలసేపు నిద్రించితిని. గావున ఉదయమున నిర్మలముగ నుండెను. మళయాళీ నౌకరు మేము నిద్రించునపుడు విచిత్ర మైన రుచికరములైన పదార్థములను తయారు చేసెను. మేము

నిద్రనుండి లేచునప్పటికి ఒక పాత్రతోటి, బియ్యపు రొట్టెలు' అన్నము సిద్ధముగా తయారుచేసి పెట్టెను. రొట్టెలను బియ్యపు పిండితో, తయారు చేసెను. ఆపదార్ధములను మదరాసులో ఎక్కువగ తయారు చేయుదురు. నాకాతిథ్య మిచ్చుచున్న జోసఫ్ తప్పక మద్రాసునుండి వచ్చెనని ఊహించితిని. ఆ పదార్థములు చాల రుచిగ నుండెను.

• •

నేను స్నానముచేసి దుస్తులను ధరించు నప్పటికి, జోసఫ్ నాకొరకు వేచియుండెను. మేము క్రితము రోజు కట్టి వేసిన ఎరలను చూచుటకు గార్డులతోసహా వెళ్లితిమి. రెండు ఎరలూ సజీవముగనే యుండెను.

•

నేను అచట సమయము కొరకు వేచియుండుట తప్ప చేయగలిగినది ఏమియులేదు. పులిని వెదక వలెనన్న ఆ ప్రదేశము చాలా విశాలమైనది. పులి దిగువమెట్ట, గాజుల పల్లి ప్రాంతములలో ఎక్కడయిననూ ఉండవచ్చును. ఈ రెండు గ్రామములమధ్య దూరము యిరువదిఏడు మైళ్లు. అంతటి విశాల ప్రదేశములో పులి కొరకు వెదకుట దుష్కరము, నిష్ప్రయోజనమేగాక, కాలమును వృధా చేయుటయే. నేను ఇప్పటి వరకూ పులిని చూడలేదు. ఇంతవరకూ కృషీవలుని వలె కష్టించి అన్ని ఏర్పాట్లు గావించితిని. ఇక కొద్ది కాల ములో నా కృషి ఫలోన్ముఖము కానచ్చును.

ఏదైనా పనులు జరుగుట మొదలిడిన వరుసగా జరుగు చుండును. మరుసటి రోజు ఉదయము తొమ్మిది గంటలకు

బసవపురము స్టేషను మాస్టరయిన మసిలామణి తంతిద్వారా గతరాత్రి ఎర చంపబడెనని తెలియజేసెను. ఈ వార్తను వినిన వెంటనే నేను అంతగా ఆదుర్దా పడలేదు. ఈ ప్రదేశములో ఎరలను ఉంచుటకు ముందు చిరుతకాలి గుర్తులు కన్పించుటవలన, ఎరలను చిరుత వాతనుండి తప్పించుటకు గాను, వీలైనంత దూరముగా ఎరలను ఉంచితిని.

నేను స్టేషను మాష్టరును పిలిచి, ఫారెస్టు గార్డు అయిన కిట్టూను అడిగి అసలు ఎరను చంపినది పులియో లేక చిరుతయో కనుగొనుమని చెప్పితిని. కొద్దిసేపటిలోనే సమాధానము వచ్చెను. అతడు తంతి పంపుటకు సంజ్ఞ చేయునపుడు కిట్టూ తన ప్రక్కనే యుండెనని చెప్పెను. చిరుతపులియే ఎరను చంపినదనియూ, నన్ను వెంటనే వచ్చి చిరుతను చంపవలయునని, లేనియెడల తక్కిన ఎరలనుకూడ అది చంపునని కిట్టూ చెప్పినట్లుగా తెలియజేసెను.

ఈ సలహా మంచిదే, కాని ఆ ప్రదేశములో నాకు మామూలుగా వేటాడుటకు లైసెన్సు లేదు. నేను, నరమాంస భక్షకమైన పులిని చంపుటకు అటవీశాఖ చీఫ్ కన్సర్వేటర్‌గారి ప్రత్యేక ఆహ్వానముపై ఈ ప్రాంతమునకు వచ్చితిని.

కనుక నేను ముందు చిరుతనుచంపి, తరువాతఅటవీశాఖ చీఫ్‌కన్సర్వేటర్‌గారికి లేఖద్వారా, చిరుతను చంపుటకుగల కారణమును తెలిపి, అవుసరమైన తగినరుసుము చెల్లించుటకు కూడ సిద్ధముగనుంటినని తెలియజేయుటకు నిర్ణయించు

కొంటిని. నేను మసిలామణిగారి సలహాప్రకారము నడచుకొనుటకే నిశ్చయించితిని.

ఆదినము పగటికాలము బసవపురము వెళ్లుటకు రైలు బండిలేదు. అదృష్టవశమున ఆరోజు ఉదయము 11గంటలకు గూడ్సుబండి యొకటి అటు వెళ్లుచుండెను. స్టేషనుమాష్టరు ఆబండిని ప్రత్యేకముగా నాకొరకు ఆపెను. నేను బసవపురము వరకు గార్డుపెట్టెలో వెళ్ళితిని.

కిట్టూ నన్ను ఎరచనిపోయిన ప్రదేశమునకు గొనిపోయెను. అక్కడ ఆదృశ్యము చూచిన పిదప, ఆ జంతువును తప్పక చిరుతయే చంపినదని రూఢిగా తెలియుచున్నది. చిరుతలు సహజముగా మెడవద్ద గాయపరచి, పొట్టలో రంధ్రము చేయును. చిరుత గతరాత్రి ఎక్కువ భాగమును తినెను. అందువలన అది కొంచెము ఆలస్యముగాగాని ఇచటకు రాదని అభిప్రాయపడితిని. కిట్టూ అతని నులకమంచమును (మకాముగా ఉపయోగించుటకు) యిచ్చుటకు అంగీకరించెను. మేము తిరిగివచ్చి, మంచమును తెచ్చి, చెట్టుకొమ్మలలో బిగించునప్పటికి మధ్యాహ్నము రెండుగంటలయ్యెను. పని అంతయు పూర్తియగువరకు సాయంత్రము నాలుగు గంటలయ్యెను.

మకాములో నెక్కి కూర్చొనుటకు ఇంకను చాల ప్రొద్దుండెను. గనుక మేము స్టేషనుకి తిరిగి వచ్చితిమి. బిస్కట్లు, రొట్టెలు, టీ మొదలగు పదార్థములతో భోజనమును పెందలకడ భుజించితిమి. జోసెఫ్ కూడ నాతో

పాటు మకాములో కూర్చొన వలయునని చెప్పినమీదట, మేమిద్దరము తిరిగివచ్చి సాయంత్రము 5-30 గంటలకు మకాములో కూర్చొంటిమి.

నేను, చిరుతను ఆలస్యముగా వచ్చునని అభిప్రాయ పడితిని. కాని నేను పొరపాటు పడితిని. మేము మకాములో కూర్చొనిన యిరువది నిముషములకల్లా నేను వెనుకకు ఆనుకొని వీలుగా కూర్చొనుటకు ప్రయత్నించుచున్నపుడు, క్రింద కొద్దిగ శబ్దమయ్యెను. వెంటనే నేను క్రిందికి చూచితిని. చిరుత వెనుకకాళ్ళపై కూర్చొని శవమును తినుచుండెను. దానిని చూచిన తదుపరి దానిని చంపకుండ వదలవలెనని తలచితిని. కాని చిరుతను చంపకవదలిన అది తప్పక ఎరలను చంపును గాబట్టి, దాని ఎడమభుజము వెనుక కాల్చితిని.

మేము పెందలకడనే స్టేషనుకు తిరిగి వచ్చునప్పటికి, కిట్టూమసిలామణి ఆశ్చర్యము చెందిరి. వార్త వినగానే, స్టేషనుమాష్టరు నా కవుసరము లేనియెడల ఆ చిరుతచర్మము తనకు కావలెనని అడిగెను. నేనందులకు అంగీకరించితిని. మేము నల్గురు కూలీలు, పెట్రొమాక్సు లైట్లుతో సహా చిరుత చర్మము వలచుటకు వెళ్ళితిమి. నా పర్యవేక్షణతో చిరుత చర్మమును తీయుచుండగా, మసిలామణి ఆత్రుతగా చూచు చుండెను. బెంగుళూరులోని తోళ్ళను బాగుచేయువాని వద్దకు ఈతోలును పంపులోగా తాత్కాలికముగా కాఫర్ సల్ ఫేట్ ద్రావణము ఉప్పుతో ఈతోలును ఎట్లు జాగ్రత్తగా ఉంచవలయునో చెప్పితిని.

రెండవ రోజున, చనిపోయిన ఎరకు బదులుగా, మరి యొక ఎరను కొని ఉంచితిని, మేము ఈ ఎరను నీటిపట్టునకు సమీపములో పులి కాలి గుర్తులు కన్పించినచోట కట్టి వేసితిమి.

చిరుతను కాల్చిన తదుపరి నేను-జోసెఫ్‌తో కలసి ఆ రోజు సాయంత్రము దిగువమెట్టకు వెళ్ళవలయునని తలచితిని. మేము ఎరను కట్టివేసి, బసవపురము స్టేషనుకు తిరిగి వెళ్లినప్ప టికి, చలమ స్టేషను మాస్టరునుండి, గతరాత్రి పులి ఎద్దును చంపెనను వార్త వచ్చెనని ఆయన మాకు తెలియ జేసెను.

ఈ వార్త ఉదయము పదిగంటలకే నాకు చేరెను. కాని చలమకు వెళ్ళుటకు ఇంకా నాలుగు గంటలవరకూ బండిలేదు. అందువలన నేను ఐదు మైళ్లు నడచి చలమకు వెళ్లుటకు నిశ్చ యించుకొంటిని. జోసఫ్‌కూడ నడచుటకు సమ్మతిని తెలియ జేసెను. మేము చలమ వెళ్లినప్పటికి 11-30 గంటలయ్యెను.

నాకు తంతిని పంపిన స్టేషను మాస్టరు యిద్దరు గార్డులు నా రాక కొరకు, ఎదురు చూచుచుండిరి. గార్డులు, ఎరలకు నీరు పెట్టుటకు వెళ్లినప్పటికి, ఎరను పులి చంపి కొంతవరకు తిని వెళ్లినదని చెప్పిరి. మరియూ ఆ ప్రాంతములో నేలపై పులి కాలి గుర్తులు కన్పించుచున్నవనికూడ వారు చెప్పిరి. ఆలస్యముచేసి ప్రయోజనము లేదని, చెట్టుకొమ్మలు నరికి శవముపైకప్పి, నాకీ వార్తను అందజేయుటకు స్టేషనుకు వచ్చితి మని తెలిపిరి.

ఏడు ప్రదేశములలోనూ ఎరలను కట్టివేయునపుడు ప్రతి ప్రదేశమును జాగ్రత్తగా పరిశీలించి, ప్రతి ఎరకు దగ్గరలో చెట్టు ఉండునట్లుగాను, అవసరమైన చెట్టుపై మకాము నిర్మించుటకు అనువైన స్థలమునుగూడ ఎన్నికచేసితిని. అందు వలననే చిరుతను సునాయాసముగా కాల్చగలిగితిని.

ఫారెస్టుగార్డులిద్దరూ మంచమును దెమ్చుటకు వెళ్లిరి. నేను, జోసఫ్, స్టేషను మాస్టరు, కలసి భోజనము చేయుటకు గ్రామములోగల హోటలునకు వెళ్లితిమి. భోజనము చేయు నప్పుడు, జోసఫ్ మరల రాత్రికి నాతోపాటు మకాములో నుండదలచుకొన్నట్లు చెప్పెను. అతనికి కోపమురాకుండు నట్లుగా ఎంతో శ్రమపడి అతనిని వద్దనిచెప్పి ఒప్పించితిని. నేను చిరుతను చంపినప్పుడు అతడు నాతోపాటు మకాములో కూర్చునుట ఒకఎత్తు, యిప్పుడు నేనుపులినిచంప బోవునప్పుడు మకాములో కూర్చొనుట మరియొకయెత్తు. నేను చంపబోవు నది సాధారణమైన పులిగాదు. అందులోనుఅది నరమాంస భక్షి, మకాములో కూర్చొన్నవారివలన ఏమాత్రము శబ్దము గలిగినను లేక వారు కూర్చొనుటలో అటు, యిటు, కదలి నను, అది మమ్ములను, గమనించి పారిపోవును. నాకు గత ములో ఈవిధముగ నాప్రక్కనున్నవారు చేసినధ్వనివలన జంతువులు పారిపోయిన సందర్భములు గుర్తున్నవి. మకాము లలో రాత్రియంతయు కూర్చొనవలయునన్న వీలుకుదరకయో లేక విశ్రాంతిచాలకయో యేమాత్రమైనను కూర్చొనినవారు కదలుదురు. అట్లు కదలుటవలన శబ్దము గలుగు[illegible]యేగాక

ఆశబ్దమును పసిగట్టినవెంటనే జంతువు పారిపోవును. నేను యింతవిశాల ప్రదేశములో ఎంతోశ్రమపడి అనేకప్రదేశము లలో యెరలను ఏర్పాటు గావించినపిదప కార్యము విఘ్న మగుట నాకుయిష్టములేదు.

స్టేషనునుండి పులి యెరను చంపిన ప్రదేశము మూడు మైళ్ళ దూరములో గలదు. మేము ఒక గంటలో అచటకు నడచి వెళ్ళితిమి. నేను నులక మంచముతో మూడున్నర గంటలకు మకాము ఏర్పాటు గావించితిని. మంచము కనపడ కుండ కప్పుటకు అదేజాతి (చింత) చెట్టుకొమ్మలు దూరమున మరొక చింతచెట్టున నుండి నరికి తేవలసి వచ్చెను. నేను మకాము నిర్మించినది చింతచెట్టు పైనగావున చింతకొమ్మలను తెచ్చి మకాము కన్పించకుండ ఏర్పాటు చేసితిని. నేను మామూలుకన్న ఒకగంటముందుగనే మకాములో కూర్చుండు టకు సిధ్ధముగా నుంటిని. యిద్దరు గార్డులు, మంచమును చెట్టుకొమ్మలుపై బిగించి మకాము తయారుచేయు పనిలో నిమగ్నులై యుండిరి. జోనఫ్ వారికి క్రిందనుండి కొమ్మలను అందించుటకు తోడ్పడు చుండిరి. నేను ఈలోపల ఎరను, నేలమీదనున్న పులికాలి గుర్తులను పరిశీలించు చుంటిని. నేల చాలా గట్టిగా యుండుట వలన దానికాలి గుర్తులు కొద్దిగా మాత్రమే కన్పించు చుండెను. ఆగుర్తుల వలన అది చాలా పెద్దజంతువు యనియేగాక మగజంతువు అని తెలుసు కొంటినికాని గాజులపల్లిలో బాలా యింటివద్ద చూచిన గుర్తులు, ఈగుర్తులు ఒకే జంతువు, అని మాత్రము చెప్పుట

చాలా కష్టము. శాలా యింటివద్ద యిసుక నేలగాబట్టి అక్కడ దాని గుర్తులు, పెద్దవిగా కన్పడుటకు అవకాశము గలదు. యిచట మాత్రము నేల గట్టిగాను పొడిగాను ఉండెను.

నేను 4-30 గం. కల్లా మకాములో పీలుచూచి కొని కూర్చొంటిని. నేనుకొద్ది నిముషములు, టీ సీసాను, మంచి నీళ్ళసీసాను సర్దుకొనుటలో గడిపితిని. గ్రామములోని హోటలు వాడు మూడు పెద్ద చపాతీలను అరటి యాకులోపెట్టి రాత్రి భోజనమునకై యిచ్చెను. వీనిని నీళ్ళసీసా వెంబడి యుంచితిని. తరువాత టార్చిలైటును మందు తోటాలును సర్దుకొంటిని. ఈకాలములో వాతావరణము వేడిగ నుండుట వలన, దుప్పటిగాని, కోటునుగాని, తెచ్చి యుండలేదు. తలటోపీని మాత్రము వెంటతెచ్చితిని. తుదకు టార్చిలైటును రైఫిలుప్రక్క బందులతో బిగించి సిద్దము చేసితిని. జోసఫ్ తోను, గార్డులతోను, నేను స్టేషనుకు ఒంటరిగా తిరిగిరాగలనని చెప్పితిని. నాపనిలో నన్నువదలివారు వెళ్ళిపోయిరి.

క్రమముగా చీకటి పడుచుండెను. నా క్రింది గడ్డిలో అడుగువేసిన శబ్దము కొద్దిగా వినపడెను. చింతచెట్టు ఆకులు మృదువుగా నుండుటయేగాక అవి ఆ కృతిలో చాలాచిన్నవి. అవి క్రిందపడిన యెడల తివాచి పరచినట్లు వానిపైన నడచిన యెడల విశేషముగా శబ్దము గలుగజేయవు. అటువంటి శబ్దమును గుర్తించుట చాలాకష్టము అవే టేకుచెట్టు ఆకులైన వానిమీద కాలు వేయగనే దానిని వానికి, క్రొత్తగా వచ్చు

వారి రాకలు అవి యిట్టే తెలియజేయును. వచ్చునది జంతువు లయినను, లేక మనిషి అయినను, పూర్తిగా దృష్టికి అందక మునుపే శబ్దమును గలుగచేయును. కనుక యిప్పుడు వచ్చిన ఆ కొద్దిశబ్దము, పులి వచ్చుచున్నదను సంజ్ఞ అని మాత్రము తెలియును. పులి వచ్చుచున్నదని నేను ఆశ్చర్యము చెందనవుసరములేదు. నేను ముందుకువచ్చి వంగి తొంగి చూచితిని. ఆకృతిలో పులిది స్థూలశరీర మగుటవలన చింత ఆకులు పులి రాకవలన కొద్దిగ శబ్దము గలుగ జేయుటవలన అది వచ్చుచున్నట్లు గుర్తించితిని. అది కొద్ది క్షణములవరకు కన్పించలేదు. మరల కన్పించుటయేగాక ధైర్యముగా తను చంపిన ఎద్దువైపుకు వెళ్లెను. అది నావైపునుండి, వెళ్ళుచున్నది గాన దాని తల అంతగా కనుపడ లేదుగాని, దాని ఎడమ పార్శ్వము వెనుకకాళ్లు తోక కన్పించెను. నేను చెప్పినట్లుగా అప్పుడే చీకటి పడుచుండెను. రాత్రి సమయములలో అందులో అడవులలో రంగులను గుర్తించ లేకపోవుటయే గాక వస్తువులు వాస్తవ రూపముకన్న చాల పెద్దవిగా కనపడును. ఈ దేశములో ఎవరయినను సాయం సంధ్యవేళ అడవులో నున్నవారుకాని, లేక యింగ్లీషు దేశపు అడవిలో యున్నవారుగాని ఈ విషయము చెప్పుచుందురు. నాకు దిగువనున్న జంతువు చాల పెద్దదిగా కన్పించుచున్నది. కాని దానిరంగు బూడిదరంగు లేక వేరొకరంగో తెలుసుకొనలేక పోతిని. దాని చారలు మాత్రము మాసినట్లు కన్పించు చుండెను.

టార్చిలైటు సహాయము లేకుండ కాల్చుటకు చాలా కటికచీకటి. "అందులో నా రైఫిలు ముందుభాగమే నాకు కల్పించుటలేదు. కనుక నేను నా యెడమ బొటన వ్రేలితో లైటు మీటను నొక్కితిని. లైటుకాంతి పులి ఎడమ పార్శ్వమున, శవముమీద పడినది. పులి యింకను కాంతి యెట నుండి వచ్చినదో గుర్తించలేదని తెలుసుకొని, నేను త్వరగా కాల్చుటకు నిశ్చయించుకొంటిని. అదియుగాక పులి, లైటు కాంతి శవమునుండి వచ్చుచున్నది అని తలచి తీక్షణముగా చూచుచుండెను. యింతలో పులి నిలబడి చూచుచుండెను. నేను పులిని ఎడమ భుజముపై కాల్చితిని. అది శవముపైబడి కుడివైపుకు పొర్లిగింత పెట్టెను. దాని తెల్లనిపొట్ట, రొమ్ము, కన్పించెను. నేను మరల కాల్చితిని. నేను టార్చిలైటు వేసి చూచితిని. పులి చచ్చిపడి యుండెను.

నేను ఎందుకైనను మంచిదని, ఇరువది నిముషాలపాటు అప్పుడప్పుడు లైటును వేయుచు, ఆర్పుచూ, నిజముగా పులిని చంపితినో లేదోయని నిర్ధారణ యగువరకు కళ్లే చేసితిని. పిమ్మట చెట్టు దిగివచ్చి దానిని పరిశీలించితిని.

అది వయస్సులో నున్న మొగ పులి. కాని బాలా నాకు వర్ణించిచెప్పిన పులి మాత్రము కాదు. దీనిది నల్లటి శరీరము. దీని శరీరముపై చారలు కొంచము ఎడముగా నున్నవి. నేను చంపిన పులి నరమాంస భక్షియా ? లేక ఇంకొకటియా ? బాలా చూచినది దీనినేనా ? లేక వేరొక మామూలు ముసలి రకమా ? నాకు ఈ విధమయిన ప్రశ్నలు

అనేకము గుర్తుకు వచ్చెను. కాని మరల నెవరైన మనిషి చంపబడినగాని ఈ ప్రశ్నలకు సమాధానము దొరకదు.

టార్చిలైటు సహాయంతో నేను రాత్రి సుమారు తొమ్మిది గంటలకు స్టేషను చేరితిని. జోసఫ్ విశ్రాంతిగదిలో నిద్రించుచుండెను. తక్కిన యిద్దరుగార్డులు ప్లాటుఫారము మీద ఒక చాపవేసుకొని పరుండిరి. నేను వారినిలేపి జరిగిన విషయము చెప్పితిని. నేను యింత పెందలకడనే తిరిగి వచ్చి నందుకు వారు ఆశ్చర్యచకితులయిరి. జోసఫ్ కృతజ్ఞతా సూచకముగా నాతో కరచాలనము చేసెను.

నేను అతనికి మరల అభినందనలు తెలిపి. నేను కచ్చితముగా నరమాంస భక్షిని చంపితినని మాత్రము చెప్పలేనని తెలియజేసితిని. జోసఫ్ ఎందువలన అని తిరిగి ప్రశ్నించెను. నేను తగిన సమాధానమును చెప్పితిని. కాని జోసఫ్, గార్డులు యిద్దరుగూడ చాలాగట్టి నమ్మకముతో నేను తప్పక నర మాంసభక్షినే చంపితినని గట్టిగా చెప్పిరి.

స్టేషను మాస్టరు అప్పుడే ఆరాత్రినెళ్ళు బండ్లతనిఖీకై స్టేషనుకు వచ్చెను. అతడుగూడ ఈవార్తవిని చాలా సంతోషించెను. యిద్దరుగార్డులు, పులిని తెచ్చుటకు కొంతమందిని పిలుచుటకు వెళ్ళిరి. ఒక గంటలో పదిమంది మనుష్యులు దానిని తీసుకొని వచ్చుటకు, రెండులావుపాటి వాసములు, త్రాళ్ళు, రెండులాంతర్లు, తీసుకొని బయలు దేరిరి.

మేము శవము వద్దకువచ్చి, శవముతోసహా రాత్రి ఒంటిగంటకు స్టేషనుకు చేరితిమి. ఆశవమును స్టేషను చివర యినుప కటకటాలకు బయటగాఉంచి, రెండులాంతర్లు, నా టార్చిలైటు సహాయముతో, తోలుతీయుటకు మొదలిడితిమి. గార్డులకు తోలుదీయుట తెలియదుగాన, నేనే ఆపనిని స్వయముగా చేయవలసివచ్చెను. తోలుతీయు నప్పుడు జనము నాచుట్టూమూగిరి. గుంతకల్లువెళ్లు మెయిలు బండికూడ అప్పుడే స్టేషనులో ఆగెను.

బండిలోని ప్రతిప్రయాణీకుడు, డ్రయివరు, గార్డులతో సహా నాచుట్టూమూగి వింతగా చూచుచుండిరి. నన్నుగూర్చి వారు వింతగా చెప్పుకొనుట ప్రారంభించిరి. ఆబండిపదునైదు నిముషములు ఆలస్యముగావెళ్లెను. ఆకొద్దిలేటును వారెవరూ గుర్తించలేదు. అర్ధరాత్రిపూట, అందులో స్టేషనులో పెద్దపులి చర్మమును వలచుట, హిందూదేశములో కూడ సామాన్యమైన పనికాదు.

నేను తిరిగి బెంగుళూరు వెళ్లేవరకు, పులితోలును, కాపర్‌సల్ఫేట్ మరియూ ఉప్పుతోను చెడిపోకుండ ఉంచుటకు వీలగుదు.

ఆ మరుసటిరోజు నేను, పూర్తిగా విశ్రాంతి తీసికొంటిని. స్టేషనుమాస్టరు దిగువనున్నస్టేషన్లకు ఈవార్తను తంతిద్వారా పంపెను. ఈవార్తను వినగానే వారందరు చాల సంతోషించిరి. ఈవిషయము నాకంత తృప్తి లేనందున

నేనుపైలైన మరియొక వారమురోజు లుండుటకు నిశ్చయించు కొంటిని. నేను ఎరలను అన్నిప్రదేశముల లోనూ ఏర్పాటు చేసితినిగాన, యిప్పుడు బెంగుళూరువెళ్లి, మరలవచ్చి ఎరలను సంపాదించి వివిధప్రదేశములలో ఏర్పాటు గావించుట కన్న ఇచటనుండుటయే ఉచితమని భావించితిని.

నాలు రోజులు గడచెను. బాలా అను చెంచువాని భార్యను పులి జంపినదని గాజులపల్లినుండి వార్త వచ్చెను. నాకు తెలియకుండగనే బాలా మరల తన కుటుంబమును అడవికి గొనిపోయెను. బహుశః అతడు పులిబాధ విరగడ అయినదని తలచి యుండవచ్చును. నరమాంసభక్షి తన మామూలు ప్రకారము కొద్దిరోజులవరకు వేచియుండి మరల చంపి యుండవచ్చును.

జోసఫ్ ఈ లోపుగా దిగువ మెట్ట వచ్చెను. నేను స్టేషనుమాస్టరు బాల సుబ్రహ్మణ్యముగారిని, బాలాను సిద్ధముగా నుండుమని తంతినిపంపి, గాజులపల్లి వెళ్లుటకు యింకా నాలు గంటలవరకు ఏ బండియు లేకపోవుటవలన చలమనుండి ట్రాలిపై గాజులపల్లి వెళ్ళుటకు బయలు దేరితిని. నేను అచటికి వెళ్ళుటకు $1\frac{1}{2}$ గంట కాలము పట్టెను. నేను అచటికి వెళ్ళునప్పటికి బాలా ప్లాటుఫారముపై ఒక ప్రక్కగా కూర్చుండి ఏడ్చుచుండెను. స్టేషనుమాస్టరు, పోర్టరు గార్డయిన ఆలీబేగ్, కృష్ణప్ప, — ముగ్గురుకూడ అక్కడనే యుండిరి. ఈ చెంచువానికథ అది చిన్నదైనప్పటికి చాల శోచనీయమైనది. నేను చలమలో నరమాంస భక్షిని చంపితిని

అని తెలుసుకొనిన పిదప తక్కిన ఎరలు అన్నియు సజీవముగ నుండుటవలన, యీ పులినుండి ప్రమాదము లేదని తలచి బాలా తన కుటుంబమును, అడవికి రెండురోజుల క్రితము తీసుకొని వెళ్లెను. ఆరోజు ఉదయమే చెంచువానిభార్య నిద్రలేచి, పసివానిని భర్త ప్రక్కలోనుంచి బయటకు వెళ్లెను. కొద్ది క్షణములు తదుపరి అతడు తనభార్య అరపును కొద్దిగా వినెను తన భార్యకు ఏదో ఆపద వచ్చినదని తెలుసుకొని, అతడు వెంటనే గొడ్డలి చేపట్టి త్వర త్వరగా వెళ్లెను అక్కడ యేమియు కన్పడలేదు. ఇంకను అప్పటికి చీకటి పడకపోవుట వలన ఏమి జరిగినది చెప్పలేనని బాలా చెప్పెను. అతడు పెద్దగా ఆమెను పిలిచెను. కాని సమాధానములేదు. పరిసరములలో వెదకుచు ఆమె గుడిసె వెనుకకు వెళ్ళినదేమోనని అటు వెళ్లెను. అక్కడగూడ ఏమియు కన్పించలేదు.

గడ్డియంతయు ఆరాత్రి మంచుకురియుటవలన చెమ్మగా నుండెను. తెల్లవారిన పిదప ఆ చీకటిలో పులి ఆమెను ఎటు ఈడ్చుకొని వెళ్ళినది అతను గుర్తించ గలిగెను.

అతనికి రక్తపు గుర్తు లేమియు కన్పించలేదు. నర మాంస భక్షి మంచు పట్టిన గడ్డిలోగుండా నడచి వెళ్ళిన త్రోవను మాత్రము అతడు గుర్తించ గల్గెను. ఆ జంతువు నోటితో శవమును కరుచుకొని వెళ్ళిన దారి మాత్రము స్పష్ట ముగా కన్పడు చుండెను. బాలా తెలివితక్కువతనమువలన సాహసించి ధైర్యముతో పనికి పూనుకొనెను. ఒంటరిగా

చిన్న గొడ్డలిని ఆయుధముగా ధరించి పులి వెళ్లిన దారినే వెళ్లెను.

పూర్తిగా తెల్లవారిన పిదప రెండు ఫర్లాంగులు వెళ్లిన తదుపరి బాలా మొదటిసారి గడ్డిలో రక్తపు గుర్తులను కనుగొనెను. ఆ ప్రదేశములోనే పులి తన వేటను దించి మరల గట్టిగా పట్టుకొనెను. అతడు ఆవిధముగా వెదకుచు వెళ్ళుచుండగా చనిపోయిన ఎండు చెట్టు మొదటిలో పులి అప్పుడే శవమును చంపి తినుటకు ఉపక్రమించుటను చూచెను.

నరమాంస భక్షియు అతని జూచెను. చెవులు నిక్కించి అరచుచుండెను. ఆ మరుక్షణములో అది అతని మీదకు దుమికెడిదే. కాని తనభార్య శరీరము తనకనుల యెదుటనే పులిచేత భక్షింపబడుట అతనికి సహించరానిదయ్యెను. అతని మూర్ఖత, పట్టుదల, దుఃఖము, ధైర్యము యివి అన్నియు ప్రోత్సహించుట వలన అతడు తనచిన్న ఆయుధముతో పులి నెదుర్కొనెను. నేను పైన చెప్పిన విధముగా నరమాంస భక్షణము చేయు జంతువులకు ఒక విధమయిన పిరికితనముండును. అవి యెప్పుడుగూడ చాటుగా వచ్చి మీాద పడును. చాలా అరుదుగాగాని ముఖా ముఖిగా యెదుర్కొనవు. ఆరోజుకూడ నరమాంసభక్షి ఈలక్షణమునకు భిన్నముగ ప్రవర్తించలేదు. చెంచువాడు తనమీాదకు వచ్చుచున్నను అది యెదుర్కొనక పారిపోయెను. అదృష్టవశాత్తు బాలా అప్పటివరకు తెలివిగానే ప్రవర్తించెను. ఒకవేళ ఇంకను అతడు పులిని వెంబడించిన యెడల అది అతని

నెదురొ్కొని అతనిని నాశనము గావించెడిది. కాని అతడు వెంబడించక తన భార్య శవమును తీసుకొని గుడిసెకు పరు గిడెను. ఈకథ వినునప్పటికి నాహృదయము గర్వముతో పొంగిపోయెను. హిందూదేశము అటువంటి ధీరోదాత్తులను కలిగియుండుటయేగాక అందులోను ఆదినివాసుల తెగలో అటువంటి ధైర్యశాలి యుండుట ఎంతయో మహాభాగ్య ముగ పరిగణించితిని.

గుడిసెవద్ద బాలాకన్నీళ్ళతో నెంతోకాలమును వృథా బుచ్చలేదు. శవమును లోపలదాచి తనముసలి తల్లితో బిడ్డనుతీసుకొని వెళ్ళుమనిచెప్పి తలుపును జాగ్రత్తగా బిగించి స్టేషనుకు పరుగెత్తుకువచ్చి నాకు ఈవార్తను అందజేసెను. బాలా పనులను త్వరత్వరగా ముగించెను. పులివారల సావ కాశముగా తిరిగి శవమువద్దకు, గుడిసెవద్దకు వచ్చులోపలనే వారుస్టేషనుకు బయలుదేరిరి.

ఆ చెంచువాడు ఏడ్చుచునే తనకన్నీటి గోడును చెప్పెను. కాని నేను అతనిని ఓదార్చుటకు ప్రయత్నము కూడచేయలేను. అతనికన్నీళ్లు అతనికి మంచిని చేకూర్చును. బాలా అటు కన్నతండ్రిని, ఇటు చేసికొన్న ప్రియురాలిని కోల్పోయిన దుఃఖములో మునిగియుండెను. నేను నోటిమాట లతో అతనిని ఓదార్చలేను. అతనిజీవితములో ఏర్పడినఅగాథ విషాద ఆఘాతమును పూడ్చుటకు అతనికేమి సలహాయిచ్చుట కును నాకు తోచలేదు. కనుక ఆరోజు అతడు అనంతమయిన దుఃఖసముద్రములో మునిగియుండెను.

అతని కన్నీళ్లు ఎంతో సేపు ఉండలేదు. ఆదిమనివాసు లందరు కర్మయోగులే ! నేను అతనిని త్వరపెట్ట దలచలేదు. పదినిముషముల తదుపరి 'బాల' నిలబడి తాను ఏపని జేయుటకైనను సిద్ధమని ప్రతిజ్ఞపూనెను. నేనుదీర్ఘముగా యోచించి చేయవలసిన పనియంతయు ఒక ప్రణాళికగా తయారుచేసితిని. ఆప్రణాళికను ఆచరణలో పెట్టవలయునన్న బాలా కొంతత్యాగము చేయవలసి యుండెను. కాని అతనిని త్యాగము చేయుమని నేను కోరదలచుకొనలేదు. మా యిద్దరకు అడవితో ఒకవిధమయిన అవినాభావ సంబంధముగలదు. అడవిలో దీర్ఘకాలముండుట అతనికి జన్మహక్కయిన, నాకు అడవితో సమయోచితముగ ఇష్టపూర్వకమయిన అనుబంధము గలదు. అతడు నా కళ్లలోనికి చూచినపిదప అతని కళ్లు ఒక్కసారిగా నీళ్ళతో నిండిపోయెను. అతడేమియో చెప్పెను. ఆలీబేగ్ మధ్యలో కలుగచేసుకొని నాకీ విధముగా చెప్పెను. "ఆమె నా భార్య. ఆమెను నేను మనసారా ప్రేమించితిని. నీవు ఆమె శవమును ఎరగా ఉపయోగించి నాప్రియురాలి మరణమునకు, నా తండ్రి మరణమునకు కారణమైన ఆపులిపై పగతీర్చుకొనవలయును. నేను దొరగారిని కోరునదిగూడ అదియే!" ఇవి చెంచువాడు చెప్పినమాటలు.

నాకు కావలసిన మాటలను వాడు చెప్పిరి. ఇప్పటికే కాలము చాల వృథా అయినది. ఈ చెంచువాడు నాకు అప్పగించిన పనిలో నా పాత్రను త్రికరణశుద్ధిగా నిర్వహించుటకు నిశ్చయించుకొంటిని. బాలసుబ్రహ్మణ్యము తన భార్య

చేత తయారు చేయించిన శాఖాహార భోజనము తినుటకు లేచియుంటిని. రెండుసీసాలలో ఒకదానిలో టీ, రెండవదానిలో నీళ్ళు నింపుకొని, బాలా, యిద్దరు గార్డులు, మంచములతో సహా గుడిసెవద్దకు బయలు దేరితిమి.

చెంచువానిభార్య అసలే చినిగిన దుస్తులను ధరించెను. ఆమెను పులి ఈడ్చుకొనుట వలన ఆ దుస్తులు యింకను చినుగుటవలన బాలా ఆమె నడుముచుట్టు తనవద్దనున్న బట్టను చుట్టెను. ఆమె ముఖము చాలా ప్రశాంతముగ నుండెను. ఆమె శరీరములోని గాయములనుండి వచ్చిన రక్తము కొంత భూమిలోనికి యింకిపోయెను. ఆమె కంఠము, రొమ్ముపైన నుండి వచ్చిన గాయముల రక్తము గడ్డకట్టినది. మేము నలుగురము గౌరవ సూచకముగా ఒక నిముషముపాటు మౌనము వహించితిమి. ఆదేరోజు ఉదయము ఆమె ఆ పసిబిడ్డకుతల్లి, తరువాత మేముతలుపువేసి బయటకు వచ్చితిమి. తరువాత నేను పులి యే ప్రదేశములో శవమును భక్షించుటకు పూనుకొ నెనో, ఆ ప్రదేశమును చూపుమని బాలను అడిగితిని.

అప్పటికి కొంచెము పొద్దుయెక్కుట వలన సూర్యుని వేడిమికి మంచు అదృశ్యమయ్యెను. మంచులో పులిశవమును తీసుకుని రాత్రిపూట వెళ్ళునప్పుడు, మంచుతో బరువెక్కిన గడ్డి ప్రక్కకు వంగిపోయెను. మంచు ఆరిపోవుట తోడనే గడ్డి మరలనిలబడి గాలికి అటుయిటు కదలుచుండెను. బాలా, పులిశవమును మొట్టమొదటదింపి, పట్టు మార్పుకొనిన స్థలము

వద్దకు తీసుకొని వెళ్లెను. అచటినుండి రక్తపు గుర్తుల వెంబడి ఎండి పడిపోయిన చెట్టువద్దకు తీసుకు వెళ్లెను. అచ్చటనే పులి శవమును దించి తినుటకు ఉపక్రమించు నంతలో బాలా చూచి దానిని తరిమి వేసెను.

మేము నల్గురము నిశ్శబ్దముగా నడచి ప్రక్కకు వచ్చితిమి. మేము గుంపుగానున్నందున మాకు అంత ప్రమాదము ఏమియు లేదు. ఆ పడిపోయిన చెట్టును పరీక్షించి చూచితిమి. అచట నేల గట్టిగా నుండుటయే గాక యెండిపోయిన కొద్ది పాటి యెత్తుగల గడ్డి పెరిగియుండెను. ఆ గడ్డివలన అచట పులిగుర్తు లేమియు కన్పించుటలేదు. అచట వెతికినను ప్రయోజనము శూన్యము.

ఆ పులి, హైదరాబాదు వద్ద నవాబుగారిచేత గాయ పరచబడిన పిదప, మరల తను చంపిన శవమువద్ద తిరిగి వచ్చు అలవాటును కోల్పోయెను. అది అసలు మరల తిరిగివచ్చునా? నేను దాని కొరకు వేచియుండుట ప్రయోజనకరమగునా? నా మనస్సులో ఈ విధమయిన ఆలోచనలు మెలగుచుండెను. కాని ఆపులి ఈశవమును బొక్కడయినను తినియుండలేదు. పులిమరల తిరిగి వచ్చెననుటకు ఆశ ఇది ఒక్కటియే! కాని బాలా దానిని భయపెట్టి తరిమివేసెను. అందరుగూడ చాలా కొద్ది అవకాశమెగలదని చెప్పిరి. ప్రయత్నించుటతప్ప నేను జేయగలిగినది ఏమియులేదు. నేనుమంచమును యేచెట్టుపై కట్టుటకు వీలుయున్నదో వెదకుచుంటిని.

పులి తనఆహారమును తినుటకు చెట్లు తక్కువగానున్న ప్రదేశమును యెన్నికచేసినది. కాని ఆప్రదేశము పొదలతో నిండియుండెను. ఆపడిపోయిన చెట్టుతప్ప మరియొక చెట్టు 30గ॥ దూరములో నుండెను. నేనుగొంతుక కూర్చొనిపులిని కాల్చుటకు వీలగునేమోనని పొదలగుండా చూచితిని. సామాన్యముగా పులి చీకటిపడిన తదుపరిగాని తిరిగిరాదు. నేను అచటకూర్చొనిన, పులివచ్చిన, కాల్చవలెననిన, టార్చి లైటుకాంతి పొదలలోనికి చొచ్చుకొనిపోవుట చాలకష్టము.

నేను ఆ చెట్టు వద్దకు నడచివెళ్లి పైకి చూచితిని. కాని దాని కొమ్మలు నాచేతి వ్రేళ్ళకన్న లావుగాలేవు. కనుక నేను మంచమును మకాముగా అమర్చిన అవి నా బరువును మోయలేవు.

దీని తరువాత పెద్దచెట్టు యింకను 10 గ॥ దూరములో యుండెను. నేను ఆ చెట్టుపైకి యెక్కి ఆ పరిసర ప్రాంతము లను జూచితిని. పడిపోయిన చెట్టు బోదె పై భాగమున మాత్రము చూడ గలిగితిని. దాని కొమ్మలు దట్టముగా నల్లు కొనుటవలన నాకు క్రిందిభాగము అంతగా కన్పించుటలేదు.

యిచట నాకు చిక్కు సమస్య ఏర్పడినది. అసలు నే నెచట కూర్చొన వలయును?

నేను వారు ముగ్గురు ఉన్న ప్రదేశమునకు వెళ్ళి ఆ యెండిపోయిన చెట్టుచుట్టు తిరిగిచూచితిని. అది ఆగోజులలో

M. V. KRISHNA RAO
Minister for Education & Cultural Affairs,
Executive President,
WORLD TELUGU CONFERENCE
HYDERABAD 1975.

చాలా పెద్దచెట్టు. దాని అడుగుభాగము వైశాల్యము 12 లేక 15 అడుగుల వర కుండును. కాని ఆ చెట్టు యే కారణమువలన చచ్చినదో తెలియదు. ఏదోజబ్బు, క్రిమికీటకాదుల వలననో లేక తెగుళ్ళ వలననో చచ్చియుండును. భూమిలోని వేళ్ళు అన్నియు బుగిలిపోయి యుండెను. అది చాలా కొద్ది సంవత్సరములు క్రితమే చనిపోయి యుండునని నా ఊహ. దాని కొమ్మలు ఆకాశములోనికి చూచుచుండెను. చెదపురుగులు క్రింద చెట్టులోని భాగమును తినుటకు ప్రారంభించెను. కొద్దికాలములో బలహీనమై చెట్టు బరువును యిక యే మాత్రము ఆపలేదు. అది తప్పక భూమిపై పడిపోవును.

నేను చెట్టుబోదె దగ్గరకు వెళ్లి, నాతలయెత్తు ప్రాంతములో బోదెపైన మూడుకొమ్మలుండుట చూచితిని. క్రింద చెదపురుగులపై నలిమట్టి కమ్మియుండెను. నేను కాలిముని వేళ్ళపైలేచి చెట్టుబోదెలోనికి తొంగిచూచితిని. చెట్టుబోదె లోపల గుల్లగానుండెను.

కాని ఈఖాళీ బయటనుండి కనబడుటలేదు. అందులో నుండిపులి, స్త్రీశవమును ఉంచిన చోటునుచూచిన అసలు యేమాత్రము కన్పించుటలేదు.

నేను ఆ ముగ్గురివద్దకు వెళ్లి బాలాను చెట్టుతొఱ్ఱ లోపలికివెళ్లి నేను అందులోను కూర్చొనుటకు వీలగునేమో చూచిరమ్మంటిని. ఆలీబేగ్ ఈమాటలతనికి చెప్పెను. అతను వెళ్లులోపల నేను టార్చిలైటువేసి పాములు, తేళ్లు

లేవని రూఢిపరచుకొంటిని. అందులో చెదపురుగులుతప్ప యేమియులేవు అని తెలుసుకొనిన పిదప బాలా దానిలోనికి నిదానముగాదిగెను. అతను నాకంటె ఒక అడుగుయెత్తు తక్కువగనుక అతడు కన్పించుటలేదు. అతనుపైకివచ్చి తను కూర్చొనుటకు సరిపోయినది గాని, నాశరీరము కొంచము లావుగనుక సరిపోదని చెప్పెను. కనుక లోపల కొంత వెడల్పు చేయుట అవుసరము. చెదపురుగులు చాలాభాగమును తిని యుండుటను మేము గమనించితిమి. బాలా లోపలనుండి మేము ముగ్గురము బయటనుండి, కృష్ణప్ప, గొడ్డలితో కొట్టుచూ ఆకుళ్ళిపోయిన చెట్టును కొద్దిగా తొలచితిమి. చెదపురుగులు అదివరకే మా పని చాలా పూర్తిచేసినవి. మేము, తక్కిన పనిని పూర్తిచేసితిమి. ఆ రంధ్రమును భూమి వైపుకు పెద్దదిగా చేసితిమి. ఇప్పుడు లోపల ఖాళీ విశాల ముగా నుండెను. రెండవ వైపున గూడ కొయ్యను నరికి మోకాళ్ళ ఎత్తువరకు విశాలముగ నుండు నట్లు చేసితిమి. లోపల ఖాళీ అయిన కొలది బాలా తన చేతి గొడ్డలితో ఇంకా కొంత నరికి విశాలముగా జేసెను.

ఇది చాలా కష్టమయినపని గాబట్టి ఈ పని పూర్తి యగుటకు 2 గం॥ గాలము పట్టెను. నేను లోపలికి వెళ్లితిని. నా మోకాళ్ళవరకు ఖాళీ సరిపోయినది. నా మోకాళ్లనుండి అంత ఖాళీగా యుండుట వలన నేను చేతులను రైఫిలును, వీలు అయిన దిక్కునకు మార్చుకొన వచ్చును.

నేను ఆ చెట్టుతొఱ్ఱలో నున్నప్పుడు నాకు అనేక చిక్కు సమస్యలు యేర్పడినవి. పులి, స్త్రీ శరీరమును వదలిన వైపునకు నావీపు గలదు. పులిగనుక ఒకవేళ అచటికి వచ్చిన నేను అటు తిరిగి చూచుటకు వీలులేదు. ఎందువలననగా ఆ చెట్టు బోదె అడ్డముగలదు. బోదె రెండవవైపున చెదపురుగులు యెక్కువభాగమును తినెనుగాన, అటు కొయ్యను నరకుటకు వీలులేకుండెను. ఒకవేళ అట్లు చేయవలయునన్న మావద్ద అంపము లేదు సరిగదా పైగా శబ్దము వచ్చును. ఈ చిక్కుల వలన స్త్రీ శవమును, పులి వదలిన చోటునుగాక కొద్దిగా ప్రక్కగా నుంచితిమి. ఈ మార్పును మేము తప్పక చేయ వలసి వచ్చెను. ఒకవేళ మేము శవమును మార్చకయున్న నేను పులి వచ్చినదని తెలుసుకొను లోపలనే అది శవమును పూర్తిగా తిని వేయగలదు. లేక పులిని నేను చూడక మునుపే శవమునది దూరముగా తీసుకొని వెళ్ళగలదు. అప్పుడిక నేను బోదెనుండి బయటకు వచ్చి పులికొరకు వెదకవలయును. నేను బోదెలో యేమాత్రము కదిలినను శబ్దముగుటవలన నన్ను పులి యెదుర్కొను ప్రమాదము కలుగవచ్చును. ఒకవేళ అది పారిపోవచ్చుకూడ. లేక అది బోదెవెనుకగా వచ్చి నన్ను ఎదుర్కొన వచ్చును. కనుక ఆ విధముగా చేయుట నా కిష్టములేదు.

రెండవ ముఖ్య సమస్య నేను తెల్లవారులు నిలువు కాళ్లపై నిలచి ఉండవలయును. నేను బోదెలో కూర్చొను టకు వీలులేదు. చెట్టులోపలి ఖాళీ నేను నిలబడుటకు

మాత్రమే సరిపోయెను. మూడవ విషయము. అది శవము దగ్గరకు వచ్చినపుడు, అది తెలివిగా ఏ మాత్రము పైకి చూచి నను, నేను కనపడగలను. అయిననూ, నేను కన్పించకుండ నుండుటకు, ఏవో కొమ్మలను వారిచేత అడ్డముగా ఏర్పాటు చేయించగలను. కాని మనము అడవి జంతువును. అంత తెలి కగా మోసగింపగలమాయని నా సందేహము. ఆరోజు ఉదయము మోడుగా నున్న చెట్టువద్దకు పచ్చని ఆకులు, కొమ్మలు ఎలావచ్చెనని పులి తప్పక అనుమానించలదు.

తరువాత త్రాచుపాముగాని, తేళ్లుగాని, లేక మరియే యితర విషజంతువు అయినను ఆ చలిగాలి బారినుండి తప్పించుకొనుటకు బోదెలో చేరవచ్చును. నేను చాలా క్లిష్ట పరిస్థితిలో నుంటిని. ఆలోచించిన కొలది ఈచిక్కు సమస్యలు పెరుగుచుండెనేగాని తగ్గుటలేదు. ఇక నేను ఈ చిక్కులను లెక్కచేయక నాకు దొరికిన ఈ అవకాశములను సద్వినియోగ పరచుకొన దలచితిని. ఎన్ని యిబ్బందుల లైనను ఎదుర్కొని విజయమును సాధించుటకు నిశ్చయించుకొంటిని.

నేను నా కోటును నేలపైపరచి మేము నరకిన కొయ్య ముక్క లన్నింటిని జాగ్రత్తగా పోగుజేసి కోటుపైనవుంచి, కోటు నాల్గుమూలలు పట్టుకొని దూరముగా పారపోసితిమి.

తరువాత మేము గుడిసెవద్దకు తిరిగి వచ్చితిమి. బాలా తనభార్యశవమును భుజముపై వేసుకొని బయలుదేరెను మేము నిశ్శబ్దముగ చెట్టువద్దకు వచ్చితిమి. నేను ఆమె శరీ.

మును మేము ఏర్పరచిన రంధ్రమునకు కుడివైపుగా నుంచమని చెప్పితిని. అట్లుంచినయెడల పులి నన్ను చూడలేదు. రంధ్రములో నేను నిలబడినప్పుడు నేను రైఫిలునుతప్ప, అచట ఏమియు పెట్టుకొనుటకు వీలులేదు. నేనొక చపాతిని, కొద్దిగా టీ త్రాగిన తదుపరి ఆలీబేగ్‌ను ఆ సీసాను తీసుకుని వెళ్ళమని చెప్పితిని.

నేను చెట్టుతొట్టిలోనికి వెళ్ళితిని. బాలా మరియు కృష్టప్ప, ఈ విషయములో చాలా శ్రద్ధ వహించిరి. బాలా అప్పుడప్పుడు వెనుకకువెళ్ళి వివిధరకములుగా నేను వెలుపలినుండి కన్పించుచుంటినో, లేదో పరీక్షించెను. ఒక పెద్ద కొయ్యను నా రొమ్ములఎత్తులో తొట్టికు అడ్డముగా నా రైఫిలును పెట్టుకొనుటకు ఏర్పాటు జేసెను. నేను ఆ కొయ్య సహాయముతో బయటికి వచ్చుటకు వీలుగా ఏర్పాటు జేసెను. తరువాత వారు నేను కన్పించకుండునట్లుగా ఆ తొట్టిపై కొన్ని కొమ్మలను కప్పిరి. మొత్తముమీద నేను ఆ తొట్టిలో బంధింపబడిన వానివలె నుంటిని.

అచటినుండి, వెళ్ళిపోవుటకుముందు బాలా తనభార్య ముఖమును, పాదములను ముద్దాడి వీడ్కోలు చెప్పెను. తరువాత అతడు శవమునకు ఎదురుగా మోకాళ్లపై కూర్చుండి నేలపైబడి ఆమెశరీరమును ఈ విధముగా అగౌరవపరచినందులకు క్షమాపణ కోరుకొనెను.

అతడు లేచి నిలబడునప్పటికి అతనికన్నీళ్ళు అదృశ్యమయ్యెను. కానిఅతనిముఖము కాంతివిహీనమయ్యెను. అతడు

మాటాపలుకు లేకుండ నావైపుచూచుచుండెను. అతనిచూపులు నన్నీవిధముగా ప్రబోధించి నట్లుండెను. "నేను చేయవలసిన దంతయు జేసితిని. చివరకు నాప్రియురాలి శవమునుగూడ త్యాగ మొనరించితిని. ఆ శవమునాకు అత్యంతప్రీతికరమైన వస్తువు. ఇక తక్కినభారము నీదే !" నేనుగూడతప్పకవిజయ మును సాధింపవలయునని తలచితిని.

కొద్దిక్షణములతదుపరి నన్నొంటరిగావదలి ఆముగ్గురు మిత్రులు, గుడిసెవైపుకు వెళ్ళిరి. నేను గడియారములోచూడగా అప్పటికి 4-45 గం॥ లు అయ్యెను. సాయంసమయపు సూర్య కాంతిని ఆ శవముపైనున్న చీరరంగులను ప్రతిబింబింప జేయు చుండెను. ఆమెవెంట్రుకలు వదులుగానేలపై బడియుండెను. ఆమె ప్రశాంతమైనముఖము నావైపునకు ఉంచబడెను. ఆమె శవముకట్టెవలె బిగుసుకొని పోయియుండెను. ఆమె ఒకచేయి రొమ్ముపై అడ్డముగనుంచబడెను. రెండవచేయి ప్రక్కనఉంచ బడెను.

గాలికి ఆకులు, గడ్డి, కదలుటతప్ప, అంతా నిశ్శబ్దముగ నుండెను. నాచేతి వాచి చేయు శబ్దము నా గుండె కొట్టుకొను శబ్దము తప్ప, అచట నాకు మరి యే యితర శబ్దము విను పడలేదు.

నేను కాళ్లు కొద్దిగా జాపుకొని కొంచెము వెనుకకు ఆనుకొంటిని. నాకాళ్లు, ఆ రాత్రి అంతయూ నా బరువును మోయవలసి యుండెను. కనుక వాటికి సాధ్యమైనంత తక్కువ శ్రమ కల్గించుట నా ధర్మము.

నలుబదియైదు నిముషముల తదుపరి, అడవియంతయు తిరిగి చైతన్యవంతముగ గనిపించెను. అడవి నెమళ్లు, తదితర పక్షుల కూతలు వినిపించ సాగెను. జేగురురంగు కలిగిన పక్షి నాముందు తిరుగుచూ, పగటి కాంతి క్రమముగ క్షీణించి చీకటి పడుచున్న సమయములో, "కుక్ కీ' ఎకీ, ఎఖుక్ నే" అని అరచుచుండెను. ఇంతలో ఈ పక్షి అరపుకు సమాధాన ముగా, ఇంకొక పక్షి దూరమునుండి "పీక్, పీకుక్ ఖుక్ మే" అని అరచెను. నెమలి "మి-ఇయూ - మిా - ఇయో" అని దూరమునుండి విన్పించిన స్వజాతి పక్షుల అరపుకు సమా ధానముగా చెప్పినట్లుగ అరచుచుండెను. సీతాకోకచిలుకలు, ఇంక తదితర కీటకములు ఆ రాత్రికి తమ నివాసములు ఏదో చెట్టుపైనున్నట్టుగా ఎగిరి పోవుచుండెను.

క్రమక్రమముగా నాచుట్టు చీకటి ఆవురించుచుండెను. ఆకాశములో నక్షత్రములు మిణుకు, మిణుకు మనుచు ప్రకా శించుచుండెను. తెల్లవార్లు ఆ నక్షత్రముల కాంతితప్ప, ఏమియుకన్పించునట్లులేదు. దోమలు నన్ను కనుగొనుటకు కొంచెముసేపు పట్టెను. అవి వెంటనే నా ఉనికిని తక్కిన చీమలకు తెలియచేసెనా అన్నట్లుగా అవిఒక్కసారిగా నాపై దాడిని ప్రారంభించెను. నానోటిగాలితో ముఖముపైమూగు దోమలను తోలుకొంటిని. నాచేతులను పాంటుజేబులో నుంచి నా కాళ్లపైమూగు దోమలను పారదోలితిని.

సుమారు రాత్రి 8 గం. లయ్యెను. నేను మెల్లగ నొక్కొక్కకాలును కొంచెముపైకెత్తి బూటులోపలి పాద

ములో రక్తప్రసరణము జరుగునట్లు చేసుకొంటిని. ఈ పులికి శవము దగ్గరకు మరలి తిరిగివచ్చు అలవాటు లేనట్లుగా నాకు తోచెను. నేను ఈ రాత్రియంతయు నిలువుకాళ్లపై నిలబడ వలసినదే. యింతలో బాలా విచారవదనము, అతని భార్య శవము, నా కళ్లలో మెరసెను. నేను ఆక్షణములో నాకు చేత నయిన పనిని చేయుచున్నట్లుగా తోచెను.

ఈవిధమయిన ఆలోచనలు నామనస్సులో మెదలు చుండగా నేను అకస్మాత్తుగా వులిక్కి పడితిని. నాకుఏమియు కన్పడుటలేదు. శబ్దముగూడ వినబడుటలేదు. నా అనుభవ మునుబట్టి నరమాంసభక్షి నాకు అతిసమీపములో నున్న దని మాత్రము ఊహించితిని. నా శరీరములోని నవనాడులు వణకుచున్నట్లుగాతోచెను. నాకు యేదో అగోచరమయిన విషయము, — తెలియనిది చెప్పలేనిది సంజ్ఞచేసి నట్లుగ నుండెను. నిస్సందేహముగా పులి నా యెదుటకువచ్చెను.

నేను నా చెవులను నిక్కబొడిచి మరి శబ్దమును వినసాగితిని. కాని అచట అంతా నిశ్శబ్దముగ నుండెను. దుప్పిగాని, లేడిగాని, లేక మరొక జంతువుగాని పులిరాకను అరపుద్వార తెలియజేయలేదు. ఆ విధమైన నిశ్శబ్దము వలనను పులిశవముదగ్గరకు నిదానముగా వెళ్ళుటవలనను మనకు ఒక విషయము స్పష్టమగు చున్నది. పులి అనుమానించు చుండెను. దీనికంతకు కారణము బాలా ఆ రోజు ఉదయము దానిని భయపెట్టుటయో లేక ఆ పరిసరములలో పులి

మనుష్యవాసనను గుర్తించుటయో అయివుండవలెను. లేక అది నన్ను చూచి అయిననుండవలెను. అది నన్ను చూచి నదా! లేక వాసనపట్టినా ? ఈ రెండు ప్రశ్నలకు సరిఅయిన సమాధానము కొరకు చాలాసేపు ఆలోచించితిని. యింతలో నేను కొద్దిగా వాసన పీల్చుచున్న శబ్దమును వింటిని. పులి శవమును లాగుచుండెను.

• •

పులి శవమును దూరముగ తీసుకొని పోవుచుండెను. యింకొక్క క్షణములో అది దూరముగా వెళ్లగలదు. పులి శవమును లాగుట మానినపిదప నేను ఆయుధమును బయటకు తీసి, టార్చిలైటు వేసి, అది నన్ను కనుగొన్నను కాల్చుటకు నిశ్చయించు కొంటిని. పులి శవముతో అదృశ్యమయ్యెను.

యింతలో పులి శవమును తిను శబ్దము విన్పించెను. ఆ శబ్దము చెట్టుప్రక్క భాగమునుండి నా వెనుకనుండి విన్పడుచుండెను.

దీని కంతయు కారణము పులి శవమును ఉదయము యెచట వదలెనో అచటకే ఈడ్చుకొని వెళ్ళెను. అది బహుశః దాని సహజగుణమయి వుండవచ్చును. కాని, ఒక్క విషయము మాత్రము తెలియుచున్నది. నేను మొదట తలచినట్లుగా కాక, పులి ఇంతవరకు అనుమానించుటగాని నన్ను గుర్తించుట గాని జరుగలేదు. ఒకవేళ అది బహుశః ఆ శవమును, తినుటలో పూర్తిగా నిమగ్నమై యుండియుండును. అది నన్ను గుర్తించినా తప్పక యెదుర్కొని యుండెడిది. అది ఉదయము

శవము విడిచిపెట్టిన చోటనే తాను నా శవమును భక్షించ వల యునని కోరిక యుండవచ్చును. తనకన్న ముందర నక్కగాని, శివంగికాని, శవమును ప్రక్కకు ఈడ్చివుండవచ్చునని పులి అభిప్రాయమై యుండవచ్చును.

నే నిప్పుడు పులిని కాల్చవలెననిన చెట్టు తొఱ్ఱనుండి బయటకు రావలెను. బాలా, మరియు కృష్ణప్ప, నన్ను పూర్తిగా చెట్టుకొమ్మలతో, ఆకులతో బంధించినట్లు కప్పిరి. నేను బయటకు రావలెననిన ముందు వీనిని తీసివేయవలెను. అట్లు తీసివేయునప్పుడు కొద్దిగానైనను శబ్దముగాగలదు. పులి తప్పక నన్ను గుర్తించగలదు. అది పారిపోవచ్చు, లేక ఈ శబ్దమునకు కారణమును తెలుసుకొనగోరి వెదకుచూ నా వద్దకు రావచ్చును, లేక నన్ను గుర్తించవచ్చు.

ఈ స్థితిలో పులి పూర్తిగా శవమును తినుటలో నిమగ్నముగువరకు వేచియుండుట తప్ప నేను చేయునది వేరులేదు. పులి శవమును తినుటలో నిమగ్నమయ్యెను. ఈ లోపల నేను ఒక్కొక్క కొమ్మను మెల్లగా తీసి చెట్ల తొఱ్ఱలో నాకాళ్ళదగ్గర పెట్టుచుంటిని. ఈ విధముగా కొమ్మలనన్నింటిని తీసివేసితిని. నేను నాకుడికాలుఎత్తి కొద్దిక్షణములవరకు, రక్తప్రసరణము జరుగుటకు వీలుగానుంచితిని. పులి ఎముకలను కొరుకుచుండెను. నేను చెట్లపైభాగములో చేతులను వుంచి యెడమకాలినికూడ కుడికాలువద్దయుంచితిని. నేను యేయితర ఆధారములులేకయే చెట్టుబోదెపైకూర్చుంటిని. అదృష్టవశాత్తు

పులి శవమునుతినుటలో పూర్తిగా నిమగ్నమై యుండుటవలన నన్ను చూడలేదు.

ప్రతిపర్యాయము ఒక్కొక్క అంగుళముచొప్పున నేను చెట్టుచుట్టూ నిదానముగా వెళ్ళుచుంటిని. దాదాపునేను పులి దగ్గరకువచ్చితిని. పులిగనుక చెట్టువైపుజూచిన అదినన్ను తప్పక చూడగలదు.

యికనేను పులినికాల్చవలసిన సమయము అసన్నమైనది. కానియెక్కువ ప్రమాదము సంభవించుపరిస్థితికూడ గలదు. నేను రైఫిలునుపైకివుంచి, భుజముపైమడమునానించి ఒక్కొక్క అంగుళమే ముందునకుపోవుచుంటిని.

గాఢాంధకారములో సైతమువస్తువులను గుర్తించుటలో నాకుకొంతఅనుభవముగలదు. ఆ చీకటిలో పులినేలపైపరుండి శవమునుతినుచుండెను. పులిముఖము రెండవవైపునకు వుండుటవలన అదినన్ను అంతత్వరగాచూడలేదు. ఆ చీకటిలో రైఫిలుచివరిభాగము కన్పించదుగాన, నేనుతప్పక టార్చిలైటును వెలిగించవలెను.

నేను నాయెడమచేతి సహాయముతో రైఫిలును, భుజమునుండి క్రిందికిదించి కాల్చుటకు సిద్ధముగానుర్చితిని. నా ఎడమబొటనవ్రేలు టార్చిలైటుమీటను నొక్కెను. అచటి పరిస్థితులు బాగుండలేదనినట్లుగా పులికి అనుమానముకలెను. పులి భుజముపైగా వెనుదిరిగిచూచెను. ఆ లైటుకాంతిలో దానిముఖము మెరయుచున్నకళ్ళు రక్తమాంసములతోనిండిన

పెదెమలు స్పష్టముగా కన్పడుచుండెను. నేను మొదటిగా పులి మెడవద్దకాల్చితిని. పులిక్రిందపడి దొల్లిగింతలు పెట్టుచుండెను. నేను ఈలోపల రెండు, మూడు గుండ్లనుపేల్చితిని. అప్పుడు ఏమిజరిగినదో చెప్పలేనుగాని, పులిమాత్రము అదృశ్య మాయెను.

నేనుమొదటితడవ కాల్చగనే, అవిచాలబాధతోను, మరియొకవైపు కోపముతోను పెద్దగా గాండ్రించెను. అది పొదలలోనికి వెళ్ళిన తమపరిగూడ పెద్దగామొరిగెను. కాని, నేను దానినిమాత్రముచూడలేదు. అదిఅడవిలోనికి అరచుచూ పారిపోయెను. నేను మరలత్వరగా చెట్టుతొఱ్ఱలోనికివచ్చి ఏమిజరుగునో చూచుటకు వేచియుంటిని. మరల రైఫిలును గుండ్లతోసంసిద్ధముగా యుంచితిని. 405 లిన్ చెష్టరురైఫిలుతో మేగజైనులో ఎక్కువగుండ్లనుఉంచిన వరుసగాకాల్చవలెననిన వీలుపడదు. అందువలననేను మేగజైనును గుండ్లతోనింప లేదు. యింకనునావద్ద పులిమరలవచ్చిన ఒక గుండుమాత్రమే గలదు. రైఫిలులో ఐదుగుండ్లను ఉంచుటకు వీలున్నను, నేను ఇట్టి జంతువులను కాల్చుటకునాల్గు గుండ్లను మాత్రమె రైఫిలులో నుంచుచుంటిని.

నేను చెట్టు బోదెనుండి దిగి బయటకు వచ్చునప్పుడు జాగ్రత్తగా వచ్చితినా! లేదా! అని ఆలోచించితిని. అసలు నేను చెట్టు బయటనే యున్నయెడల ఇంకను బాగుండెడి దేమో. నేను కనీసము పులి నన్నెదుర్కొన బోవునప్పుడైె

నను చక్కగ చూచెడివాడను. ఇప్పుడు మాత్రము అది పొదలలోనుండి బయటకు వచ్చునంతవరకు నేను చెట్టు బయటనుండ దలచలేదు.

ఏది యేమయినను విచారించి ప్రయోజనములేదు. నా శరీరమంతయు చెమటతో నిండి యుండెను. రైఫులుగూడ చేతిలోనుండి జారిపోవునా అన్నట్టుండెను. నేను విసుగు జెందుటయేగాక, తలనొప్పిగూడ వచ్చెను. పులి ఇంకను పొద లలో మొరుగుచుండెను. కొద్దిసేపటిలో పులి అరపు క్రమ క్రమముగా తగ్గెను. పులి మాత్రము చావలేదు. అది దూర ముగ పారిపోయి యుండును. నాకు ఇక యేమాత్రము భయములేదు. దురదృష్టవశాత్తు పులి అరచుచూ యే దిక్కు నకు వెళ్ళినదియు నాకు జ్ఞాపకములేదు. అట్టి పరిస్థితిలో ఆ కారుచీకటిలో నేనూ, బాలా ఇంటికి వెళ్ళుట చాలా ప్రమాద కరము. నేను వెళ్ళుటకు టార్చిలైటు ఉపయోగించక తప్పదు. నే నా లైటు నుపయోగించిన పులిగనుక పొదలలో నున్న అది తప్పక నన్ను కనుగొనగలదు.

అందువలన నే నా రాత్రి యంతయు ఆ చెట్టు తొఱ్ఱలోనే గడిపితిని. తెల్లవారునప్పటికి నేను చాల అలసి పోయి యుంటిని. నేను సురక్షితముగ నుండుట నా అదృష్టమే! నాకు మిగిలిన సంతోషము అది యొక్కటియే!

తెల్లవారిన పిదప తొఱ్ఱలోనుండి బయటకువచ్చి కూర్చుంటిని. మీా రెప్పుడయిన తెల్లవార్లు సుమారు 13 గం॥

కాలము కాళ్ళపై నిలబడి యుండవలసిన సందర్భము వచ్చెనా? లేనిచో ఒకసారి ప్రయత్నించి చూడుడు.

పదిహేను నిముషములు బయట కూర్చుండియుంటిని. అప్పటికి పూర్తిగా తెల్లవారెను. ఆ పరిసర ప్రదేశమును జాగ్రత్తగ పరిశీలించితిని. నేనా రాత్రి చెట్టుకొమ్మలను, తొట్టిలోనుండి తీసి బయటకు వచ్చునప్పటికి, పులి 10 లేక 15 నిముషముల క్రిందటనే అచటికివచ్చి యుండును. అయి నను పులి సగము శవమును తినివేసెను. ఆమె మోచేతులు తల, శరీరమునుండి విడిపోయి, దూరముగా గడ్డిపైబడి యుండెను. ఒక తొడకాలు మాత్రము మిగలి యుండెను. తక్కిన శరీరమంతయు పూర్తిగా తినివేసెను.

పులి దెబ్బతగలగనే క్రిందపడి దొర్లాడిన గుర్తులు భూమిపై స్పష్టముగా అగపడుచుండెను. అది తరువాత దగ్గరలోనున్న పొదలోనికి దూరి పారిపోయెను. పొదల ఆకులపై అచటచట రక్తపుగుర్తులు కన్పించుచుండెను. నేను పులిని కాల్చిన తదుపరి, అది ఆ ప్రదేశమునుండియే పెద్దగా గాండ్రించెను. అచటనుండి రక్తపు గుర్తులు వరుసగా అది అడివిలోనికి పోయిన దారిపొడువున కన్పడు చుండెను. నేను ఆ గుర్తులవెంబడి కొద్దిగజముల దూరము వెళ్ళితిని. ఆ గుర్తులు ఉత్తరదిశగా వెళ్లెను. నేను సురక్షితముగా గుడిసెవద్దకు చేరగలిగితిని.

బాలా మరియు గార్డులు మెలకువగావుండి నేను కాల్చిన శబ్దమును వినిరి. తెల్లవారునప్పటికి వారు కొద్ది

దూరము అడవిలోనికి వచ్చి నా కొరకు ఎదురుచూచు చుండిరి. చెంచువాళ్ళిద్దరు నా కొరకు చెట్టువద్దకు వచ్చి యుండెడివారే. కాని ఆలీబేగ్, నేను పులిని గాయపరచితి నని, అదిఎక్కడ దాగినదో తెలియదని వారితో చెప్పుసరికి వారు ఆగిపోయిరి. ఆ రాత్రి జరిగినదంతయూ వారికి వివ రించితిని. అప్పటికి నా చేతి గడియారములో ఉదయము 6_25 గంటలయ్యెను. నేను ఆ రాత్రి 8_30 గంటలకు పులిని కాల్చితిని — అనగా సుమారుగా 10 గంటల క్రితము కాల్చితిని. కాని అది ఈ పాటికి చచ్చియుండునని నా ఊహ. ఒకవేళ చావకయున్న అది చాలరక్తమును కోల్పోయి బాధతో ఎచటనో పరుండియుండును. ఇక నేను పులిని వెద కుటకు బయలుదేరితిని.

ఆలీబేగ్ వద్ద ఆయుధమేమియు లేదు. కనుక నేను ఆలీ బేగ్‌ను గుడిసెవద్దనే యుండుమని చెప్పితిని. ఆలీబేగ్ ఒంట రిగా నుండుటకు భయపడి, మా వెంబడి వచ్చుటకే సిద్ధ ముగ నుండెను. అందరము కలసి చెట్టువద్దకు వచ్చితిమి.

నేను బాలాతో జరిగినదంతయూ చెప్పితిని. నేను చెట్టుతొఱ్ఱలోనుండి ఆకులను, కొమ్మలను తీసివేసి బయటికి వచ్చునంతలో పులిని తప్పక శవమును తిననీయవలసి వచ్చెనని కూడ బాలాతో చెప్పితిని. నేనీ విషయమును, చెప్పగనే బాలా అంగీకరించెను. మేము చెట్టువద్దకు చేరగనే, బాలా, పులి తినగా మిగిలిన తన భార్య అవశేషములను చూచి

నిశ్చేష్టుడయ్యెను. బాలా ఆ దృశ్యమును చూచి, పెద్దగా ఏడ్చుట మొదలిడెను.

ఇక బాలా ఆమెకు అంత్యక్రియలు జరుపవలెనని చెప్పెను. గార్డులిద్దరూ, నేను అతడు అంత్యక్రియలు జరుపకుండగ ఆపితిమి. అతను అంత్యక్రియలను అచటి కచటనే పూర్తిచేసెడివాడు. కాని ఆలీబేగ్ మాత్రము, అతనుగనుక అంత్యక్రియలు జరిపిన ప్రాంతీయ పోలీసులు బాలాను యిబ్బంది పెట్టుదురని మాతో చెప్పెను. పోలీసులు శవమును తనిఖీచేసి, రిపోర్టు పూర్తియగువరకు మనమేమియూ చేయుటకు వీలులేదనికూడ చెప్పెను. కనుక మేము చెట్లకొమ్మలను ఆ అవశేషములపై కప్పియుంచితిమి.

మేమందరమూ పులి అతి సమీపములోనే చచ్చిపడి యుండునని ఊహించితిమి. పులిచచ్చినయెడల మేము త్వరగా పోలీసులకు రిపోర్టుపంప వచ్చునని కూడ అభిప్రాయ పడితిమి. కాని మేము ఈ విషయములోనే పూర్తిగా పొర పడితిమి.

రక్తపుగుర్తులదారి వరుసగా పొదలలోగుండా వెళ్లెను. నాకు తెలిసినంతవరకు పులికి రెండుచోట్ల దెబ్బలు తగిలెను. నేను మొదటిగా కాల్చినదెబ్బ, దానికి మెడవద్దతగిలెను. గాయమునుండి రక్తము ధారగకారినట్లు కనిపించుచుండెను. అచ్చట కొద్దిమాంసపు కండలుకూడ పడియుండెను. రెండవ గాయము పొట్టకు తగిలియుండెను.

పులి మొదటగా రెండుఫర్లాంగుల దూరములోనున్న చెట్టువద్ద ఆగెను. ఆ చెట్టుక్రింద మాంసపుముద్దలు రక్తము పోగులుపోగులుగా పడియుండెను. బహుశ అది ఆనిర్భాగ్యురాలి మాంసమైయుండును. పులి ఆమాంసమును క్రక్కియుండును. పులి పొట్టలోనికితప్పక నేనుకాల్చిన రెండవగుండు వెళ్ళియుండును.

పులి అచటినుండి అరమైలుదూరమువరకువెళ్లి గడ్డిపై పరుండినట్లు గుర్తులు కన్పించుచుండెను. అచట రక్తము రెండు చిన్న సెలయేళ్ళవలె ప్రవహించెను. కనుకపులికి రెండుతావులలో దెబ్బలుతగిలియుండును. పొట్టలోతగిలినదెబ్బ చాల తీవ్రమైనది. పులి పొట్టలోగాయమునుండి ఎక్కువరక్తమును కోల్పోయెను.

ఏమైనప్పటికి ఆ జంతువు ఇంకను ముందుకు పోవుచుండెను. రక్తపుగుర్తులు మొట్టమొదటిగా ఎక్కువగానుండి పోను, పోను క్రమముగా తగ్గిపోయెను. పొట్టలోతగిలిన గాయము, లోపలికొవ్వువలనపూడి రక్తముకారుట ఆగిపోయి యుండవచ్చును. బహుశః దానిమెడవద్ద గాయమునుండి ఇంకనూ రక్తముకొద్దిగా కారుచుండెను. గుర్తులుఅచటచట కొద్దిగా మాత్రమే కనబడుచుండెను.

మేము రెండు కొండల మధ్యనున్న సెలయేటి వద్దకు వచ్చితిమి. పులి నీళ్ళలో పరుండినట్లుగా గుర్తులు కన్పడుచుండెను, అచట ఇంకనూ కొద్దిగా ఎరుపు జీరలు కనబడు

చుండెను. సెలయేటి రెండవకట్టపై బురదలో కూడ రక్తపుమరకలు కొద్దిగా కనబడుచుండెను. మేము చూచిన మొత్తము ప్రదేశ మంతటిలో ఇచట పులి కాలిగుర్తులు స్పష్ట ముగా కనబడుచుండెను. ఆ గుర్తులు చతురస్రముగ పెద్దవిగ కన్పడుచుండెను. అవి తప్పక మగజంతువువై యుండును.

పోయినకొలది ఇంకనూ గుర్తులు కనపడుచుండెను. రక్తపుగుర్తులు క్రమముగా తగ్గిపోయెను. పోను, పోను, అక్కడక్కడ బొట్లు కనపడుచుండెను.

నేను కాల్చిన మొట్టమొదటదెబ్బ పులి మెడవద్దనే తగిలెను. పులిక్రిందపడి దొర్లెనుగాబట్టిదానికి తప్పక దెబ్బతగిలి యుండును. తరువాత రెండుసార్లు కాల్చితిని. అందులో ఒకదెబ్బ దాని పొట్టకు తగిలెను. ఈ విషయము పులి కక్కిన రక్తమాంసము (స్త్రీశవము) లవలన తెలియుచున్నది. పులి బాధతో మొఱిగి పొదలోనికి పారిపోయిన చోటినుండి మేము రక్తపుగుర్తుల వెంబడే వెళ్ళితిమి. మొదటిలో రక్తపు గుర్తులు ఎక్కువగానూ, పోను పోను తక్కువగాను కన్పించెను. పులి మధ్యలో రెండుమూడు స్థలములలో ఆగినట్లుకూడ రక్తపు గుర్తులు కనబడుచుండెను. ఈ విషయముల ఆధారముతో గతములోని నా స్వానుభవముతో పులి ఈ పాటికి ఎక్కడో చచ్చి పడియుండునని ఊహించితిని. లేక చావునకు సిద్ధముగ నైనను ఉండి యుండవచ్చును. మేము దానిని వెదకునపుడు, అది మధ్య మధ్యలో ఆగినచోట పడినరక్తము వలన పై

విషయము తెలియుచున్నది. వాస్తవముగా, మేము ఇక, ఆ జంతువు చాల కొద్దిదూరము మాత్రమే వెళ్ళియుండునని ఊహించితిమి.

మా ఊహలకు భిన్నముగ ఆ నరమాంసభక్షి ఇంకనూ ఉత్తరదిశగా వెళ్ళుచున్నట్లు తెలియుచుండెను. దాని గాయములనుండి పడు రక్తమాంసపు కండలు, రక్తము అక్కడక్కడ దూరదూరముగ పులి వెళ్లినప్పుడు చెట్ల ఆకుల మీదను భూమిమీదను పడుచుండెను. ఇక పులిని వెదకుట చాలకష్టము. మేము ఇప్పటికే అడవిలోపలికి చాల మైళ్ళ దూరము వచ్చితిమి. ఇక ముందుకు వెళ్లుటకు అన్నియురాళ్లు దిబ్బలు, చిన్నచిన్న సెలయేళ్ళతో నిండియుండెను. త్రోవ సరిగాలేదు. అక్కడ ఎక్కడచూచినా నీరే. పులి ఏ సెలయేటిలోనైనా నీళ్ళు త్రాగవచ్చును. ఇక అడవి పోను పోను, పెద్దపెద్దచెట్లు తక్కువ. ముళ్ళ పొదలు ఎక్కువ.

12_50 గంటలకు మాకు ఇక రక్తపుగుర్తులు కన్పడుట లేదు. మేము అచట చాల ప్రదేశము వెదకితిమి. ఎండ చాల తీక్షణముగ నుండెను. మేము నిశ్శబ్దముగా గాజులపల్లి వెళ్ళితిమి. నేను విశ్రాంతి గదిలోని వడకకుర్చీలో పడుంటిని. బూట్లయిననూ విప్పకమునుపే, నాకు నిద్రపట్టెను.

బాలసుబ్రహ్మణ్యము ఆ రాత్రే తంతిద్వారా పోలీసులకు ఈ విషయమును తెలియజేసెను. నంద్యాలనుండి మరుసటి దినము మధ్యాహ్నమునకు పోలీసులు గాజులపల్లి వచ్చిరి. మేమందరమూ ఆ పడిపోయిన చెట్టువద్దకు వెళ్లితిమి.

ఆ దురదృష్టవంతురాలి శరీరమునుండి వాసనవచ్చు చుండెను. ఈవాసన సుమారుఫర్లాంగు దూరమువరకు కొట్టు చుండెను. ఆమె అవశేషములపైకప్పిన చెట్టుకొమ్మలపై గుంపులు గుంపులుగా కీటకములు ప్రాలి యుండెను. ఆ అవశేషములను గ్రద్దలనుండి కాపాడగలిగితిమి. నేను నాకథ చెప్పుచూ, ఆచెట్టుతోపులో నేనేను రాత్రిఅంతయు నిలబడితి నని సబ్ ఇన్స్పెక్టరుకు చెప్పితిని.

సబ్ ఇన్స్పెక్టరువ్రాసిన రిపోర్టుదాదాపు పదమూడు పేజీలయ్యెను. నేనిచ్చినస్టేటుమెంటు ఆరుపేజీలయ్యెను.

బాలా, తనభార్య అవశేషములకు అంత్యక్రియలు జరుపుకొనుటకు అనుమతినికోరెను. పోలీసువారు మాత్రము శవమును నంద్యాల తీసుకొనివెళ్ళి శవపరీక్ష జరుపవలెనని చెప్పిరి. ఆ శవమును ఎరగాయుంచినందులకు సబ్ ఇన్స్పెక్టరు అభ్యంతరము తెల్పునని నేనేమియు జోక్యముకల్పించుకొన లేదు ఒకవేళనేను ఏదైన చెప్పినయెడల, వారుఇంకొకచర్య జరుపవచ్చును. ఇద్దరుపారెస్టుగార్డులు చెప్పినతదుపరి, బాలాకు అంత్యక్రియలు జరుపుకొనుటకు అనుమతినొసగిరి. గార్డులు, బాలా కట్టెపుల్లలను ప్రోగుచేసి. ఆమెఅవశేషములకు అంత్య క్రియలను జరిపిరి. గౌరవసూచకముగా, నేనుగూడఅచటనే యుంటిని.

మరుసటిదినము బాలాముఖముచూచుటకు నేను చాల బాధపడితిని. నేను ఏదోబాలాకులోపము చేసినట్లుగ తోచి

నది, కాని బాలా ఈవిషయమును గ్రహించి బాలసుబ్రహ్మణ్యం గారితో సహా నావద్దకువచ్చి తాను చెప్పిన విషయమును దొర గారికి తెలియజేయుమని ఈ విధముగా చెప్పెను.” పులిని కాల్చిచంపనందుకు దొరగారిని విచారించవద్దని చెప్పు. దొర గారు శాయశక్తులా ప్రయత్నించిరి. ఇంక ఇతరులెవ రైనా — లేక నేనైనాసరే — అంతకన్నా చేయకలిగినది లేదు” అనెను.

ఇంక ఎవరైననూ అంతకన్నా ఎక్కువచెప్పి తృప్తి పరచగలిగిన దేమున్నది. నేను పైమాటలు వినిసంతోషించి, అతను నా కొనరించిన సహాయమునకు, అతని ఆదరణకు కృతజ్ఞత తెలుపుమని బాలసుబ్రహ్మణ్యంగారితో చెప్పితిని.

నేను గాజులపల్లిలో మరియొక వారముంటిని. కాని నరమాంసభక్షి జాడ తెలియలేదు. ఒక చిరుత మాత్రము దిగువమెట్టలోని ఎరనుచంపెను. నేను దిగువమెట్టవెళ్ళి పరి శీలించితిని. ఎద్దును చంపినది చిరుతయే. ఆ ఎద్దు అవ శేషములను చిరుతకు మరియొక రాత్రి భోజనమునకు వదలి వెళ్ళుట జోసఫ్‌కు ఏమాత్రము ఇష్టములేదు.

ఆ వారాంతములో నేను, నా నూతనస్నేహితు లంద రకు వీడ్కోలు చెప్పితిని. ఆ యా స్టేషనులలోని ఎరలుగా ఉంచిన ఎద్దులను ఆ యా ప్రాంతపు గార్డుల కిచ్చితిని. బాలాకు ప్రత్యేకముగ నొక కానుకకూడ ఇచ్చితిని.

నేను బెంగుళూరునకు తిరిగివచ్చి మూడుమాసము లైనది. పులి, హైదరాబాదు రాష్ట్రములో కృష్ణానది యొడ్డున ఒక మనిషిని చంపెను. మూడునెలల తరువాత బాగార రైల్వేస్టేషనుకు ఉత్తరదిశగా కొన్ని మైళ్ళ దూర ములో, పులి మరల ఒక చెంచువానిని చంపెను. పులి చంపిన మనుష్యులసంఖ్య అప్పటికన్న ఇప్పుడు. చాల తక్కువ. ఇంకా కొందరిని చంపవచ్చు.

నేను గాయపరచిన నరమాంసభక్షి గాయములనుండి కోలుకొని మరల మనుష్యులను చంపుట ప్రారంభించినదా ? ఒకవేళ ఆ ప్రదేశములో రెండు నరమాంస భక్షులున్నవా ? ఈ దిగువ మెట్టలో చెంచుస్త్రీని చంపినపులి, బాలాభార్యను చంపినది—ఈ రెండు వేరువేరు పులులా ?

ఇటీవల చంపినది ఆ నరమాంసభక్షియేనా—లేక రెండవ నరమాంసభక్షియా !—ఒకవేళ రెండు నరమాంస భక్షులు ఆ ప్రదేశములో తిరుగుచున్నవా ? ఒకవేళ ఇటీవల చంపినది వేరొక పులియా !

ఈ విధమైన ప్రశ్నలతో నేను అప్పుడప్పుడు బాధపడు చుండెడివాడను. కాని వీనికి సమాధానము లభించుటలేదు. తెలుసుకొనగోరినయెడల నాకు తెలిసిన విషయము మాత్రము చెప్పగలను.

2. గడేసాల్ అడవి యెనుము

నేను చెప్పబోవు ఈకథ మామూలు వేటనుగూర్చి చెప్పి. చివరకు కారెనుమును గాయపరచుటతోగాని, కాల్చు టతోగాని ముగించుకథవంటిది మాత్రముకాదు. ఒకవేళ మీకునిరాశ చెందవచ్చును. కాని నేనుఅడవి యెనుబోతును ఒక్కసారిగూడ కాల్చలేదు. ఇకకాల్చబోను. దానిధైర్య సాహసములకు నేను ఆశ్చర్యపడి మెచ్చుకొందును.

ఈ కారెనుము గొప్పధైర్యముకలది. పరాక్రమశాలి. ఆ జంతువుఇప్పటికి సజీవముగానున్న యెడల, అదితప్పక ఆ జాతిజంతులకు నాయకుడనిపించుకొనును. ఆ జంతువునన్ను పూర్తిగాఅవగాహన జేసికొనిన, నేను సగర్వముగ అది నాస్నేహితుడని చెప్పుకొందును.

గడేసాల్ కోయంబత్తూరు జిల్లాలోని ఉత్తరదిశగానున్న అడవులలోని ఒక కుగ్రామము. ఆ అడవిలో కారెనుములు చాలఎక్కువ. "కొల్లెగల్" పట్టణమునుండి దక్షిణముగా "డింబుమ్" అను కుగ్రామము గలదు. ఈ రెండుగ్రామము లకు మధ్యలో రోడ్డుప్రక్కగా ఎత్తైనప్రదేశములో అట వీశాఖవారి బంగళా ఒకటికలదు. గడేసాల్‌కు డింబుమ్‌కు

మధ్యదూరము ఏడుమైళ్లు. ఈ రోడ్డు డింబుమ్‌నుండి మైదాన మువరకే పల్లమునకుపోవుచు మధ్యలో అనేక చోట్ల మెలికలు తిరిగియుండును. ఆ మైదానమునుండి రోడ్డు సత్యమంగళము అనుపట్టణమువరకు సమతలముగ నుండును.

గడేసాల్‌కు పశ్చిమదిశలో చాల ఎత్తైన బిల్లిగిరి రంగన్ పర్వతపంక్తులుకలవు. ఆ కొండచరియలు కొండ శిఖరములు, కనిబొమ్మ ముడివలె ముందు ఉబ్బెత్తుగా కన్పించును. ఆ కొండ క్రిందిభాగము సెలయేళ్ళతోనూ, చెట్లు, పొదలతోనూ నిండియుండెను. ఈ ప్రదేశముఅంతా మధ్యమధ్య చిన్నచిన్న గడ్డిబీళ్ళతోను, రాళ్ళతోను నిండి యుండును.

తూర్పుదిశగా బిల్లిగిరిరంగన్ పర్వతములకన్న ఎత్తైన కొండలుగలవు. కొండ క్రిందభాగము అడవితో నిండి యుండెను. ఆ అడవిఅంతా వేలకువేలు తాళజాతి చెట్ల తోనూ ఎత్తైన గడ్డితోను నిండియుండెను. ఈ ఈతచెట్లు సంవత్సర మధ్యకాలములో పసుపురంగు కాయలు కాచును. ఈతకాయలనిన పక్షులకు మిక్కిలి మక్కువ.

ఆ ప్రదేశమంతయూ, చెట్లు, పొదలు, ఈతచెట్లతో నిండియుండుటవలన, ఆ ప్రదేశములో, లేళ్లు, ఎలుగుబంట్లు, కారెనుములను విరివిగా వేటాడవచ్చును.

ఈ కొండలమధ్య పెద్ద కొండలోయ ఒకటి ఉత్తరము నుండి దక్షిణదిశ వైపుకుండెను. కొండ లోయప్రక్కగా,

కొళ్లేగల్‌నుండి డిమ్‌బుమ్‌కు వెళ్లు రోడ్డుగలదు. ఆ రోడ్డు గడేసాల్ గ్రామముగుండా అటవీశాఖవారి బంగాళావరకు వెళ్లును.

అటవీశాఖవారి బంగాళాలలోకెల్లా ఇది చాలపెద్దది. ఆ బంగళా బయట అటవీశాఖ కూలీలుండుటకు వసుసగా చిన్న చిన్న వసతి గృహములు కట్టించిరి. ఆ బంగళాచుట్టూ పెద్ద ప్రహరీకలదు. ఆ ప్రహరీల లోపల అడవి గులాబి మొదలగు రకరకముల పూలచెట్లు కలవు. ఈ అడవి గులాబిపువ్వులు బంతిపూలను పోలియుండును.

ఆ బంగళాకు దక్షిణముగా •నేలపల్లముగ నుండును. అచట ఒక చిన్న నీళ్ళచెరువు కలదు. అచట పచ్చగడ్డి ఏపుగాపెరుగుటచే లేళ్ళమంద యొకటి అచటనే నివాస మేర్ప రుచుకొని యుండెను. నేను దానిని చూచునప్పటికి, వానిలో పెద్దజంతువు నలుపు యిటుకరంగుపై తెల్లనిమచ్చలు గల దాని నాయకత్వముక్రింద తక్కినవన్ని పారిపోయెను.

వేటకాడుకాని లేక క్రూరజంతువుగాని ఆలేడిని పట్టు కొనలేరని నా అభిప్రాయము. ఆ జంతువు ఆ గుంపునకు పెద్దగా ఆచల్లని వాతావరణము కలిగిన పచ్చికలో స్వేచ్ఛగా తిరుగుచుండెను.

ఆ రోడ్డుకు తూర్పువైపునున్న కొండలోయలో పచ్చిక ఎక్కువగా పెరిగియుండుటవలన, అడవియెనుముల గుంపులు అక్కడ నివాసముండుటకు అనువుగా నుండును.

ఒకమాదిరి సెలయేరు ఎల్లకాలము ఆలోయ పొడవున ప్రవహించుచుండును. దాని ఉపశాఖలు అక్కడక్కడ రోడ్డునకు అడ్డముగా ప్రవహించును. ఆ నీరు ఎల్లకాలములలోనూ — వేసవిలోకూడ ఉండుటవలన ఆ జంతువులు అచటనే శాశ్వత నివాసమును ఏర్పరచుకొనెను.

ఒక్కొక్క గుంపులో యిరువది నుండి నలుబదిసంఖ్య వరకు జంతువులుండును. వానిలో ఎక్కువభాగము ఆడ యెనుములు, దూడలు అరడజను పెద్ద మగయెనుములు ఉండును. వానిలో పెద్దది బలముగల యెనుము తక్కిన వానిపై అధికారమును చలాయించుచూ ఆ గుంపునకు నాయకత్వము వహించును. మరియొక యెనుము దాని సార్వభౌమత్వమును కూలద్రోసి ఆస్థానమును ఆక్రమించుకొను వరకు ఇది సాగును. సామాన్యముగా ఎనుము ఈడేరిన వెంటనే గుంపును వదలి ఏకాంతముగా జీవించును.

అడవులలో నివసించు ఈ ఎనుములు రిండర్ పెస్ట్ అను ఒకరకపు ప్లేగువ్యాధితో బాధపడుచుండును. ఈ వ్యాధి మొదటగా గ్రామములలోని పశువులకు సోకును. రైతులు వారివారి పశువులను మేతమేయుటకు అడవికి వదలుదురు. ఈ వ్యాధి క్రమముగా అడవిలోని ఎనుములకు వ్యాపించును. అడవిలోని ఎనుములకు ఒకవిధమైన గాళ్ళవ్యాధికూడవచ్చును. అది చాల ప్రమాదకరమైన వ్యాధి.

నేను చెప్పబోవు కథలోని కారెనుము ముప్పది జంతువులు గల గుంపునకు నాయకుడు. నేను చాలసార్లు, ఈ ఎనుమును ఉదయముపూట, సాయంత్రము 5-30 గంటలపుడు 39 మరియు 41 వ మైలురాళ్ళమధ్య రోడ్డు ప్రక్కన మేత మేయుచుండుటను చూచితిని. ఈ ఎనుమునకు ఎడమ కొమ్ము ముందుకు, వెనుకకు మెలికలు తిరిగి యుండును. అందువలన ఈ ఎనుమును తేలికగా గుర్తించవచ్చును.

ఆ ఎనుము చాల ముసలిది అగుటవలన, అది వికృతముగా తయారయ్యెనుగాని, దాని కుడికొమ్ము మాత్రము చూచుటకు చాల అందముగా నుండెను. వేటలో మంచి అనుభవము కలవాడుగాని ఆ ఎనుము తలకు విలువ నిర్ణయించలేడు. ఇంతవరకు దానిని ఎదుర్కొనినవారు లేరు. ఆ ఎనుమునకు పోట్లాటలో ఆ వంకరతిరిగిన కొమ్ము ఒక అమూల్యమైన ఆయుధముగ నుపయోగించును. నొసట కొమ్ముగల ఎనుముకన్ననూ, ఈకారెనుమునకు ఆ వంకరకొమ్మువలన అనేక లాభములుకలవు. నొసటకొమ్ముగల ఎనుములకవి కల్పించినవే. కవికల్పితములైన ఎనుములు నిజముగాఉన్నయెడల అవితలను పైకెత్తుటవలననే విరోధిని తనకొమ్మునకు గుచ్చికొనునట్లుగా చేయవచ్చును. లేకతలను ఆడించుటద్వారా విరోధిని రెండుముక్కలుగా చేయువచ్చును.

నేనుచాలచార్లు ఆ రోడ్డువెంబడి రాత్రిపూట మోటారుకారులో వెళ్లుచూ ప్రక్కకులైటువేసి, చూచుచూవెళ్ళితిని రెండుమూడుసార్లు దానినీలిరంగుకళ్లు లైటువెలుగులో మెరి

యుచుండుటను చూచితిని. నేను జాగ్రత్తగ పరిశీలించిన మీదట అవిముసలి యెనుము కండ్లని గ్రహించితిని.

కొద్దిసంవత్సరములకు క్రితము నేను మొట్టమొదటిసారి బిల్లిగిరిరంగన్ పర్వతపంక్తుల లోయలోనికి షికారుగానడిచి వెళ్లినపుడు, ఈ యెనుము నాదృష్టినిఆకర్షించెను. పెద్దరోడ్డు నుండి పశ్చిమముగా అడవిలోనికి మరియొకరోడ్డుచీలి గడేసాల్ గ్రామము ప్రక్కగావెళ్లును. ఈరోడ్డు లోయ ఆవలివైపున నున్న రాన్‌ఢోల్ఫ్‌మారీసు అనునతని బంగళావరకుగలదు. మారీసుఅనునతడు దక్షిణహిందూదేశములోని కాఫీతోటల యజమానులలోకెల్ల పెద్దఎక్కువపలుకుబడి కలవాడుకూడ. అతడువేటలో మంచిప్రావీణ్యము కలవాడేగాక అతడువేట అనువిషయముపై చాలవ్యాసములు కూడవ్రాసెను. ఆతడు ఆప్రదేశమునకే గౌరవనీయమైన వేటజంతువుల పరిరక్షకుడు. ఇండియా బ్రిటీషువారి పాలనలో నున్నపుడు, అతనువైస్రాయి ప్రభువులకు, గవర్నర్లకు, సుపరచితుడు. అతనికి దక్షిణ హిందూదేశములో చాలకాఫీతోటలుకలవు.

ఈ రోడ్డు కొండ పై భాగమునకు వెళ్లు త్రోవలో అటవీశాఖ వారు ఒక షెడ్‌ను, అటవీశాఖోద్యోగులు క్యాంపుకు వచ్చినపుడు ఉండుటకు, ఎవరైనా లైసెన్సు పొందిన వేటగాళ్ళ ఉపయోగార్థము కట్టిరి. ఎవరో తెలివిగల మహానుభావుడు లావుపాటి తీగలతో ఒక నిచ్చెనను తయారు చేసి అచట ఉంచెను, మకాములనుండి దిగుటకు, ఎక్కుటకు

ఈ నిచ్చెన బాగా ఉపయోగించును. అందులో చెట్లు ఎక్కుట అలవాటు లేని వారికిది మంచి ఉపయోగము.

ఒక రోజు ఉదయము నేను ఆ షెడ్ వైపుగా నడచి వెళ్లుచుంటిని. నాకు ఇంతలో ప్రక్కనున్న లోయలోనుండి, ఏదో ఎదురొక్కన్న శబ్దము దబాలున క్రింద పడిన శబ్దము వినపడెను. మధ్యమధ్య రంకెలుకూడ వినపడెను. ఈ ధ్వని రెండు కారెనుములు పోట్లాడుచుండుట వలన వచ్చినదని తెలుసుకొని నేను ఆ శబ్దము వచ్చిన వైపుగా పరుగిడితిని. కొద్దిసేపటిలో నా క్రిందభాగమునకున్న లోయలో నాకు సుమారు మూడు వందల గజముల దూరములో రెండు కారెనుములు తీవ్రముగా ఢీకొనుచుండెను. అవి రెండును ఒకదాని తలతో నొకటి బలముకొలదీ ఢీకొనుచుండెను. రెండును, తన శత్రువును వీలైనంత వెనుకకు నెట్టవలెనవిన ట్లుగా ముందరికాళ్ళను చాచి మరీ నడచుచుండెను. అవి ఒక దాని తలనుండి మరియొకదాని కొమ్ములను వీలైనంత త్వరగా తీసికొని శత్రువును ముఖముపై మరల తీవ్రముగా దెబ్బకొట్టు టకు త్వరపడుచుండెను.

ఆ రెంటిలో నొకదానికి వింతమైన కొమ్ము ఉండుటను చూచితిని. ఆ కొమ్మువలన, ఆ ఎనుమునకు శత్రువునకన్న ఎక్కువ వీలుగా ఉండెను, ఆ కొమ్ముతో, ప్రత్యర్థి మెడవద్ద, భుజములపైన, ప్రక్కల వెంబడి గాయపరచుట వలన రక్తము కారుచుండెను.

ఆ రెండు ఎనుములు తరువాత ఇంకనూ యిరువది నిముషములవరకూ తీవ్రముగ కుమ్ముకొను చుండెను. అవి బుసకొట్టుచున్న శబ్దము ఇంకనూ వినబడుచుండెను. ఆ రెండు జంతువుల పార్శ్వములు చెమటతోనూ రక్తముతోనూ తడిసి దూరమునకు తళ తళ మెరయుచుండెను. ఎనుముల నోటినుండి నురుగు ముద్దలు ముద్దలుగ పడుచుండెను.

నే నిదివరకెన్నడు ఎనుముల పోట్లాటను చూచి యుండలేదు కనుక, ఆ పోట్లాట ఎట్లుఅంతమగునో తెలుసు కొనుటకు నేనుకుతూహల పడితిని. అదృష్టవశాత్తు నేను ఆ రోజు అచటికి ఒంటరిగ వచ్చితిని. పైగాగాలి నా వైపునకే వచ్చుచుండెను. కాని ఆ యెనుములు నన్ను చూడక అతి తీవ్రముగా పోట్లాడుకొనుచుండెను.

కొమ్ము వంకరతిరిగియున్న ఎనుము ఆ కొమ్మును ఆయుధముగా ఉపయోగింపబడుట వలన, తన విరోధి అనేక చోట్ల గాయపడెను. గాయములనుండి కారుచున్న రక్తమువలన ఆ ఎనుము రక్తములో ముంచి ఎత్తినట్లుండెను. అయినప్పటికి, ఈ రెండవ ఎనుముకూడ తన విరోధి శరీరముపై చాల తీవ్రముగ గాయపరచెను. మొదటి ఎనుమునకు కొమ్ము వంకర తిరిగియుండుటవలన పొడుచుటకు వీలుగా నుండెను. తీవ్రముగ గాయపడిన రెండవ ఎనుము క్రమముగా తూలి క్రిందపడుట మొదలిడెను. అవి క్రిందపడినప్పుడెల్లా వంకరకొమ్ము గలిగిన ఎనుము, తన విరోధి శరీరముపై, తన, కొమ్ముతో గాయపరచు చుండెను. రెండవ ఎనుము చిట్ట

చివరకు పారిపోవుట మొదలిడెను. మొదటి ఎనుము దానిని తరిమి తరిమి పీలైనప్పుడు రెండవ ఎనుము వెనుక భాగములో పొడుచుచుండెను. ఆవిధముగ రెండు యెనుములు కొద్దిసేపటిలో అడవిలోనికి అదృశ్యమయ్యెను.

నేను ఆతురతతో అవిపోట్లాడుకున్న ప్రదేశమును చూచుటకు వెళ్లితిని. ఆ ప్రదేశమంతయూ రక్తము, మాంస పుకండలు, నురుగుముద్దలతో తడిసియుండెను. అవి పోట్లా డుకొన్న ప్రదేశము సుమారు యిరువదిగజముల వ్యాసముగల వృత్తమువలెనుండెను. ఆ ప్రదేశములో వానికాళ్ళగిట్టల గుర్తులు స్పష్టముగా కనబడుచుండెను.

నేను మరల కొద్దికాలముతరువాత ఆ కారెనుమును చూచితిని. నేను ఆరోడ్డు 41 వ మైలువద్ద రెండుఫర్లాంగులు తూర్పువైపుగా ఒకనీటిపట్టువద్దకు వెళ్లినప్పుడు రెండవసారి, ఆ ఎనుమునుచూచితిని. పులియొకటి గడేసాల్ గ్రామము నకుచెందిన రైతులపశువులను రెంటినిచంపెను. వారు అనేకసార్లు పులి ఆనీటిపట్టుమీదుగా రోడ్డునుదాటి వెళ్లుటను చూచితిమనికూడ చెప్పిరి.

నేను సాయంత్రము 4-30 గంటలకు ఆ నీటి పట్టు వద్దకువెళ్లి అచటికి ఏయేజంతువులు వచ్చుచున్నవో పరీక్షించు చుంటిని. నాకచట, ఏనుగు, ఎనుము, లేడి, దుప్పి, అడవి పందులకాళ్ల గుర్తులు కన్పించుచుండెను. పులికూడ అచటికి నీరు త్రాగుటకు మూడు పర్యాయములు వచ్చినట్లు అచటి

కాలిగుర్తులనుబట్టి, ఊహించితిని. పులి చివరిసారి మూడు రోజులక్రితమే అచటికి వచ్చినట్లు గుర్తులు కన్పించుచుండెను. అచట కన్పించిన ఎనుము కాలి గుర్తులను బట్టి, ఆ ఎనుము ఆకృతిలో చాల పెద్దదని ఊహించితిని. ఎనుము చాల బరువు గనుక, ఆ బురదలో దాని కాలి గుర్తులు అడుగు లోతునకు దిగియుండెను. దాని కాలి గుర్తులు ఆ పరిసరములలో అనేకచోట్ల స్పష్టముగ కన్పించుటవలన, ఆ ఎనుము అచటికి తరుచుగా వచ్చునని స్పష్టమగుచుండెను. ఆ ఎనుము నీరుత్రాగుటకు సమీపములో నది యున్నప్పటికి, నీటిపట్టు దగ్గరకు వచ్చుట చాలా ఆశ్చర్యకరమైన విషయము.

నాకు పులినిగూర్చి చెప్పిన షలోగా కూడ నావెంట వచ్చెను. ఈ ఎనుమును గూర్చి తనకు తెలిసిన దంతయును నాకు చెప్పుమని కోరితిని. అతడు ఆగ్రామస్థులు ఆ ఎనుమును అనేక పర్యాయములు వంకర కొమ్ము కలిగిన ఎనుము ఎడమ కొమ్ము వంకర తిరిగి ముందునకు చొచ్చుకొని వచ్చిన దానిని చూచితిమని చెప్పెను. వెంటనే, నేను చూచిన ఆ ఎనుముల పోట్లాట, వంకర కొమ్ము కలిగిన ఆ ఎనుము జ్ఞప్తికివచ్చెను, షలోగా చెప్పిన ఎనుము నేను చూచిన ఎనుము ఒకటే అయిన, ఎనుములకు కొమ్ము వంకర తిరిగియుండుట చాల అరుదు అని ఊహించితిని.

ఆ ఎనుము నీటిమడుగు వద్దకు తరచుగా వచ్చునని, ఆ ఎనుము ఒక గుంపుకు పెద్దయని, అవి నీళ్లుత్రాగుటకు అచ

టికి ఎక్కువగా వచ్చునని చెప్పెను. మరియు ఆ లోయఅంతయు చక్కని పచ్చని మైదాన మగుట వలన అవి అచట మేత మేయుచుండెనని చెప్పెను. నేను అతనివెంట కొద్దిదూరము నడచి వెళ్లిన, తప్పక, ఎనుమును గాని, లేక, పులిని కాని చూడగలమని కూడ చెప్పెను. నేను పులిని చంపవలెనను కోంటినిగాన, ఎనుమును చూడవలెనను ఆసక్తి అంతగాలేదు. కనుక పులిని చూడవలెనను ఉద్దేశ్యముతో వెళ్లుటకు సమ్మతించితిని. పగటి కాలములో కారెనుమును వేటాడ వలయు నన్న, యుక్తితోపాటు, గాలి ఏదిశకు వీచుచున్నదీ మనము నక్కియుండుటకుగల అవకాశము మొదలగు పరిస్థితులన్నియు గమనించుట అవసరము.

మేమిద్దరమూ జంతువుల కాలిగుర్తుల వెంబడి వెళ్లుచుంటిమి. మేము సన్నని బాట వెంట పోవుచున్నప్పుడు మా ముందర ముప్పది గజముల దూరములో గడ్డిలో పెద్ద కారెను మొకటి పరుండియుండెను. దాని తల, కొమ్ములు, భుజములు గడ్డికన్న ఎత్తుగా కనబడుచుండెను. అదిమమ్ములను చూచి బెదరక, నిర్లక్ష్యముగ కదలక మెదలక యుండెను. అది నా స్నేహితుడైన వంకర కొమ్ము కలిగిన ఎనుమే!

అది నిర్భయముగా నిలబడి మావంక చూచుచుండెను, మేము పదిగజములు ముందుకు వెళ్లితిమి. ఎనుము గడ్డిలో శబ్దము చేయుచూ వెనుదిరిగి పారిపోయెను. ఆ తరువాత కూడ నేను అనేక పర్యాయములు ఆ కారెనుమును చూచితిని. నేను ఎనుమును చూడగనే, ఆ సంఘటన జ్ఞప్తికి వచ్చుచుండెను.

ఒకానొకప్పుడు వేటగాడొకడు దొంగతనముగా ఆడ ఎనుమును వేటాడి చంపెను. ఈ లోపుగా మగయెను మొకటి అతని జీపుకారును ఢీకొని ప్రక్కనున్న నది పాయ ఒడ్డున యున్న గొయ్యిలోనికి దొర్లించెను. అతనితోపాటు వెళ్ళిన షలోగా జీపు దగ్గరయుండి ఆ ఎనుమును పరీక్షగా చూచెను. జీపులో ఉన్న వేటగాని కాలికి కొద్దిగా దెబ్బతగిలెను. రైఫులు విరిగిపోయెను. కాని అతనిని మాత్రము ఎనుము వెంబడించ లేదు, ఎనుము ఎడమకొమ్ము వంగియుండెనని షలోగా చెప్పెను.

నేనీ సంఘటననుగూర్చి తరువాత వింటిని. ఎనుము అతనిని వెంబడించక, వదలినందుకు సంతోషించితిని. ఎనుము జీపుకారును నదిలోనికి తోయగనే శత్రువును తాను నాశనము గావించినట్లుగా భావించెను. అచట గుంటలేకున్న యెడల, అది జీపులోని మనిషిని చూచి పూర్తిగా నాశనను గావించెడిది.

1953వ సంవత్సరము నవంబరు నెలలో నేను డింబుమ్ వెళ్లినప్పుడు గడేసాల్‌లో ఆగకుండ రోడ్డువెంబడి కారులో పోవుచు ప్రక్కనే ఒక మనిషి నడచి పోవుటను చూచితిని. నేను ఆ ప్రాంతములో మకాముచేయునపుడు "రాచెన్" అను షలోగాను వెంటతీసికొని పోయెడివాడను. నేను వెంటనే అతనిని గుర్తించి తమిళభాషలో "వార్తలేమిటి" అని ప్రశ్నించితిని.

రాచన్ వెంటనే, రెండురాత్రుల క్రితము గ్రామము నకు దగ్గరగా, పులి మఱియొక జంతువు పోట్లాడుకొనుట వలన భయంకరమైన ధ్వనిని గ్రామస్థులు వినిరని చెప్పెను. పోట్లాట జరిగిన కాలమును బట్టి పులిని ఎదుర్కొనిన జంతువు ఎలుగు బంటు అయిఉండవలెను. కాని ఆ పోట్లాట గంటలతరబడి జరిగెనుగాన, పులిని, ఏనుగు ఎదుర్కొని యుండునని వారు దలచిరి. ఒకవేళ ఏనుగు పులిని ఎదుర్కొనిన, ఏనుగు సామాన్య ముగా బాధతో ఉన్నప్పుడుగాని లేక కోపముతో ఉన్నప్పుడు గాని, బిగ్గరగా ధ్వనిచేయును, ఆరాత్రి ప్రొద్దుపోయిన కొలది శబ్దము వినిపించుట క్రమముగా తగ్గెను. తరువాత ఎక్కువగా గాయపడిన పులి గాండ్రింపు వినపడెను.

మరుసటిరోజు ఉదయము పల్లెగాలందరూ ఏమిజరిగి నదో చూడవలెనను కుతూహలముతో, ఆరాత్రి జంతువులు పోట్లాడుకొన్న ప్రదేశమునకు వెళ్లిచూచిరి. అచట పొద లన్నియూ చెల్లాచెదరై యుండెను. ఆ పొదలప్రక్కనే ఏనుముకొమ్ముతో చీల్చి చెండాడబడిన పులిశవము పడి యుండెను. పల్లెగాలు పులిశరీరమును తీసికొనిగ్రామము నకు వెళ్లిరి.

నేను ఈ కథవినునప్పటికి మిట్టమధ్యాహ్న మయ్యెను. నేనుకూడ ఆ ప్రదేశమును చూడవలెననితలచితిని. నేను, అతనుకలసి కారులో గడేసాల్ గ్రామమునకువచ్చి యెండ బెట్టియున్న పులిచర్మమును చూచితిమి. పల్లెగాలు ఆ పులి చర్మమునకు బూడిదపూసి యెండబెట్టిరి.

చర్మమునుబట్టి ఆ పులి చాలాపెద్దజంతువు. లోపలి చర్మమును పరిశీలించినపిదప ఆ యెనుము తనవాడిఅయిన కొమ్ముతో అయిదారుచోట్ల పులినితీవ్రముగా గాయపరచినట్లు స్పష్టమగుచుండెను. పులియెడమవైపున యెనుము కొమ్ము పులిగుండెవరకు దిగెను. ఆదెబ్బతో పులిచచ్చియుండెను.

• •

పులి చర్మమును చూచినపిదప అవి పోట్లాడుకొను ప్రదేశమును చూచుటకు యెక్కువ ఉత్సాహపడితిని. కావున అచటనే వదలి కొంతమంది షలోగాలతో కలసి ఆ ప్రదేశమును చూచుటకు బయలుదేరితిమి. ఆ సంఘటన జరిగిన ప్రదేశ మా గ్రామమునకు అరమైలు దూరములోపున నుండుటవలన నేము అచటకు త్వరగా చేరగలిగితిమి.

నేను ఆ ప్రదేశమును చూచిన పిదప, దానిని "యుద్ధరంగము" అని పిలుచుట యుచితమని తలచితిని. అచ్చట నిజముగా భయంకరమైన పెనుగులాట జరిగినట్లుగా స్పష్టముగ కన్పించుచుండెను. ఆ పరిసర ప్రదేశములలోను సమీపమునను పొదలపైనను రక్తము విరజిమ్మినట్లు కన్పడుచుండెను. కాని నేము వెళ్లినప్పటికి రక్తము తడి ఆరిపోయినది. పులి పడియున్న ప్రదేశమునుగూడ షలోగాలు నాకు చూపిరి.

అచట కన్పించిన రక్తమునుబట్టి యెనుముగూడ తీవ్రముగ గాయపడి యుండునని ఊహించితిని. నేను వెంటనే ఆ పరిసములలో వెదకి చచ్చిపడియున్న లేక చావునకు

సిద్ధముగనున్న ఆ యెనుమను కనుగొనవలెనని అభిలాష పడితిని. అయినను, ఆ యెనుము యింతరక్తమును కోల్పో యిన పిదప యెక్కువ దూరము పోయియుండదని ఊహించి తిని. ఆ యెనుముపోవు దారిలో రక్తము గుర్తులు వెడల్పుగా పడుటవలన క్రొత్తవేటగాడు అయినను, ఆ గుర్తులవెంబడి వెళ్ళి యెనుమును కనుగొనగలడు. ఆ యెనుమ అచటనుండి కొండక్రిందనున్న సెలయేటిదగ్గరకు వెళ్లినట్లుగా గుర్తులు కన్పించుచుండెను. అది తప్పక ఆ సెలయేటి ఒడ్డున చచ్చి పడియుండునని ఊహించితిని.

మేము కొంతదూరము వెదకుచూ వెళ్ళితిమి. సుమారు 1-30 గం॥ ఆ గుర్తుల వెంబడి నడిచి సెలయేటివద్దకు వచ్చి తిమి. ఎనుమా సెలయేటి నీటిలో నిలబడి చెట్టుబోదెకు ఆను కొని యుండెను. ఆ నీటి ప్రవాహము వలన కలుగు ధ్వనిచేత అది మమ్ములను మొట్టమొదట చూడలేదు. తరువాత అది ప్రక్కకు తిరిగి మమ్ములను చూచెను.

అది గడేసాల్ ప్రాంతములో తిరిగెడి కారెనుము. దాని ఎడమ కొమ్ము వంకర తిరిగి యుండెను.

పులి పంజాతోనూ, పళ్ళతోనూ, ఎనుము ముఖము మెడ, పార్శ్వములు, పొట్టక్రింద తీవ్రముగా గాయపరచెను. ఆ గాయములు మాకు స్పష్టముగ కనబడుచుండెను. పులి, దానిపొట్టకు బెజ్జము పెట్టినట్లుండెను. ఎఱ్ఱనిమాంసపు కండలు నీటిలోనికి వ్రేలాడుచుండెను.

ఎనుము అంత బాధతో నున్ననూ, దాని కనులలో భయమూ, బాధ ఏమాత్రము కన్పించుట లేదు. తరువాత అది మెల్లగా అడవిలోనికి వెళ్ళిపోయెను.

నేను దానిని కాల్చి, బాధనుండి విముక్తి కలిగించవలెనని తలచితిని, కాని అదిఅంత వీరోచితముగ రణరంగమున విజయము పొందిన దానిని కాల్చుటకు నాకు మనస్కరించలేదు. నేను మరల దానిని చూడగలనని మాత్రము తలచలేదు.

•

నేను ఇటీవలనే గడేసాల్ గ్రామమునకు వెళ్లితిని. ఒకరోజు సాయంత్రము, ఆ యెనుము తన గుంపుతో సహా 41 వ మైలు దగ్గర తూర్పువైపున నున్న మైదానములో పచ్చిక మేయుటను చూచితిని. నేను దానిని చూచి చాల సంతోషించితిని.

ఆ కారెనుము, ఆ అడవిలో దీర్ఘకాలము నివసించుగాక.

—o—

3. చోర్డీ ప్రాంతపు జడలపులి

నేను చెప్పబోవు ఈ కథ ఒక పెద్దపులినిగూర్చి — అది నివసించినచోట ప్రజలను చాల బాధపెట్టెను. — దానిని వెంబడించి, చిట్టచివరకు చంపుటకు చాలా బాధపడవలసి వచ్చెను.

జంతువులను వేటాడు కథలను చెప్పునపుడు, కథ చెప్పువాడు, కథవినెడివారికి ఆసక్తిని కలిగించుట సహజముగ నుండును. అట్టి అభిలాష కలిగించవలెననిన. ఆ జంతువును చంపుటకు చేసిన వివిధప్రయత్నములు, చివరకు చంపుట, మొదలగు సంఘటనలను వరుసగా చెప్పవలెను. మధ్యలో విఫలమైన సంఘటనలను వదలివేయవచ్చును. అట్లు వదలివేయనియెడల, వినువారికి విసుగుకలుగును. కేవలను విజయము చేకూరిన విషయములపై చెప్పుటవలన, వినువారికి నరమాంసభక్షియైన పులినిగాని, లేకచిరుతనుగాని చంపుటకు ప్రయత్నించిన తప్పక విజయమును పొందవచ్చుననియు. పైగా చంపుట సునాయాసమైన పనియనియూ — కొద్దిరోజుల కాలములోనే చంపవచ్చుననే అభిప్రాయము కలుగజేయుటయే యగును.

వాస్తవముగ పై మూడు అభిప్రాయములు సరియైనవి కావు. పైగా ఎంతసులభమని ఊహించితిమో అంతకష్టము. ప్రయత్నించినంతమాత్రమున విజయముసాధించుట దుర్లభము. ప్రయత్నించి విజయమును పొందలేని సంఘటనలనేకములు. పైగా శారీరకముగను, మానసికముగను చాల కష్టమైనపని. అది ఒకొక్క జంతువును చంపుటకు నెలలు లేదా సంవత్సరములు పట్టవచ్చును. ఒకొక్కసారి అసలుచంపలేముకూడ.

నేను చెప్పబోవు ఈకథ పులిని చంపుటకు మామూలు ప్రయత్నములతో మొదలిడి, చివరకు ఐదు సంవత్సరములకు అతి ప్రయాసతో దానిని చంపకలిగిన గాథ. నేను దీనిని వరుసగా ఐదుసంవత్సరముల కాలము వేటాడలేదు. అప్పుడప్పుడు జరిపిన ప్రయత్నముల వివరణమే ఈ కథ. ఈ జంతువును వేటాడుటకు నా ప్రయత్నములతో పాటు, బెంగుళూరు. బొంబాయి నగరములనుండి వచ్చిన ఇతర వేటగాండ్రు మరియు ఆ ప్రాంతపు వేటగాండ్రుకూడ అనేక విధముల ప్రయత్నించిరి కాని ఐదు సంవత్సరములు గడచువరకు మేమెవ్వరమూ దానిని చంపలేకపోతిమి.

ఈ పులిలో ఇంకొక విశేషము కలదు. దీని మెడ చుట్టూ, మరియూ చెవులు, చొడలదగ్గర జూలును కలిగియుండెను అసలే అది ఆకృతిలో పెద్దజంతువు. పైగా జూలు ఉండుటవలన దాని తల చాల పెద్దదిగ కన్పించుచుండెను.

అది మొట్టమొదటగా చోర్డి ప్రాంతములో కన్పించి ఒక మనుష్యుని చంపెను. చోర్డి అనునది చిన్న గ్రామము. కుమ్సీ పట్టణమునుండి నాల్గు మైళ్ళ దూరముననున్న చోర్డి గ్రామము చుట్టూ అడవి కలదు. షిమోగా అను పట్టణము నకు కుమ్సీ పదహారు మైళ్ళదూరములో నున్నది. షిమోగా అనునది మైసూరు రాష్ట్రములోని ఒక జిల్లాకు ముఖ్యపట్ట ణము. ఆ జిల్లాపేరుకూడ అదియే. బెంగుళూరు షిమోగాల మధ్యదూరము 172 మైళ్లు. ఈ రోడ్డు బెంగుళూరునుండి షుమారు 70 మైళ్ళవరకు సిమెంటు చేయబడి యుండెను. తక్కిన రోడంతయూ తారు రోడ్డు. మొత్తముమీద కొద్ది మలుపులు తప్ప, మోటారుకారులో సురక్షితముగా బెంగు ళూరునుండి షిమోగా చేరవచ్చును.

అచటినుండి ఆ రోడ్డు, కుమ్సీ చోర్డి, తరువాత తొమ్మిది మైళ్ళలోనున్న ఆనందపురం, పదకొండు మైళ్ళ దూరములోనున్న సాగర్ పట్టణమునకు, పదహారు మైళ్ళ దూరములోనున్న తలగుప్ప గ్రామమునకు, అచటినుండి గెర్సొప్ప జలపాతము (లేక జోగ్) జలపాతము వరకు కలదు. ఆ జలపాతము వద్ద శరావతీ నది నీళ్లు 950 అడుగుల ఎత్తు నుండి నాలుగు సెలయేటి పాయలవలె దిగువకు పడును. అది చూచుటకు చాల రమ్యమైన దృశ్యమేకాక, అనాత్మ వాదు లకు, విసుగుచెందిన వారికి ఆ దృశ్యమును చూడగనే భక్తి కలుగునట్లుండును.

ఆ జలపాతమువద్ద రెండు ప్రయాణీకుల వసతి గృహములు గలవు. మొదటి గృహము శరావతినది యొడ్డున మైసూరు రాష్ట్రపు సరిహద్దులో గలదు. అందువలన దానిని మైసూరు బంగళా అందురు. ఈ గృహము చాల అధునాతన పద్ధతిలో నిర్మించిరి. రెండవ గృహము నది ఆవల ఉత్తరపు వైపు కట్టపై గలదు. ఇది బొంబే సరిహద్దులలో యుండెను. ఇది చాల పురాతనమైనదియేగాక, ఏకాంతముగ దూరముగ నుండును. చాల అరుదుగగాని ప్రయాణీకులు ఇందులో దిగరు. పై కారణమువలన నేను ఎక్కువగా ఈ గృహములోనే దిగెడివాడను. దీనిని బొంబే బంగళా అందురు.

ఇచట అసాధరణమైనవిషయము — వినోదకరమైన విషయమేమన — అచటికి దర్శనార్థమైవచ్చిన వారందరూ తమ తమ అనుభవములనుగురించి వ్రాసినపుస్తకములు, రెండుభాగములలోనున్నవి. అందులో చాలపద్యములు, నిత్యమునువ్రాసిరి. ఆ జలపాతము ఘనతయే, వారికికవిత్వమనెడి సరస్వతిని ప్రసాదించియుండును. అందులోకొందరు వ్రాసినవ్రాతలు చాలగొప్పవి.

ఈ పులికూడతక్కిన నరమాంసభక్షులవలెనే ప్రవర్తించుచుండెను. పులిమొట్టమొదట అడవిలోని చిన్నచిన్న జంతువులనుచంపి, ఆహారముగా ఉపయోగించుకొనెడిది. షిమోగాజిల్లాలోని అడవులలో వేలకొలదిపశువులు మేత మేయుటకు వచ్చుటవలన, పులి క్రమేపివానిని చంపితినుటకు అలవాటుపడెను. అది పశువులనుతినుటకు అలవాటుపడు

టకు ఒక ముఖ్యకారణము లేకపోలేదు. పశువులు వేలకు వేలు అచటికి మేతకువచ్చుట, దీనికితోడు అడవిలోని క్రూర మృగములను వేటాడుటకన్న, పశువులను వేటాడిచంపుట చాలతేలిక. అందువలన అడవిజంతువులను చంపితినెడిపులి చోర్డిప్రాంతపురైతుల పశువులనుచంపి, అపారనష్టమును కలుగ జేయుచుండెను.

పులిని ఏదోచేయవలెనని వారుతలంచునాటికి, పులి జంతువువెంట జంతువును చంపివేయుచుండెను. ఒకరోజున ఒకరైతు తనపశువులనుమేతకై అడవికితోలుకొని వెళ్లినప్పుడు తుపాకిని వెంటతీసుకొనివెళ్లెను. రిజర్వుఅడవిలోనికి వేటాడు లైసెన్సులేకుండ తుపాకిని అడవికితీసుకొనివెళ్లుట, అటవీశాఖ వారి నిబంధనలకు భిన్నమైనవిషయము.

అదృష్టవశాత్తు, అదేరోజు పులి అతనిపశువులలో ఒకదానినిచంపుటకు నిర్ణయించుకొనెను. ఆ పశువులకాపరి చెట్టుబోదె వెనుకనుండి, పులి కుడిపార్శ్వములో కాల్చెను. పులితీవ్రముగ గాయపడెను. ఆదెబ్బతోపులి ఆప్రదేశమునుండి కొంతకాలము అదృశ్యమయ్యెను. పులిని ఆప్రదేశమునుండి పారద్రోలినందుకు ఆగ్రామపశువుల కాపరులందరూ అతనికి ధన్యవాదములను తెలిపిరి.

కొంతకాలముతరువాత, పులి కొద్దిమైళ్ళదూరములో నున్న ఆనందపురమువద్ద కన్పించెను. అదిఇంకనూ ఆప్రాంత పుఅడవులలోనికి మేతకొరకైవచ్చిన పశువులను చంపు

కుండెను. అది అప్పటికింకనూ నరమాంసభక్షిగా మారలేదు. దానిశరీరములో గాయమువలన అదిశక్తినికోల్పోలేదు. అదిజంతువులను వేటాడుశక్తిని కలిగియుండెను.

పశువులకాపరు లందరుకలసి దానినిమరియొక పర్యాయము గాయపరచిరి. అది గతదినముచంపిన ఆవుశవము వద్దకువచ్చుచున్నప్పుడు, చెట్టుపైమకామునుండి ముందువైపు కుడికాలుపైకాల్చిరి. అదిశాశ్వతముగ ఈప్రాంతమునుండి పారిపోయెనని అందరూఅపోహపడిరి. కాని అదిమరల కన్పించెను.

రెండవపర్యాయము అదితిరిగివచ్చినపుడు, దానిలో చాలమార్పుకలదు. అదిఎంతోకాలము కేవలము పశువులను నాశనముగావించు దుష్టజంతువుగమాత్రమే ఉండలేదు. మొదట జంతువులను మాత్రముచంపి, పశువులకాపరుల జోలికి పోయెడిదికాదు. ఈసారిమాత్రము పశువులుసురక్షితముగానుండెను. పశువులకాపరులు చాలప్రమాదస్థితిలో నుండిరి. ఏయితర అడవులలోగూడ ఇంతప్రమాదకరమైన జంతువు లేదన్నట్లుండెను. అదిపూర్తిగ నరమాంస భక్షి అయ్యెను.

దాని కుడికాలులో ప్రవేశించిన తుపాకిగుండు కాలులోని ఎముకను విరగకొట్టెను. కాలు కురచగ ముడుచుకొని పోయెను. అది ఇక ఏమాత్రము నిశ్శబ్దముగను, త్వరగను జంతువులను వేటాడలేదు. ఇక భూమిపైనక్కి పరుండి, జంతు

వులను పట్టుకొని చంపలేదు. అది ఏ మాత్రము కదలినను శబ్దమగును. దాని కాలుకుంటిదగుట వలన, జంతువులను గట్టిగా పట్టుకొనలేదు. అందువలన ఆ జంతువులు పట్టునుండి తప్పించుకొని పారిపోవును. పశువులు సహితము దాని రాకను గుర్తించి. తప్పించుకొని పారిపోవుచుండెడివి, లేక ఆ పులి పశువులను ఎదుర్కొనునపుడు అవి వెనుక కాళ్ళతో తన్ని వదల్చుకొని పారిపోయెడివి.

ఈ అంగవైకల్యము వలన, పులి చాల కృశించి పోయెను. దానికి సరియైన తిండి దొరకక ఉపవాసముతో బాధపడుచుండెను. మెకచుట్టూ జ్వాలిగలిగిన ఆ భయంకర మైన పులి—గత్యంతరము లేక పొదలలో అటు ఇటు తిరుగు చున్న ఎలుకలను పట్టి తినుచుండెను. ఒక్కొక్కసారి అవి కూడ తప్పించుకొని పారిపోవు చుండెను.

గమనములో నిదానముగా వెళ్ళు జీవులైన, అడవిలో అచ్చటచట నీళ్ళ గుంటలలో నుండు కప్పలు, నీటి ఒడ్డున ఉండు పీతలు మరియు మనుష్యులు మొదలగు వానిని చంపి జీవించుచుండెను. ఈ పులి కేవలము ఆవశ్యకత వలననే, క్రొత్త ఆహారమైన నరమాంస భక్షణ చేయుట మొదలిడెను.

ఈ పులినిగూర్చిన పైవిషయము లన్నింటినినేను అప్పు డప్పుడు సేకరించితిని. చివరకునేను కాల్చినతదుపరి, దానికి లోగడతగిలిన దెబ్బను పరీక్షించితిని.

ఒకరోజున ఒక ప్రయాణీకుడు ఆనందపురములో బస్సు దిగి మూడుమైళ్ళదూరమునయున్న చిన్నకుగ్రామమునకు వెళ్ళుటకు అడవిగుండబయలుదేరెను. అతనుగతదినము ఉదయము షిమోగాపట్టణమునకు వెళ్లుటకు బయలుదేరి, మరుసటిరోజు మధ్యాహ్న భోజనమునకు వచ్చెదనని భోజనముసిద్ధముగా నుంచమని భార్యతో చెప్పెను. భార్య భర్త చెప్పినప్రకారము భోజనము సిద్ధముచేసెను. కాని ఆయన తిరిగిరాలేదు. అతడు సకాలములో తిరిగిరానందుకు ఆ ఇంటిలోనివారు అంతగా ఆదుర్దా చెందలేదు. కాని హిందూదేశములోని చిన్న చిన్న పట్టణములలోగూడ వ్యాపారపుపనులు పూర్తిఅగుటకు చాల ఆలస్యమగును. తూర్పుదేశములలో కాలమునకు అంతగా ప్రాధాన్యత లేదు.

ఆరోజు సాయంత్రము మరుసటిరోజు సాయంత్రము వరకు అతడుతిరిగిరాలేదు. మూడవరోజున అతని పెద్దకుమారుని, తనతండ్రి రాకపోవుటకుగల కారణము తెలిసికొనుటకు షిమోగాపట్టణమునకు పంపిరి. అచటతనతండ్రి మూడు రోజులక్రితమే పనినిపూర్తిచేసికొని ఇంటికితిరిగివెళ్ళెనని తెలియజేసిరి.

అప్పటికినివారు ఆ మనిషినిగూర్చి అంతగాఆతురత పడలేదు. ఆ దేపనికొరకై ఆనందపురమునకు దగ్గరగానున్న సాగర్ పట్టణమునకు వెళ్లియుండవచ్చునని ఊహించిరి.

ఐదురోజులు ఈవిధముగనే గడిచిపోయెను. ఐదురోజుల అనంతరముకూడ మనిషి తిరిగిరానందున ఎక్కువగా ఆతురత

చెందిరి. అతడు ఇంటికి తిరిగి వచ్చునప్పుడు దారి దోపిడి దొంగలు దోచుకొని, బహుశః వారే చంపియుందురని ఊహించిరి. పోలీసువారికి రిపోర్టు నిచ్చిరి. వాపు వెతకగా, అతని కాలి చెప్పు ఒకటి అడవిలోని త్రోవ ప్రక్కనున్న పొదవద్ద పడియుండుటను కనుగొనిరి

ఆ పాత చెప్పును ఆ ఇంటివారికి చూపగా, అది ఆ కన్పించని మనిషిదేనని చెప్పగనే, వారు, అతనిని తప్పక దారి దొంగలు చంపి యుందురని నిశ్చితాభిప్రాయమును వెలి బుచ్చిరి. ఆనందపురములో నున్న చాల మంది రౌడీలను, కే.డీలను పోలీసు స్టేషనుకు తీసికొని వెళ్ళి, విషయమును తెలుసుకొనుటకు అనేకవిధముల ప్రయత్నించిరి. కాని వారు నిర్దోషులమని తెలియజేసిరి.

మరల జాగ్రత్తగ వెదుకుట ప్రారంభించిరి. అతని చినిగిన గుడ్డలు, రక్తపు గుర్తులు ముళ్ళపొదలపై పడియుండు టను చూచిరి. సెలయేటి దగ్గర పులి కాలి గుర్తులు కొన్ని కన్పించెను. పై గుర్తులు తప్ప, ఇక ఏమియూ కన్పడలేదు.

అప్పటి రోజులలో ఆ ప్రాంతములో పులులపీడ చాల ఎక్కువగ నుండెడిది. పులి కాలి గుర్తులకు, కన్పించని మని షికి సంబంధము తెలుసుకొనుటకు అంతగా ఆధారములు లేవు. కాని మనిషి కన్పించక పోవుటకు పులియే కారణమని కొంతవరకు అనుమానించిరి. పులి గుర్తులుకూడ అదేసమయ ములో కన్పించెను.

ఈ రహస్యమును తెలుసుకొనినవా రెవ్వరూలేరు.

పదిహేను రోజుల తరువాత, ఒకవ్యక్తి కుమ్రీ నుండి చోర్గికి సైకిలుపై వెళ్ళుచుండెను. అతడు చేరవలసిన స్థలమునకు అరమైలు దూరములో రోడ్డు నదిపైన బ్రిడ్జిమీదుగా వెళ్ళెను. ఆ వంతెనకు సున్నముతో కట్టినపిట్టగోడ కలదు. అతడు సైకిలుపై ప్రక్కల వెంబడించుచూ వెళ్ళుచుండెను. ఇంతలో పులి ఒకటి క్రింద నీళ్లు త్రాగుటను చూచెను. అతడు పులికి చాల దూరములో నుండెను. అతడు సీటుపై నుండి ఒక కాలును పిట్టగోడపైనుంచి పులిని చూచుచుండెను.

పులి నీళ్లు త్రాగిన పిదప, కట్టపైకి వచ్చుచుండెను. అది కొద్దిక్షణములలో పొదలలోనికి పారిపోయెడిదే! కాని సైకిలు పైకూర్చొనిన వాడుతమాషాగా "ష్, ష్, ష్" అని శబ్దము చేసెను. పులి ఆగి భుజములపైగా అతనిని చూచిపెద్దగా అరచెను.

సైకిలు పైనున్నవాడు పిట్టగోడపై నుండి కాలును తీసికొని, సాధ్యమైనంత త్వరగా సైకిలుత్రొక్కుచూ చోర్గి గ్రామమునకు వెళ్ళి, రోడ్డుపై పులి కన్పించిన దనియు, అది తనను ఎదుర్కొనుటకు ప్రయత్నించిన దనియు తన స్నేహితులతో చెప్పెను. దైవానుగ్రహము వలన తప్పించుకొని వచ్చితినని కూడ అతను చెప్పెను.

ఒకనెల నిశ్శబ్దముగా గడిచి పోయెను. తరువాత పులిమొట్ట మొదటిసారిగా మనుష్యుని చంపెను. ఆనంద

పురము, చోర్డిలమధ్య "తుప్పూరు" అను ప్రదేశము వద్ద చంపెను. అదిరోడ్డు ప్రక్కనగల చిన్న కుగ్రామము. ఆగ్రామములోని ఒక స్త్రీ, తనగేదెను ప్రక్కనున్న సెలయేటిలో కడుగుటకు తోలుకొని వెళ్ళెను. ఆగేదె నీళ్ళలో తలకన పడునట్లుగా మునిగెను. ఆ స్త్రీ ఒడ్డునకూర్చొనెను. గేదెలు సామాన్యముగా తలను నీటముంచవు. ఒడ్డుపైనున్న ఆస్త్రీని పులిఎదుర్కొనెను. అంతకుమునుపే మరియొక స్త్రీ నీళ్ళుతీసికొని వెళ్ళుటకు సెలయేటికి వచ్చి, ఆమెతో కొద్దిసేపు మాట్లాడి అపుడే వెళ్ళెను. ఆమె వందగజముల దూరము వెళ్ళినప్పటికి బాధతో కూడిన అరుపు వినబడెను. ఆమె వెను దిరిగి చూచునప్పటికి పులి ఆమెను నోటకరచుకొని పారిపోవు చుండెను.

ఆ శవముతో సహా పులి అడవిలోనికి అదృశ్యమయ్యెను. రెండవస్త్రీ నీళ్ళపాత్రను అచటదించి గుడిసెల వైపు పరుగిడెను.

ఈ విధముగ జరిగిన సంఘటనలు అనేకము కలవు. ఆ శవమును వెదకుటకు ధైర్యము గలవారిని పోగుచేయుటకు కొంతసేపు పట్టెను. వారు చివరకు పులి తినగా మిగిలిన అవశేషములను కనుగొనిరి.

పులి నరమాంసభక్షణ చేయుట ఇదే మొదటిసారి. తరువాత క్రమముగా అది చాలమంది మనుష్యులనుచంపెను. శరావతీ ఆవలగట్టుపైనున్న బొంబే బంగళా నుండి చోర్డి

వరకు గల మధ్యదూరములో పులి మనుష్యులను చంపు చుండెను.

అచటి అటవీశాఖాద్యోగులు ఆ ప్రాంతములో పులిని ఎవరైనను కాల్చవచ్చునని అనుమతి నొసగు నప్పటికి కొంత కాలము పట్టెను. ప్రకటన చేయగనే బొంబాయి రాష్ట్రము నుండి చాలమంది ఉత్సాహవంతులు బయలుదేరిరి. వారందరు చక్కగా ప్రయత్నించిరి. కాని వారికి అదృష్టము కలసి రాలేదు. ఈ నరమాంసభక్షియైన పులి, వారు ఎరలుగా నుంచిన గేదెలు, పశువులకొరకు ఆశపడలేదు. పైగా ఈలోపుగా మనుష్యులు చనిపోవుట ఎక్కువయ్యెను.

జాక్ హాఫ్టన్ అనునాస్నేహితుడుకూడ ఈ పులిని కాల్చుటకు నిశ్చయించుకొని, నెంటనన్నుగూడరమ్మని ఆహ్వానించెను. అతడు చాలఎత్తుపాటిమనిషి. బలముకలవాడు. మేమీప్రయత్నముజేసినది సుమారుగా పులి నరమాంసభక్షిగామారిన ఒకసంవత్సరము తదుపరి.

నాకున్న సెలవును అదివరకే వినియోగించుకొనుట వలన, నేను ఒక వారము మాత్రము అతనితో వచ్చెదనని తరువాత తిరిగివచ్చెదనని చెప్పి బయలుదేరితిమి. అతని "1931" "ఎ" నమూనా ఫోర్డుకారులో మేముబయలుదేరితిమి. నేను వారముతదుపరి రైలులో బెంగుళూరునకు తిరిగివచ్చుటకు అవసరమైనచో తరువాత ఒక నెలవరకూ అతడుఉండుటకు ఏర్పాట్లుచేసుకొంటిమి.

మేముకారులో బెంగుళూరునుండి షిమోగావెళ్ళి జిల్లా ఆటవీశాఖాధికారిని కలుసుకొని, అచటవీయే ప్రదేశములలో ఏయేతేదీలలో పులి మనుష్యులనుచంపెనో తెలుసుకొని, వీరైన పులి ఏవిధముగా మనుష్యులను ఏయేప్రాంతములలో చంపుచుండెనో అదిఏయేప్రాంతములలో సంచరించుచుండెనో తెలిసికొనుటకు అచటఒకపూట ఆగితిమి.

నేను చెప్పినట్లుగా నరమాంసభక్షియైన పులులు, సాధారణముగా ఒకే పద్ధతిని అనుసరించుచుండును. పులి మనుష్యులనుఏయే ప్రదేశములలో ఏయే తేదీలలోచంపెనో, ఆ ప్రాంతపు పటముపై గుర్తించి, అదిమరల ఆ ప్రదేశమునకు ఎప్పుడువచ్చునో ఊహించి చెప్పవచ్చును. మేముతయారు చేసినపటము ప్రకారము, పులి అచటికి కొద్ది మైళ్ళదూరము లోనే కుమ్సీకిని శరావతి నదికిని మధ్యను తిరుగుచున్నదని తెలియుచున్నది.

ఆ ప్రాంత మంతయూ దిట్టమైన అడవి వ్యాపించి యుండెను. అచట చాల చిన్నచిన్న పల్లెలు గలవు. అచటి పశువుల కాపరులు మేతకొరకు పశువులను అడవి లోనికి తోలుదురు. ఈ పశువులలో ఎక్కువభాగము పులులచేత, చిరుతలచేత చంపబడుచుండును. అందువలన ఈ నరమాంస భక్షికూడ పశువులను చంపుచున్నదో లేదో తెలుసుకొనుట కష్టము. అదికూడ తప్పక పశువులను చంపుచున్నదని అభిప్రాయపడితిమి, మనుష్యులను చాల అరుదుగా చంపు

నుండెను. కనుక అది కేవలము నరమాంసముపైననే ఆధార పడుచుండె ననుటకు వీలులేదు. కాని అచటి ప్రజలు అది పశువులను చంపుటలేదని చెప్పిరికాన, మేము ఈ విషయములో పూర్తిగా పొరబడితిమి.

నా స్నేహితుడు తుప్పూరు అను చిన్న కుగ్రామము నకు అరమైలు దూరములో నున్న అటవీశాఖ వారి బంగళాలో నుండుటకు నిశ్చయించెను. ఆ బంగాళాకు రెండువందల గజముల దూరములో అడవి గలదు. ఆ అడవిలో ళేళ్ళు, దుప్పులు కొల్లకొల్లలుగా యుండెను. వానితలకట్టులు చూచుటకు చాల అందముగ నుండెను.

నా స్నేహితుడు మామూలు పద్ధతి ప్రకారము మూడు పశువులను కొని ఎరలుగా నుంచి పులిని వేటాడవలెనని తలంచెను. ఈ మూటిలోను రెండు మధ్యవయస్సులో నున్న గేదెలు, మూడవది ముసలిఎద్దు అయియున్నవి. ఒక గేదెను సైకిలు మనిషి పులిని చూచినచోట, ముసలి ఎద్దును పులి స్త్రీని చంపిన చోట, మూడవ ఎరను ఆనందపురమువద్ద గోడు ప్రక్కన కన్పించకుండ పోయిన మనిషి గుర్తులు దొరికినచోట కట్టివేసితిమి.

ఇచట ఈ పనులు పూర్తిచేసికొని మేము జోగ్ జలపాతము దగ్గర రెండు ఎరలను ఏర్పాటు చేసితిమి. అవి రెండును గేదెలే. ఒక ఎరను బొంబే బంగళాకు అరమైలు దూరములోనూ, రెండవ ఎరను శరావతి నది దక్షిణపు కట్ట

దగ్గర బొంబే బంగళాకును, అటు మైసూరు వైపున నున్న రెండవ కట్టకు మధ్యలో బోటుతిరుగుచోట ఏర్పాటు చేసి తిమి. ఈ బోటు జలపాతమునకు మైలు ఎగువ నదిలో ఆ ఒడ్డునుండి ఈ ఒడ్డునకు తిరుగు చుండును.

నా స్నేహితుడు మొత్తము ఐదు ఎరలను ఏర్పాటు చేసెను. అవి చాల కొద్ది ఖరీదునకే లభించినవి. నేము రోజువిడిచి రోజు ఒక్కొక్క బంగళాలోనుండుటకును, ఒక బంగళానుండి మరియొక బంగళాకు వచ్చులోపల ఎరలనన్ని టిని తనిఖీచేసికొని వచ్చుటకును నిర్ణయించుకొంటిమి.

ఇప్పటివరకు పులి మనుష్యులను చంపిన సంఖ్య తేదీలనుబట్టి, పులి తప్పక సాగర్, ఆనందపురము మధ్య ప్రాంతములో నుండునని ఊహించితిని.

అందు వలన నేను మూడవరోజున ఒక గేదెను కొని తెచ్చి పై రెండు ప్రదేశములకు మధ్యలో కట్టివేయించితిని. ఈ ఎరను నేము తుప్పానుండి జోగ్ జలపాతము వద్దకు వెళ్ళినప్పుడు మధ్యాహ్నము రెండుగంటలకే ఏర్పాటు చేసితిమి,

నేము మరుసటిరోజు ఉదయము జలపాతమువద్ద ఏర్పా టుచేసిన రెండుఎరలను తనిఖీచేసితిమి. అవిరెండు సజీవముగ నుండెను. కనుక నేము తుప్పాకువెళ్ళుటకు బయలుదేరి తిమి. వెళ్ళునప్పుడు మధ్యలోనేను ఏర్పాటుచేసిన ఎరను

తనిఖీచేయుపలెనని అనుకొంటిమి. మేముఆచోటికి వెళ్లినప్పటికే పులి ఆ ఎరను చంపెను.

నా స్నేహితుడు మంచినేర్పరితనముగల వేటకాడు కావున, నేను అచట ఎరను ఏర్పాటుచేసినందుకు చాలసంతోషించి, నన్నే ఆపులిని చంపుమనెను. కాని మాయిద్దరిమధ్య వాదోపవాదములు చెలరేగెను. మేము నాణెమును ఎగురవేసి పందెమువేసితిమి పందెములో నాస్నేహితుడే గెలిచెను. అతనిని ఒకచెట్టుపైకూర్చుండబెట్టి, నేను మకాము సామగ్రిని తెచ్చుటకు కారులోతుప్పూరువెళ్లితిని. మకాము నిర్మించుటకు కావలసిన సామగ్రిని తెచ్చుట ఆరోజున మేమిద్దరము మరచితిమి. ఎటుచూచిననూ నాల్గుఅంగుళుల చదరము కలిగిన వాసములతో బిగించినమంచమునకు నవారుఅల్లియుండిన, మకామునకుసరిపోవునని నా స్నేహితుని అభిప్రాయము, మంచమునకు నాల్గుమూలల త్రాడుతో చెట్టునకు కట్టుటకు రంధ్రములున్న చాలునని చెప్పెను. నేను మకాముసామగ్రిని, మకామునునిర్మించుటకు ముగ్గురు మనుష్యులను వెంట తీసికొనివచ్చితిని.

మేమిద్దరము రోడ్డుప్రక్కన భోజనముచేయుచుంటిమి. తక్కినవారు ఈలోపల మకామును చెట్టునకుబిగించి ఆకులతో చక్కగాకప్పిరి. నాస్నేహితుడు కారువెనుకసీటులో సాయంత్రము నాలుగుగంటలవరకు కునుకుతీసెను. నేనుమాత్రము వారితో ఈవిషయమునుగురించి మాట్లాడుచుంటిని. ఈ

ప్రదేశము రోడ్డునకు అతిసమీపములో నుండుటవలన, రాత్రి వరకు పులిరాదని తలచితిమి.

నేను నాల్గు గంటలకు అతనిని నిద్రలేపితిని. అతడు కావలసిన పరికరములను తీసికొని మకాములోనికి ఎక్కి కూరుచుండెను. అతడు "8 యమ్.యమ్. రైఫులును మకాము లోనికి తీసికొన్ని వెళ్లెను అతడు దానిని ముద్దుగా "పార్టబిల్" అని పిలచును. "అదృష్టదేవత నిన్ను వరించుగాక అని" శుభాశీస్సులు చేసి నేను మరల ఉదయము వచ్చెదనని చెప్పి, ఆ ముగ్గురు మనుష్యులను తుపాకులో వదలి, ఆనందపురము వద్ద గల చిన్న బంగళాలో ఆ రాత్రి గడుపుటకు వెళ్ళితిని. నా స్నేహితుడున్న చోటికి, నేనున్న బంగళా చాలదగ్గరలో నుండెను.

మరునటి రోజు ఉదయము నేను కారుతో చెట్టునకు తిన్నగా రోడ్డుపై ఆగి, కారు హారనును ప్రయోగించితిని. అతడు చెట్టుపైనుండి విజయసూచకముగ ఈల వేసెను.

నేను అతడున్న చెట్టువైపుకు నడచి వెళ్ళి అతనిని మధ్యలో కలిసికొంటిని. మేము అనుకొన్న దానికంటె పులి రాత్రి పెందలకడే వచ్చినదనియు తాను పులిని కాల్చిన శుభ వార్తను అతడు నాతో చెప్పెను.

అతడు పులిని చంపినందుకు చాల సంతోషించితిని. నా స్నేహితుడు మాత్రము అమిత సంతోషముతో ఉప్పొంగి పోవుచుండెను. మేమిద్దరమూ పులిని చూచుటకు వెళ్ళితిమి.

నా స్నేహితుడు చంపిన పులి మధ్యవయస్సులో నున్న మొగ పులి. వెడల్పాటి నల్లటి చారలుకూడ కలవు,

ఆ జంతువు సాధారణమైన పులియని మాత్రము నేను గ్రహించితిని ప్రభుత్వమువారు ప్రకటనలో నరమాంస భక్షియైన పులికి మెడచుట్టూ జూలుకలదని ప్రకటించిరి. దీనికి మాత్రము జూలులేదు. నాస్నేహితుడు పులిని చంపితి నన్న ఉత్సాహములో జూలుసంగతినే మరచెను. అతడంత సంతోషములో నున్నప్పుడు నేనీవిషయము ఆతనితో చెప్ప దలచుకొనలేదు.

అతడు పులిని చంపినందుకు అనేకవిధముల కృతజ్ఞత తెలిపి, నమ్రముగ నుంటిని. అతడు సంపాదించిన బహుమతి వద్ద కాపలాయుంచి, నేను, నలుగురుమనుష్యులను, వాసమును తీసికొని వచ్చి పులిశవమును తీసికొని వెళ్ళుటకు తుప్పావు వెళ్ళితిని.

పులి నాల్గుకాళ్ళను కలిపి కట్టి వాసముతో ఆ నల్గురు మనుష్యులు పులి శవమును కారువద్దకు తెచ్చిరి. కారునకు బరువునుంచుటకు క్యారేజీ లేనందున, కారుబానెట్ పై పులి శవమును ఉంచిరి. కాని పులి శవమును బానెట్ పై నుంచుట వలన, కారునడుపు వానికి రోడ్డుసరిగ కన్పించక, కారును నడుపుట చాలకష్టమయ్యెను.

ఆనందపురములో గుండా వెళ్ళినప్పుడు తాను నా స్నేహితుడు సంపాదించిన బహుమతిని ప్రజలకు ప్రదర్శించెను

ప్రజలందరూ చూచిన పిదప "దొరగారు ఇది నరమాంస భక్షికా''దని చెప్పిరి. నాస్నేహితుడు అవునని సమాధానము చెప్పెను. నాస్నేహితుడు వెంటనే "నేను చంపినది ఇంకొక పులియా? ఇది నరమాంస భక్షికాదని మీరెలా ఖచ్చితముగా చెప్పగలరు?'' అని ప్రశ్నించెను. వారందరూ వెంటనే దీనికి జూలు లేదుకదా యనిచెప్పిరి.

నా స్నేహితుడు మొట్ట మొదటిగా జూలా అని ఆశ్చర్యముగా చూచి అర్థముచేసికొనెను. అతడు నావైపు క్షమాపణ వేడినట్లుగాచూసి, "నేను జూలు సంగతి మరచి పోతి,''నని చెప్పెను. "నేను ఇంకొకపులిని కాల్చితినని చెప్పి; మరి నీకు ఈవిషయము తెలుసా?''అని నన్ను ప్రశ్నించెను.

"నాకు తెలుసునని సమాధానము చెప్పితిని. నీవు పులిని చంపినరోజున చాల ఉత్సాహముగ నుంటివి. పైగా నరమాంసభక్షిని చంపితినని కూడ చెప్పితివి. అప్పుడు నిన్ను నిరుత్సాహపరుచుట నా కిష్టములేదు. జూలు లేదని మొదటనే చూచితిని. ఇందులో నీవు చేయగలిగినదేమున్నది. రాత్రిపూట చీకటిలో పులివచ్చినది. నీవు లైటువేసి జూలు ఉన్నదో లేదో చూడకయేకాల్చితివి. ఏదిఏమైనా ఇది చాల గొప్పపులి. దానిని కాల్చినందుకు గర్వించవలసిన విషయమే!'' నని ఓదార్చినట్లు చెప్పితిని."

నా స్నేహితుడు అంత త్వరగా తృప్తిచెందు మనిషి కాదు. మేముకారులో తుప్పూరు వెళ్ళితిమి. అతడు కనీసము

పులిచర్మమువలుచు పనిలో ఏమాత్రము శ్రద్ధచూపలేనంతగా దిగజారిపోయెను. నేను పులిచర్మమును తీయుపనిని తనిఖీచేయుచుండగా, నా స్నేహితుడు కుర్చీలో కూరుచుండి కాగితముపై లెక్కవేయుచుండెను. నేను అనేక పర్యాయములు ఈ జంతువుకోరలు, గోళ్ళు ఎంతో పొడవుగనున్నవని చెప్పి అతని దృష్టిని పులివైపుకు మరల్చుటకు ప్రయత్నించితిని, కాని లాభములేకపోగా నాతో సంభాషించుటకుకూడ యిష్టపడలేదు. "ఆ జంతువు నరమాంసభక్షి కాదని గుర్తించిన యెడల నేను దీనిని కాల్చెడివాడనుకాను అని కూడ చెప్పెను.

అతడు విచారమే లేకుండ నుండవలసిన మనిషి, ఆ రోజు ఎక్కువ విచారముగ నుండెను. మరుసటి రోజు ఎరలు చంపబడకపోయిన, తను తిరిగి బెంగుళూరు వెళ్లెదనని కూడ చెప్పెను.

మేము మరుసటి రోజు ఉదయము ఎరలను చూచుటకు వెళ్ళితిమి. అవి అన్నియూ సురక్షితముగనే యుండెను. మేము ఎరలను బేరముచేసి కొన్నప్పుడు మాట్లాడుకొనిన మరతు ప్రకారము, ఎరలను మూటిని, కొన్నఖరీదులో నాల్గవవంతునకు పశువుల కాపరులకు అమ్మివేసితిమి. తరువాత జోగ్ జలపాతము దగ్గరకు వెళ్ళితిమి. అచటి రెండు ఎరలుకూడ సురక్షితముగ నుండెను. వానినికూడ తిరిగి అమ్మివేసి, సాయంకాలమునకు "A" నమూన కారులో బెంగుళూరునకు తిరిగి వచ్చితిమి.

కొంతకాలము వరకు పులిని గూర్చిన వార్త లేమియూ తెలియలేదు. ఒక సంవత్సరము తదుపరి, అడవిలో బొగ్గు కాల్చువానిని కుమిస్సా వద్ద రోడ్డుప్రక్కనే పులి చంపి తిని వేసెనని వార్తా పత్రికలో చదివితిని.

అందువలన నేను షిమోగా జిల్లా అటవీశాఖాధికారిని పులి ఎవరినైనా చంపిన, తంతిద్వారా నాకు తెలియజేయమని కోరుచూ, ఉత్తరము వ్రాసితిని, షిమోగా జిల్లాలోని అడవులలో, మైసూరు, మద్రాసు, మరియు చిత్తూరు జిల్లాలోని అడవులవలె కాక, చిన్నచిన్న పల్లెలు, గ్రామములు ఎక్కువగా నున్నవి. మధ్యమధ్య కొంత ప్రదేశము పంట పైరులతో నిండి యుండును. అచటి రోడ్డుపై మనుష్యులు బండ్లు ఎక్కువగ తిరుగుచుండును. పై కారణమువలన, పులి పై ప్రదేశములో ఎక్కడైననూ ఉండవచ్చును కాబట్టి, దానిని వెదకి కనుగొనుట చాల కష్టము. ఇక పులి వెళ్ళిన దారిని కనుగొనుట, గుర్తులు మొదలగు వానిని కనుగొనుట వేటగాని శక్తి సామర్థ్యములపై ఆధారపడి యుండును. తక్కిన హిందూ దేశపు అడవులవలె, ఇచట ఆదిమనివాసు లెవరూ లేరు. ఈ ప్రాంతపు అడవులలోనికి ఎక్కువగా కూలికి వెళ్ళువారు మళయాళీలు. వీరు పశ్చిమ తీరవాసులు. వీరు కూలి కొరకై అడవులలో పని చేయుదురు. మళయాళీల తరువాత ఎక్కువగా అడవులలోనికి కూలి పనికి వెళ్ళువారు లంబాడీలు. లంబాడిలు హిందూదేశములోని "జిప్సీ" అను తెగకు చెందిన వారు. వీరిలో, పాశ్చాత్య దేశములో నున్న రోమనుల పోలికలు

కన్పించును. ఈ జాతి స్త్రీలు ప్రత్యేకములగు ఆభరణములను ధరింతురు. ప్రాంతీయ వాసులకన్న, లంబాడీ స్త్రీలు లేత రంగు కలిగి, ఎనుకలతో తయారుచేసిన గాజులు రకరకముల పూసల దండలు ఎక్కువగా ధరింతురు. వీరు ముక్కుపుడకలు, చెవులకు, చేతి వ్రేళ్ళకు, కాలి వ్రేళ్ళకు ఆభరణములను ధరింతురు. హిందూదేశపు స్త్రీలవలె, వీరు చీరలను ధరించరు, అనేక రకములైన రంగుల గుడ్డలతో మందముగా వస్త్రము లను తయారు చేసికొని ధరింతురు. వీరు ధరించు జాకెట్‌నకు వెనుకభాగము ఖాళీగా నుండును. వీరు భుజములను, తలను, వీపును శాలువావలె నున్న గుడ్డలతో కప్పుకొందురు. వీరు ధరించు జాకెట్‌ను సన్నని త్రాడుతో ముడివేసికొందురు.

లంబాడీజాతి పురుషులు, స్త్రీలకన్న నల్లగానుందురు. వీరు సాధారణవస్త్రములనే ధరింతురు. ఆ ప్రాంతములో నున్న కన్నడిగులవలెనే యుందురు. వీరు సాధారణముగ తలగుడ్డలను వదులుగాచుట్టుకొందురు. మామూలుచొక్కా లను ధరింతురు. ఒక్కొక్కప్పుడు కురచగానున్న పంట్లా ములనుకూడ ధరింతురు. దేశవాళితోలుచెప్పులను తొడుగు కొందురు.

దక్షిణహిందూ దేశములోనున్న జప్సీతెగలలోని స్త్రీలు, పురుషులు, ముఖములతీరులలోగాని, శరీరములో గాని ఎవరును ఒకరికి నొకరు పోలియుండరు. వీరిలో స్త్రీలు తీరికలతో చాలఅందముగనుందురు. పురుషులుమాత్రము

సామాన్యముగనుందురు. స్త్రీలలో దయాదాక్షిణ్యములు ఎక్కువ. పురుషులలో తక్కువ.

వీరికి స్థిరనివాసములేదు. ఈ జాతివారు యుగయుగాల నుండికూడ తమవ్యక్తిత్వమును కాపాడుకొనుచుండిరి. పురుషులలోమాత్రము ఆజాతిచిహ్నము లేమియూకన్పించవు. ఆ జాతిప్రత్యేకత కొన్నితరాలక్రితమే పోయినట్లు పురుషులు కన్పింతురు. స్త్రీలుమాత్రము అప్పటినుండి యిప్పటివరకు తమజాతి ఆచారములను, దుస్తులను, వదలుకొనక, కాపాడుకొనుచుండిరి. ఇదినిజముగ గర్వించదగినవిషయమే !

వీరికి స్థిరనివాసములేవందున, వీరు ఒకచోటునుండి మరియొకచోటికి మారుచుందురు. వీరు గ్రామములలోకన్న ఖాళీప్రదేశములో పూరిగుడిసెలను నిర్మించుకొని నివసించుచుందురు. ప్రాంతీయవాసులైన కన్నడీగులకన్న, లంబాడీలు ఎక్కువగా సహకరింతురు.

లంబాడీజాతి స్త్రీలు, పురుషులు ఎక్కువగా కల్లు, సారాయి త్రాగుదురు. సారాయిని వీరు తుమ్మచెట్టు ధాన్యము, లేక అరటిపండ్లు బెల్లము మొదలగు పదార్థముల నుండి స్వయముగా మత్తుపానీయములను తయారు చేసికొని త్రాగుదురు. వీరు మత్తుపదార్థములను తయారు చేయుటలో సిద్ధహస్తులు. వారికి ఇది అది అని అననేల. ఏ వస్తువులభించిన ఆ వస్తువునుండి మద్యము తయారుచేయుదురు.

వీరు డబ్బుకన్న ఆహారపానీయముల కొరకు పని చేయుదురు. ఒక వేళ వీరు డబ్బు కొరకు పనిచేసినను, అందులో ఎక్కువభాగమును, సారాయిని తయారుచేసికొనుటకో, సారాయికొనుటకొరకో ఖర్చగును. ఏది ఏమైనప్పటికి వీరు చాల మంచివారు. హిందూదేశములో కన్పించు విభిన్నజాతులలో, లంబాడీతెగ ప్రత్యేకముగ కన్పించును. మైసూరులో గల కాఫీ మరియు నారింజతోటలు లంబాడీ స్త్రీలకు ఋణపడియున్న వని చెప్పవచ్చును. ఈ తోటలలో పనులకు ఎక్కువగా లంబాడీ స్త్రీలనే నియమింతురు. తక్కిన కూలీలు పశ్చిమతీరమునుండి వచ్చెదరు. వీరిలో మలయాళీలు మోపలాలు చాలఎక్కువ. ఈ పశ్చిమతీరవాసులలో సాధారణమైన గుణ మొకటి కన్పించును. వీరు మాత్రము కొబ్బరి తోటలలోని ఇండ్లను, నదులఒడ్డున, ఉప్పు తయారుచేయు ప్రదేశములలో గల తమతమ ఇండ్లను విడనాడి యుండలేరు. నిజముగా ఆ ప్రదేశము చాల అందమైనది. అందువలననే వారు ఆ ప్రదేశమును విడనాడియుండ లేరు. అచట పరిశ్రమలు లేకపోవుటవలన, తగినంతకూలి, పని లభించకపోవుట వలన వారు సంవత్సరములో కొద్ది కాలము పనిపాట్లకే తమ నివాసములను వదలి కొద్దిగా లోపలి భాగమునకు రావలసి వచ్చును. వారు కొంతకాలము పనిచేసి, కొంత డబ్బును సంపాదించిన పిదప, లంబాడీలవలెగాక, తిరిగి తమ ఇండ్లకు వెళ్ళి కొంతకాలము సౌఖ్యముగ గడపుటకు, త్వరపడుదురు. తోటలు పెంచు యజమానులు కూలీల మధ్యలో వెళ్లుట

Minister for Education & Cultural Affairs,
Executive President,
WORLD TELUGU CONFERENCE
HYDERABAD 1975.

వలన వీరిని నమ్మి వీరి పైననే ఆధారపడరు. కనుక వీరి జీతములో కొంతభాగమును బిగపట్టిననేకాని యజమానులు వీరిని నమ్మరు కాఫీతోటల యజమానులు, వీరి జీతములను మినహాయించుటకు ప్రభుత్వచట్టము ఒప్పుకొనదు. అదిగాక చట్టప్రకారము యజమానులు, కూలీలకు ఆహారపదార్థములు, దుప్పట్లు, దుసులు మొదలగు నిత్యావసరవస్తువులు తెచ్చుకొనుటకు అడ్వాన్సులు యివ్వవలయును. మళయాళీ కూలీలు మాత్రము సాధ్యమైనంతఎక్కువగా అడ్వాన్సు సొమ్మును తీసికొని తీరప్రాంతములకు యజమానులకు చెప్పకుండ వెళ్ళిపోవుదురు.

అందువలన ఈ తోటల యజమానులు ఎక్కువగా తోటలలోని పనులకు లంబాడీస్త్రీలపైననే ఆధారపడుదురు. వారు మాత్రము తప్పక అచటనే యుందురు.

నాకు ఈ విషయములలో ఇంతఆసక్తి కలుగుటకు ఒకచిన్న కారణముకలదు. నేను నరమాంసభక్షకిని చంపవలెనన్న, నేను నాస్వశక్తిపైననే ఆధారపడవలెను. కాని అచట తోటలలో పనిచేయుచున్న కూలీలు చాలమంది కలరు. అడవులలోనివసించు తక్కిన ఆదివాసులైన పూజారీలు, షలోగాలు, కరుంబాలు, చెంచులు మొదలగు వారివలె లంబాడీలు అడవులలో త్రోవలను కనిపెట్టుట మొదలగు విషయములలో నేర్పరులుకారు. కాని పులిమాత్రము ఆవల నున్న అడవులలో తిరుగుచుండెను. అచట నాకు సహాయ

మొనర్చు వారు, నమ్మకమైనవారు కొందరు కలరు. కనుకనే నచటకు వెళ్ళుటకు సమ్మతించితిని.

నేను జిల్లా అటవీ శాఖాధికారికి ఉత్తరము వ్రాసిన ఒక నెల తదుపరి నాకు మరల అతని వద్దనుండి సమాధానము వచ్చెను. అతడా ఉత్తరములో నాకు కృతజ్ఞత తెలియ జేయుచూ, పులిమరల, కుమిర్సాచోర్ది మధ్యలోరోడ్డు ప్రక్కన టేకుచెట్టు ఆకులు పోగుచేయుచున్న స్త్రీని చంపెనని తెలియజేసెను. టేకుచెట్టు ఆకులను యెన్నడు చూడని వారికి తెలియునట్టుగా, నాకు చెప్పదలచుకొనెను టేకు చెట్లఆకులు ఆకారములో పెద్దవియే గాక చాలమందముగా నుండును. ఈ ఆకులు అంత తేలికగా చిరగవు. మనహిందూ దేశపుహోటల్సులో ఆకులతో తయారుచేసిన విస్తళ్ళపై భోజనము పెట్టుదురు. నాలుగైదాకులను కలపి ఒక విస్తరిగా కుట్టుదురు. పాశ్చాత్యుల దృష్టిలో భోజనముచేయు విస్తరిని చాలా పెద్దవస్తువుగా భావింతురు. నాలుగు ఐదు ఆకులనుకలిపి అంచులవెంబడి సూదిదారముతోగాని, తరమగ చీపురు పుల్లలతో గాని కుట్టుదురు. మైసూరురాష్ట్రములోని హోటలు యజమానులకు భోజనమును వడ్డించుటకు ఈ విస్తళ్ళు వేల సంఖ్యలలో కావలసియుండును. ఈ టేకు ఆకులు విరివిగా దొరకు ప్రాంతములో విస్తళ్ళుతయారు చేయుట యొక పెద్ద పరిశ్రమ. అటవీశాఖవారు అడవులలోగల టేకుచెట్లఆకులను పోగుచేసుకొను హక్కును వేలము వేయుదురు. కంట్రాక్టర్లు ఈ అకులను పోగుచేసుకొను హక్కును. వేలములో కొంత

సొమ్మకుపాడి, ఆకులను పోగుచేయుటకు స్త్రీలను కూలీలుగా వినియోగింతురు. వెయ్యి మంచి ఆకులను పోగుచేసిన ప్రతి కూలీకి యింత కూలీరేటు అని నిర్ణయించియిచ్చుచుందురు. మొగకూలీలకన్న ఆడకూలీలు తక్కువ రేటుకు లభింతురు గాన ఈ ఆకులను పోగుచేయుటకు ఎక్కువ స్త్రీ కూలీలను వినియోగింతురు.

• •

ఈఆకులను పోగుచేయుటకు, వెళ్లినఒకదురదృష్టవంతురాలిని పులిచంపినదని జిల్లాఆటవీశాఖ అధికారినాకు తెలియజేసెను. ఈమెతోపాటు యింకకొంతమంది స్త్రీలు అదేసమయములో ఆకులను పోగుచేయుచున్నారని తెలియజేసెను. పులి పొద లలోనుండివచ్చి ఆమెనుచంపి పొదలలోనికి తీసుకొనివెళుటను తక్కినవారు కళ్ళారచూచిరనికూడ చెప్పెను. ఆమెస్నేహి తులు ఈదృశ్యమును చూచినవెంటనే "కుంపే" గ్రామము నకువెళ్ళి ఈవార్తను తెలియజేసిరి అచట కొంతమంది కలసి పులి ఆమెనుచంపిన ప్రదేశమునకువచ్చి. ఆపరిసరము లలో వెదకి ఆసాయంకాలమునకు పులి తినగామిగిలిన ఆమె అవశేషములను కనుగొనిరి.

జిల్లా అటవీశాఖాధికారి నాకువ్రాసిన ఉత్తరములో పై విషయమును తెలియజేయుచూ నన్ను "మాసీ" వచ్చి ప్రయత్నించి పులినిచంపుమని అహ్వానించెను. ఆపులితిరుగు చున్న ప్రదేశవైశాల్యమును, మరియు నేనుపైనచెప్పిన విషయములనుబట్టి ఈస్థితిలో పులినివెదుకుట నిష్ప్రయోజన మని తలచితిని. అదియుగాక నేనుఅచటికివెళ్ళుటకు కావల

సిన సెలవుదొరకుట • మరియుకష్టము. ఈ పరిస్థితులలో పులినివెదుకవలెనన్న కొన్నినెలలు కాకపోయిననూ, కొన్ని వారములు పట్టవచ్చును.

అటవీశాఖాధికారి నాకుఉత్తరము వ్రాసినందులకు కృతజ్ఞత తెలియజేయుచూ, యేప్రాంతములోనైనను పులిని చంపవలెనన్న కొంతకాలము పట్టుననియు, ప్రస్తుతమునేను, యెక్కువకాలము మకాములో వుండుటకు నాకుసెలవులేద నియు, అతనికిఉత్తరము వ్రాసితిని. మరియు తక్కిన అటవీ శాఖఅధికారులకు, పోలీసువారికి, ఆప్రాంతపుప్రజలు,గుంపులు గుంపులుగా, పగటివేళ మాత్రమే బయటకువెళ్ళ వలయు ననియు, పశువులమేపుకొనువారు రోడ్డుప్రక్కలనే మేపుకొన వలయుననియు కంట్రాక్టర్లతరుపున కూలీలు అడవులలో పనిచేయుటను, తాత్కాలికముగ పనులను ఆపుచేయమని తెలియజేయవలసినదిగా కోరితిని. మరియొకపర్యాయము, పులి మనుష్యులను యెవరినైనాచంపిన పోలీసువారుగాని, అటవీ శాఖ అధికారులుగాని, లేక ఆచనిపోయిన మనిషిబంధువులు గాని ఆ శవమును, తాకకుండనుంచి నాకువెంటనే తంతిని పంపమని కోరితిని. తరువాత అటవీశాఖవారు ఒకఅరడజను గేదెలనుకొని పులితిరుగుచున్న ప్రదేశములలో యెరలుగా యేర్పాటుచేయుటకు, కొంతసొమ్మును మంజూరుచేయు మనియు, ఈపర్యాయమూ పశువులను గాని మనుష్యులను గాని, పులిచంపిన ఆ శవమును యెవరు కదల్చకుండా యుంచి నాకుతంతి పంపిన నేను వచ్చెదనని తెలియజేసితిని.

నా ప్రత్తరమునకు మూడవ రోజుననే సమాధానము వచ్చెను. ఆప్రత్తరములో నేను అటవీశాఖ అధికారికి తెలియ జేసిన సలహాలను అంతవిశాలప్రదేశములో ప్రజలు పాటించు నట్లుగా చేయుట దుర్లభమనియు నేను పులిని కాల్చుటకు రాజాలనందుకు చాలా విచారమును వెలిబుచ్చినను. జిల్లా అటవీశాఖ అధికారి నాకు సమాధానము వ్రాసెను. మరియు శవమును పులికొరకు యెరగానుంచుటకు చనిపోయిన మనిషి చుట్టపక్కాలు సమ్మతించరనియు వారు వెంటనే ఆశవమునకు అంత్యక్రియలు జరుపుదురు అనియు, చట్టముప్రకారము అటవీ శాఖవారు పులికొరకు యెరలను కొనుటకు సొమ్మును ఖర్చు చేయుటకు వీలుపడదనియు సమాధానము యిచ్చెను.

కాని ఇట్టి సమాధానము వచ్చునని నేను ముందుగనే ఊహించితిని. వాస్తవముగా అంత వైశాల్యముగల ప్రదేశ ములో పులికొరకు వెదకుట కేవలము గడ్డివామిలో సూది కొరకు వెదకినట్లే.

కొన్నివారములు ప్రశాంతముగ గడచెను. చోర్డీ, తుప్పారుల మధ్య పులి ఈ సారి ఇద్దరిని చంపెను. జిల్లా అటవీశాఖాధికారి ఈ వార్తను నాకు తంతిద్వార తెలియ జేసెను. చోర్డీ దగ్గర నున్న కరదిబెట్ట ప్రాంతములో పులు లను సంరక్షించుచుండిరి. ఆ ప్రాంతమునంతయు పులుల సంరక్షక కేంద్రముగా ప్రకటించిరి ఈ ప్రదేశమునకు అతి సమీపములోనే పులి తండ్రికుమారులను చంపి కుమారుని ఎత్తుకొనివెళ్ళెను.

కరదిబెట్ట అను పులుల సంరక్షణ ప్రదేశమునకు ఉత్తర దిశగా రోడ్డు గలదు. ఈ ప్రాంతపు అడవిలో టేకు చెట్లు ఎక్కువగా కలవు. మైసూరు మహారాజాగారు ఈ ప్రాంతమును పులుల సంరక్షక ప్రదేశముగా ప్రకటించిరి. ఇచట ఎవరునూ అనుమతి లేనిదే పులులను వేటాడకూడదు. రాష్ట్ర అటవీ శాఖవారు ఈ ప్రదేశమును సంరక్షించు చుందురు.

మైసూరుమహారాజాగారు, అతని వన్యమృగ సంరక్షణ లోని ముఖ్య సలహాదారుని సలహాపై ప్రతి జిల్లాలోను కొంత అడవిని వన్యమృగసంరక్షణప్రదేశముగా ఏర్పాటుగావించెను. ఈ వన్యమృగ సంరక్షణ ప్రదేశములలో వేటను నిషేధించిరి. మైసూరు పాలకులైన మహారాజుగారు యావద్భారత దేశము నకు వన్యమృగ సంరక్షణలో మార్గదర్శకులైరి. వన్యమృగ రక్షణకొరకు భారత ఉపఖండములో అందరూ శ్రద్ధతో పూనుకొని, వన్యమృగములను నాశనము గాకుండ చూచుట చాల ఉత్తమమైనపని.

కాని, ఈ నరమాంసభక్షి, వేట నిబంధనలను ఉల్లం ఘించి, వన్యమృగ సంరక్షణ కేంద్రములో సాధారణ పులు లతో పాటు తల దాచుకొని. ఆ కేంద్రమును అపవిత్ర పర చెను. కుమిన్సా, ఆనందపురము మధ్యలో పులి ఎక్కువ మనుష్యులను చంపెనుగాన, నేను ఆ ప్రాంతమునకు వెళ్ళి చూడవలెనని తలచితిని. కరదిబెట్ట అను వన్యమృగ రక్షణ కేంద్రము ఈ ప్రదేశమునకు మధ్యగా నుండెను.

పదిరోజులకు సరిపోవుసామగ్రిని సర్దుకొని, నేనుమరు సటిరోజు ఉదయము బెంగుళూరునుండి బయలుదేరితిని. గోడంతయూ ఎక్కువభాగము సిమెంటుచేయుటవలన, నేను షిమోగాలోనున్న అటవీశాఖాధికారి వద్దకువెళ్లునప్పటకి మధ్యాహ్నము రెండుగంటలయ్యెను. నన్ను ఆహ్వానించి విషయమును ఎప్పటికప్పుడు తెలియజేసినందులకు అతనికి కృతజ్ఞత తెలియచేయుటకై ఆచటనేను కొద్దిసేపాగితిని.

జిల్లా అటవీశాఖాధికారి నాకు రెండుఉత్తరముల నిచ్చెను. కుమ్సీ చోర్డిలలోగల తనక్రింది ఉద్యోగులను నాకుతగిన సహాయమొనర్చుడని కోరెను. ఒక ఉత్తరములో ఆ ప్రదేశములో ఎరలనుకొనుట చాలకష్టమైన పనిగావున, ఎరలనుసంపాదించుటలో నాకుసహాయమొనర్చుమని, రెండవ ఉత్తరములో కరిదిబెట్ట వన్యమృగసంరక్షణ ప్రదేశములో నరమాంసభక్షిని నన్నువేటాడనీయవలెనని వారందరిని ఆదేశించెను.

నేను జిల్లాఅటవీశాఖాధికారికి కృతజ్ఞత తెలియజేసి, ఆచటికిపదహారు మైళ్ళదూరములోనున్న కుమ్సీవెళ్లుటకు బయలుదేరితిని. కుమ్సీలోగల రేంజిఆఫీసరు తనపైఉద్యోగి వ్రాసినఉత్తరముచదివి, నాకువీలైనంత ఎక్కువసహాయము చేసెదననియు, నాకొరకులో చోర్డిలోనున్న ఆతనిసహఉద్యోగి వద్దకుకూడ వచ్చెదననియు చెప్పెను.

అచటికి సమీపములోనున్న చోర్డికి త్వరగా వెళ్ళితిని. అచటి రేంజి ఆఫీసరు పశ్చిమ తీరముననున్న మెంగుళూరు పట్టణమునుండి వచ్చిన క్రైస్తవ మతస్థుడు. మెంగుళూరు పట్టణము హిందూదేశములోగల క్రైస్తవమత కేంద్రములలో మొట్టమొదటిది. అతడు నాకు సహాయ మొనర్చుటకు చాల ఉత్సాహము జూపుటయేగాక, తనక్రింద ఉద్యోగులను పిలచి, సంఘటననుచూచిన (తక్కిన చెట్లు కొట్టు) వారిని పిలుచుటకు పంపెను.

వారు కొద్దిసేపటిలో తిరిగివచ్చి ఈక్రింది కథను చెప్పిరి.

షిమోగాలోగల కంట్రాక్టరు, తుప్పూరు సమీపములో గల అడవిలోని కొంత భాగములో బొగ్గును తయారు చేయుటకు చెట్లను కొట్టు హక్కును వేలములో పాటపాడెను. అతను చెట్లను కొట్టుటకు కూలీలతోపాటు-తండ్రి కొడుకులనుకూడ కూలికి నియమించెను. వీరికి షిమోగాలో ఇండ్లు కలవు కాని ఈ చెట్లు కొట్టుపని ఉన్నంతకాలము చోర్డిలోనే తాత్కాలికముగ నివసించుచుండెను.

ఆదుస్సంఘటన జరిగినరోజు——ఈకూలీలు ఉదయమున పెందలకడ లేచి చెట్లు కొట్టు ప్రదేశమునకు గల మూడు మైళ్ళ దూరము నడచి వెళ్ళుచుండిరి. కూలీలు కరిదిబెట్ట కేంద్రము ప్రక్కగా నడచి వెళ్ళినప్పుడు, ఆతని కుమారుడు తండ్రిని "పాన్" (వక్క-ఆకు) ఇవ్వమని అడిగెను.

ఇచట కొంచెముసేపు కథను ఆపి, పాన్ విషయము తెలియని వారికి తెలియ జెప్పదలచు కొంటిని. దక్షిణ హిందూ దేశములోని ప్రజలు అందులో కూలీలు పాన్‌ని ఎక్కువగా వాడుదురు. తమలపాకులతో చుట్టగా చుట్టెదరు. తమలపాకులకు తెల్ల సున్నము వ్రాసి మూడు నాల్గు పచ్చి వక్క పలుకులను వేసి, తమలపాకులతో చుట్టి నమలుదురు. వక్కను సుపారీ అని కూడ అందురు. సున్నము వక్క వలన ఒక విధమైన ఎర్రటి ద్రవపదార్థము నోటినుండి వచ్చుచుండును. కూలీలు ఆకులను వేసికొని నమలుచూ వెళ్ళునప్పుడు ఎర్రని రక్తము మాదిరి ద్రవమును గోడలపైన, రోడ్డు ప్రక్కలను ఇంక తదితర చోట్ల ఉమియుచు వెళ్లుదురు. క్రొత్తగా హిందూదేశమునకు వచ్చిన పాశ్చాత్యులు ఈ ఎర్రని గుర్తులు చూచి, ఈ దేశములో చాలమంది క్షయ వ్యాధితో బాధపడుచున్నారని కూడ తలంచెదరు.

ఈ కథలో, తండ్రి కుమారునికి తమలపాకులు అందించుటకు ఆగెను, తండ్రి ఆకులను అందించుటకు మొట్టమొదటగా అతను గుడ్డలో ముడివేసి ఉంచబడిన వానిని తీసియివ్వవలయును. అతను కుమారునికి ఆకులను తీసి యిచ్చు లోపల తక్కున ఇద్దరు కూలీలు ముందుకు నడచుచుండిరి. వారికి పెద్ద అరపు వినిపించగా వారు వెనుదిరిగి చూచునప్పటికి కుమారుడు రోడ్డుపైన పడుండి అతనిపై పులి నిలబడియుండెను. అతని తండ్రి మాత్రము ఇంకను తనచేతితో కుమారునికి పాన్ అందించు పనిలోనే యుండుటను చూచిరి.

తండ్రి మాత్రము చాల అద్భుతమైన పని చేసెను— బహుశ అది ఆతని జీవితములో చిట్టచివరిసారి చేసిన గొప్ప త్యాగము. తండ్రి ముందలకు గబగబా వెళ్ళి, పులిని భయ పెట్టవలెనని చేతితో చప్పట్లు కొట్టెను. అనంతరకార్యము త్వరలోనే ముగిసెను.

పులి పిల్లవాడిని కొద్దిసేపు వదలి, తండ్రివైపుకు తిరిగి అతనిపై దూకి, గొంతువద్ద రొమ్ముపైన తీవ్రముగా కొరికి గాయపరచెను. రక్తము సెలయేటి ప్రవాహమువలె గాయ ములనుండి కారుచుండెను. క్రోధముపై పడిపోయిన ముసలివానిని పులి వదలి. తన తండ్రిని చంపుచున్న దృశ్యమును చూచు చున్న కుమారునిపై బడెను.

తక్కిన ఇద్దరు కూలీలు భయపడి తుప్పూరుకు పారి పోసాగిరి. కాని వారు పారిపోవుట మొదలిడిన తరువాత, కుర్ర వానికి అతని తండ్రికి ఏమిజరిగినదో వారు చూడలేదు.

తుప్పూరు చాల చిన్న పల్లె. అచట ఎవరివద్దను తుపాకిలేదు, కనుక అరడజనుమంది ఆనందపురమునకు పోలీసు లకు తెలియజేసి. తుపాకిగల వారిని నెవరినైనా తీసికొని వచ్చుటకు వెళ్ళిరి. వారు వెళ్ళుచుండగా, ఇదివరలో సైకిలు కుర్రవాడు వంతెనక్రింద పులిని చూచినచోటికి, ఇసుక తెచ్చు టకు వెళ్ళుచున్న లారీ నొకదానిని చూచిరి.

వీరు లారీని ఆపి డ్రయివరుతో ఆనందపురము తీసి కొనివెళ్ళిన జరిగిన విషయమును తెలియజేయుటకు వీలగునని

చెప్పిరి. డ్రైవరు చాల ధైర్యశాలి. అందరూ లారీలోనికి ఎక్కిన, లారీని విపాదసంఘటన జరిగినచోటికి తీసికొనివెళ్లెద ననియు, అందరు అచటివిషయములను చూడనచ్చుననియు డ్రయివరు తెలియజేసెలు. వారిలో ఒకరు పులిసంగతిఏమిటని అడిగిరి. లారీకిపైన కప్పులేదుగాన, పులిలారీలోనికి ఎగిరివచ్చి ఎవరినైననూ చంపగలదు. అంతడ్రయివరు అతనినుద్దేశించి, "మిత్రమా! నేనుండగా మీకు భయము వలదు. నేను సోమరితనముగా ఊరుకొందునా? పులిని లారీలోనికి దూకనిచ్చెదనా? అచ్చే, ఒక్కక్షణములో పులిపైగా లారీని పోనిచ్చెదను; తెలుసా! అని చెప్పెను.

డ్రయివరు పై విషయమును చెప్పినతదుపరి తక్కిన డజనుమంది ధైర్యముతో లారీలో ఎక్కిరి. వారుత్వరగా ఆసంఘటన జరిగినస్థలమునకు జేరిరి. ఆడ్రయివరు అచటిదృశ్యమును చూచి ఆశ్చర్యము చెందెనని నాకుచెప్పిరి. ముసలివాడు, వీరు వెళ్లునప్పటికి చనిపోయి రక్తములో మునిగియుండెను.

అతని కుమారుని ఆచూకిమాత్రము తెలియలేదు. ఈ దృశ్యముచూచునప్పటికి డ్రయివరు ధైర్యమును కోల్పోయెను. పదముగ్గురూకలసి ముసలికూలీ శవమును లారీలో నుంచిరి. డ్రయివరు లారీని అతివేగముగ చోర్డ్ కి తీసికొని వెళ్లి, రేంజిఆఫీసరుని తోడ్కొని కుమ్మీసవెళ్లిరి. అచట వీరికి రేంజి ఆఫీసరు సబ్ఇన్స్పెక్టరు కలసిరి వీరందరు కలసి లారీలో షిమాగా వెళ్లి, పోలీసువారికి, అటవీశాఖాధికారులకు తెలియచేసిరి. అచటఆచారము ప్రకారము శవ

పంచాయితీజరిపి, ఆ రాత్రి ఆ శవమును అతనిబంధువులకు అప్పగించిరి.

మరుసటి రోజు అదే లారీలో కొంతమంది పోలీసులు ఆయుధములను ధరించి ముసలివాని కుమారుని వెదకుటకు వచ్చిరి. వారికి అక్కడక్కడ కొన్ని రక్తపు గుర్తులు, శవమును నేలపై ఈడ్చిన గుర్తులు పొదలలోను, వన్యమృగ సంరక్షణ కేంద్రములోనికి తీసికొని వెళ్ళినట్లుగాను గురులు కన్పించిన వని చెప్పిరి. వన్యమృగ సంరక్షణ కేంద్రములో మాత్రము వెదకుటకు ఎవర్నూ సాహసించనందున, వారు ఆ రోజు సాయంత్రమునకు తిరిగి షిమోగా వెళ్లి శవము ఆచోకీ తెలియలేదని చెప్పిరి.

ఇదే నరమాంసభక్షి దండయాత్రను గూర్చి వారు చెప్పిన పూర్తి కథ. ఈ వివరములన్నియు మిగిలిన యిద్దరు చెట్లుకొట్టు వారినుండి నేను సేకరించిన విషయములే. ఈ కథకు ఆధారములు చెట్లుకొట్టువారిద్దరే.

చోర్డి రేంజి ఆఫీసరు నాకు కాఫీ యిచ్చెను. తదుపరి, నేను, అతని సహోద్యోగులు. చెట్లుకొట్టు వారిద్దరూ—నేమందరము కుమిన్సునుండి సంఘటన జరిగినప్రదేశమును చూచుటకు బయలుదేరితిమి.

నేనా రోడ్డు వెంబడి యిదివరకు అనేక పర్యాయములు ప్రయాణము చేసితిని, ఆ ప్రాంతములో నేనీ, పులిని వెదుకునప్పుడు, పులి, ఆ పవిత్ర ప్రదేశములో దాగుకొనుటకు ఇది

రెండవ పర్యాయము. మొదటిసారి గాయపడిన పులి గౌజా అను గ్రామమునుండి వన్యమృగ సంరక్షణ కేంద్రములో ప్రవేశించుచుండగా సరిహద్దుల బయటనే, నేను దానిని కాల్చి చంపిని. ఈ కథను నేను వేరొకచోట వివరించితిని.*

రేంజి ఆఫీసర్లు ఈ ప్రదేశమును ముందుగ చూచిరి గాన వారు నాకు పులి తండ్రీ కొడుకును ఎదుర్కొని చంపిన ప్రదేశమును చూపించిరి. ఆ రోడ్డు పై రాకపోకలు ఎక్కువగ నుండుటవలన రక్తపు గుర్తులు అన్నియూ బస్సులు, లారీలు, చిన్నకార్లు, ఎద్దుల బరేడ్లు రాకపోకలవలన కన్పించకుండపోయెను.

వన్యమృగ సంరక్షణ కేంద్రము రోడ్డుకు సమీపము లోనే గలదు. ఆ ప్రాంతమంతయూ టేకుచెట్లు దట్టముగా పెరిగియుండెను, ఆ చెట్లన్నియూ పదిహేను సంవత్సరముల క్రితము అటవీ శాఖ వారిచే వరుసగా నాటబడినవి. అవి యిప్పుడు సుమారు యిరువది అడుగుల ఎత్తు వరకూ అన్నీ సమానముగా పెరిగియుండెను. ఈ చెట్లు వన్య మృగరక్షణ కేంద్రములో రెండు ఫర్లాంగుల దూరము వరకు దట్టముగ నుండెను.

టేకుచెట్ల క్రింద గాయపడిన జంతువునుండి రక్తపు గుర్తులు పడునుగాన జంతువు వెళ్ళిన మార్గమును గుర్తించ వచ్చును. గాయపడని జంతువును వెదకుట చాలకష్టము. ఈ

*See Nine Man-eaters and One Rague (Aken & uvwing London).

చెట్లు పెరిగిన చోట భూమి అంతయూ ఆకులతో కప్పబడి యుండును. మామూలు జంతువు ఆకులపై వెళ్ళినప్పుడు గుర్తులు ఏమియూ కన్పించవు. నరమాంసభక్షి కుర్రవానిని ఎత్తుకొని వెళ్ళినపుడు రక్తము కొద్దిగా అచటచట కన్పించెను. చెట్లు కొట్టువారు పులిశవమును ఎత్తుకొని అదృశ్యమైన చోటును చూపించిననూ నేము వెదకి మూడు చోట్ల పేకు ఆకులపై రక్తపుగుర్తులను కనుగొంటిమి. పులి వెళ్ళిన గుర్తుల కొరకు వెదకుట కాలము వృథాచేయుటయే అని భావించితిని.

వన్యమృగ సంరక్షణకేంద్రము ఉత్తరదిశలో సెల యేటివరకును, పశ్చిమమున గౌజు అనుగ్రామమువరకు, తూర్పున అమిలిగోల అనుగ్రామమువరకు వ్యాపించియుండెను. కనుక ఈకేంద్రమునకు నాల్గువైపులా నాల్గుఎరలను, కేంద్రముమధ్యలో ఒకఎరనూ ఏర్పాటుచేయుట ఉత్తమమని తలచితిని. వన్యమృగ రక్షణకేంద్రములోకూడ నరమాంసభక్షిని వేటాడుటకునేను అనుమతినితీసుకొంటిని. ఈ ప్రదేశములో రైతులు, పశువులను పులికొరకు ఎరలుగా ఉపయోగించుటకు సమ్మతింపక పోవుటవలన ఇచటఎరలను సంపాదించుట ఇదివరలో నాకీవిషయములో కొంత అనుభవము కలదు. కనుక నేను ఎరలను సంపాదించుటలో, నాకు సాయమొనర్చుడని రేంజిఆఫీసర్లను కోరితిని. వారువెంటనే ఎరలనుగూర్చి ఆలోచించవద్దనియూ, వారు ఎరలను ఉదయముతొమ్మిదిగంటలకల్లా పంపెదమనియు చెప్పిరి.

కుమిన్నాలో అటవీశాఖవారి బంగళా ఒకటికలదు. రివరెండుజర్విస్ అనువానిని పులిగాయపరచినపుడు, ఈ బంగళాలోనే అతనిమోచేయి తీసివేయుటకు అత్యవసరముగా ఆపరేషన్ చేసిరి. నేను ఈబంగళాలో మకాముచేయుటకు నిశ్చయించుకొంటిని. కుమిన్నారేంజి ఆఫీసరుగారిని చోర్డి చేర్పులోపల ఎరలనుకొనుటకు ముందునాకు చూపించమనికోరితిని. నేను ఉపయోగించుఎరలను ఎంచితీసుకొనుటకు చాలజాగ్రత్త వహింతును. పశువులలో ముసలివి, జబ్బుతోకూడుకొనినవి చావుకుసిద్ధముగా నున్నవాటివిమాత్రమే ఎరలకమ్ముదురు. పులి ఆపశువులను ఎందుకుత్వరగా చంపలేదాయని ఆశ్చర్యముకలుగవచ్చును. వేటగాడు ఎంతదొడ్డమనిషో పులికూడ అంతదొడ్డజంతువుకాబట్టి, నక్కవలెపులి ఎముకలు, ముసలి ఎద్దు మాంసముతో తృప్తిచెందదు.

నేనుఎరలనుగూర్చి మాట్లాడునపుడు, సాయంకాలము ఆరుగంటలయ్యెను. అపుడే చీకటిపడుచుండెను. వారుకొద్దిగా భయపడుచుండిరి. మేము ఐదుగురముకలసి ఒకచోట యున్నంతవరకు భయములేదని తలచితిమి. మేముటేకుచెట్ల లోగుండానడచి రోడ్డువైపునున్న కారునద్దకువచ్చితిమి. నేను కారులో చోర్డిరేంజిఆఫీసరును చెట్లుకొట్టు కూలీలనిద్దరిని చోర్టిలోవదలి, పదిహేనునిముషములలో కుమిన్నాచేరుకొంటిని.

నేనుఆరాత్రి అటవీశాఖవారి బంగళాలోనిద్రించితిని. మరుసటిరోజుఉదయము రేంజిఆఫీసరుగారు ఎరలను సంపాదిం

దిరో లేదో తెలుసుకొనుటకు ఇంటికి వెళ్ళితిని. గతసాయంత్రము ఎరలనుగూర్చి సులభముగ చెప్పినను, ఆయన ప్రాంతీయాధికారియైనను కొంతపలుకుబడిఉన్ననూ, ఎరలనుసంపాదించుటలో గల కష్టములనుగూర్చి సరియైనఅంచనా వేయలేదు. నేను వెళ్లునప్పటికి, అతనుఇంకనూ పని ప్రారంభించలేదు.

ఇంత పెద్ద కథను సంగ్రహముగ చెప్పవలెననిన, ఉదయము పదిగంటలకు ఆయన మూడుఎరలను సంపాదించెను. వానిలో ఒకటి గేదెదూడ, తక్కినవి రెండును ముసలిఎద్దులు. ఆముసలిఎద్దులను ఎరలుగా ఉంచుటనాక్షిపము లేదు. రేంజిఆఫీసరు మాత్రము వీనికన్న మంచివి దొరకవని చెప్పెను అదియుగాక వానిని చాలఎక్కువ డబ్బుపెట్టి కొనవలసివచ్చెను.

మేము, ముగ్గురు మనుష్యులతో ఎరలను చోర్డీ గ్రామమువద్దకు తోలుకొని వెళ్ళుమనిచెప్పి, కారులో 11గం ప్రాంతములో చోర్డీకి వెళ్లితిమి.

చోర్డీ రేంజిఆఫీసరు మధ్యవయస్సులోనున్న గోధుమ రంగు ఎద్దును కొనితెచ్చెను. వేటకు యిటువంటి ఎరచాల ఉపయోగము. రెండవఎరను ఉదయమే పంపితిమని, అది కొద్దిసేపటిలో గమ్యస్థానమునకు జేరవచ్చునని చెప్పెను. ఆఎర అచటకి చేరునప్పటికి ఒకగంట పట్టెను. ఆరోజు 12-30 గంటలకు ఐదు ఎరలను ఒక చోటికి చేర్చితిమి. అప్పటికిసగము రోజు గడిచిపోయెను.

అందువలన, మేము ఆరోజు మూడుఎరలను వివిధ ప్రదేశములలో ఏర్పాటుచేసితిమి. నడివయస్సులోనున్న ఎద్దును వన్యమృగ సంరక్షణ కేంద్రము మధ్యలో కట్టివేసితిమి. గేదెదూడను కేంద్రమునకు దక్షిణముగా రోడ్డునకు కొద్ది దూరములో, సంఘటన జరిగిన ప్రదేశమువద్ద కట్టివేసితిమి. తూర్పుదిశలో ,చోర్డీకి ఐదుమైళ్ళ దూరములో, ఒక ముసలి ఎద్దును కట్టివేసితిమి.

ఈపని అంతయూ పూర్తియగునప్పటికి సాయంకాల మయ్యెను. అందువలన తక్కిన రెండు పశువులను చోర్డీ గ్రామములో వదలితిమి. నేను మరుసటిరోజు ఉదయమువచ్చి ఎరలను ఏర్పాటుచేయు ప్రదేశములను నిర్ణయించెదనని చెప్పితిని.

ఈ రెండు ఎరలను ఉత్తర వైపున, పడమర వైపున ఏర్పాటు చేయవలసి యున్నది,

మరుసటిరోజు ఉదయమునేను కుమ్సారేంజి ఆఫీసరు గారు కలసి కారులో చోర్డీ వెళ్ళితిమి. మేము వెళ్ళినపుడు మా ముందుగ లేడి ఒకటి రోడ్డును దాటి వెళ్లుటను చూచితిమి. రేంజి ఆఫీసరు వెంటనే, ఇది చాల శుభసూచన యని చెప్పెను,

చోర్డీ రేంజి ఆఫీసరుగారు తక్కిన రెండు ఎరలను కట్టి వేయుటకు తాను వచ్చెదనని చెప్పెను. తన క్రింది ఉద్యోగితో ఇద్దరు ఫారెస్టు గార్డులను కడచిన రోజున మాతోపాటు ఉన్న

మనిషిని తీసికొని, తూర్పు దక్షిణ దిక్కులలోగల ఎరలు సజీవముగ ఉన్నవో లేవో చూచిరమ్మని చెప్పెను. మేము ఉత్తరపు వైపునకు, దక్షిణమునకు వెళ్లినపుడు, మధ్యలో నున్న ఎరను మేము చూచుకొనెదమని చెప్పితిమి. ఒక గంటన్నరకల్లా, మేము ఎద్దుదగ్గరకు చేరితిమి. ఎద్దు సురక్షిత ముగ నుండెను.

ఎరలను ఏర్పాటు చేయునపుడు ప్రతి దినము వానికి మేత, నీరు పెట్టు విషయమును మనము మరువకూడదు. ప్రతి దినము మేతమోపులను ఎద్దుల దగ్గరకు తీసికొనివెళ్లి వేయ వచ్చును. కాని వానికి నీరు పెట్టుట పెద్ద సమస్య. కుండలో గాని, కిరోసిను డబ్బాలలోగాని నీరును పెట్టి, ప్రతిరోజు ఆ పాత్రలలో నీరు పోయవచ్చును. సామాన్యముగా నీటిపాత్ర లను జంతువునకు సమీపములోనుంచిన, అవి వాటిని పగుల గొట్టగలవు. లేక పులి కిరోసిను డబ్బాను చూచి అమానించ వచ్చును. కనుక ప్రతిదినము ఎరలనుచూచుటకు వెళ్ళినవానిపి ఎరలనుఊడదీసి దగ్గరనున్న సెలయేటిలోగాని, నీళ్లుపెట్టి మరలతీసుకొనివచ్చి కట్టివేయవలయును. నీళ్లుకొంచెము దూరముగానున్నపుడు ఎరలను మైళ్ళకొలదిదూరము అటు ఇటు త్రిప్పుచుండవలయును. గ్రామస్థులు ఈవిషయములో కొంచెముసోమరితనము చూపుదురు. కనుకవారు అంత దూరము నడచివెళ్లుట అనవసరమనిభావింతురు. అదియు గాక, పశువులనుఎరలుగా ఉపయోగించితిమిగాన, అవిఎల్లె ననూ, చంపబడెడివేకాబట్టి, వానికినీళ్లుపెట్టుటకు అంతశ్రమ

పడవలసిన పనిలేదని వారుభావింతురు. హిందూదేశములోని పశువులను, ఎరలుగాఉంచు ప్రతివేటగాడును ఈ విషయమును తప్పకజ్ఞాపకముంచు కొనవలయును. ఒకవేళవారు కనుక ఈవిషయములో తగుజాగ్రత్త తీసికొనకపోయిననూ, లేకసమ్మకస్థైనవారిని ఈ పనికొరకు వినియోగించకపోయిన, పులిగాని, చిరుతగాని, ఎరలను చంపకపోయిననూ, అవి ఆహార పానీయములకొరకు అలమటించి క్షుద్బాధతో చనిపోవును.

మేము ఎరలను ఉంచినచోట మాత్రము అరమైలు దూరములో సెలయేరు కలదు. మేము ఆ జంతువును అచటికి తీసికొని వెళ్ళి, నీళ్లు త్రాగిన పిదప తీసికొనివచ్చి కట్టివేయుచుంటిమి.

ఈ చిక్కులేకుండ, అసలు ఎరలను సెలయేటి ఒడ్డున నీళ్లున్నచోటనే కట్టివేసిన బాగుండునుగదాయని మీరు తలంచవచ్చును. పులులుకూడ నీరు త్రాగుటకు వచ్చునుగాబట్టి చాల అరుదుగా అటువంటి ప్రదేశములలోనే ఎరలను ఏర్పాటు చేయుచుందుము. కాని ఎరను ఏర్పాటుచేయుస్థలమును నిర్ణయించుటలో ఆలోచించవలసిన విషయములు మరికొన్ని కలవు. నీటి ప్రవాహముల అంచులు, కాలిబాటలు, రోడ్డు, బండ్లు వెళ్లు త్రోవల వెంబడికూడ పులులు వెళ్లుచుండును. అటువంటి ప్రదేశములలో పులి గుర్తులు కన్పించినచోట ఎరలను కట్టివేయుట చాల మంచిది. నాల్గుత్రోవలు కలసిన కూడలిలో పులిగుర్తులు కన్పించిన, అచట ఎరను కట్టివేయుట

ఇంకనూ మంచిది. సెలయేళ్లు ఎక్కువగ నున్నచోట, పులులు సెలయేటి అంచుల వెంబడే ఎక్కువగా సంచరించవు. మేము ఈ ఎరను ఉంచినచోట, కొన్ని గుర్తులు కన్పించుటవలన, రేంజి ఆఫీసరుగారు ఎరను ఉంచుటకు ఈ ప్రదేశము ఉత్తమమైనదని చెప్పెను.

మేము తెచ్చిన రెండు ఎరలను ఉత్తర-పశ్చిమ దిక్కులలో చెట్లకు కట్టివేసితిమి. మాకు ఈ పని పూర్తి అగువరకు మధ్యాహ్నమయ్యెను.

మేము వన్యమృగ సంరక్షణ కేంద్రము చుట్టూ ఎరలను ఏర్పాటు చేసినంత మాత్రమున, పులిని కేంద్రములో బంధించితిమని మాత్రము తలచవద్దు. వన్యమృగ సంరక్షణ కేంద్రము కొన్ని మైళ్ళవరకు వ్యాపించియున్నది. కాని నరమాంసభక్షి ఏ వైపునుండి వచ్చినను, పులికి ఎరలు కన్పించును అప్పటి పరిస్థితిలో నాకు చేతనయినంత వరకూ తగు ఏర్పాటులు చేయగలిగితిని. తక్కినదంతయూ కర్మ, లేక అదృష్టము—మీకు ఈ రెంటిలో ఏది ఇష్టమయిన దానికే వదలితినని తలంచుడు.

మేము సాయంత్రము మూడు గంటలకల్లా తిరిగి-చోర్డీ వెళ్లుటకు బయలు దేరితిమి. రైతులు గ్రామము బయట పొలమును దున్నుకొనుచుండిరి. ఆ రైతులు, మేము ఉదయము ఎరలను చూచివచ్చుటకు పంపిన గార్డులు, నరమాంసభక్షి ఇద్దరు మనుష్యులను చంపినచోట ఏర్పాటుచేసిన ఎరను పులి

గతరాత్రి చంపెనని మాకు తెలియచేయమని గార్డులు చెప్పిరని మాకు చెప్పిరి. మేము ఎటు వెళ్లినది గార్డులకు, తెలియక పోవుటవలన మాకీవార్తను అందచేయలేక పోయిరి. కనుక గార్డులు, త్రోవన వెళ్లు వారందరికి, మాకీవార్తను తెలియ చేయమని చెప్పిరి.

మాకీవార్త తెలియగనే మేము త్వరితముగ చోర్డికి వెళ్లితిమి. అచట రేంజిఆఫీసర్లు యిద్దరూ, గార్డులు ఈవార్తను మాకు తెలియజేయలేదని గార్డులను తిట్టిరి. న్యాయముగా వారిని నిందించవలసిన పనిలేదు. వారు, ఆరోజు, మాకొరకు వచ్చినయెడల, మేము అటు యిటు తిరుగుచుండుట వలన, వారు మమ్ములను ఎట్టిపరిస్థితిలోనూ కలుసుకొనగలిగెడి వారుకాదు. పైగా, మేము ఇంక ఎక్కువ యిబ్బంది పడవలసి వచ్చెడిది. వారు మాకొరకు రాకుండ ఛోర్డిలోనుండి, త్రోవనవచ్చు వారందరికి మాకీవార్తను తెలియజేయమని చెప్పుటలో వారుమంచిపని చేసిరని తలచితిని. మేముత్వరగా వెళ్లుటవలన, మకామును నిర్మించుటకు కావలసిన వ్యవధి కలదు. వారు మాకీవార్తనుపంపి, చనిపోయిన ఎద్దుపై గ్రద్దలు మొదలగునవి వ్రాలకుండ కొమ్మలను కప్పిరి.

సాయంత్రము మూడున్నరగంటలకల్లా స్టుడీబేకరు కారును రోడ్డుపైవదలి ఎరనుఅచటికి కొద్దిదూరములో నుంచి తిమి. గాన, ఆకొద్దిదూరము చెట్లలోగుండానడచి వెళ్ళ వలయును. కొద్దిసేపటిలో కారువెనుకకట్టియున్న మడత మంచమునుఊడదీసి సిద్ధముచేసితిమి. ఈమంచముపొడవు

కొద్దిగతక్కువ ఈమంచమునకు కాకి నవారును అల్లితిని. అడుగుపొడుగున్న దానికాళ్ళను చెట్టుకుకట్టుటకు వీలుగా యుండును. మొత్తముమీద ఈమంచము ఆకృతిలో చిన్నది. తీసుకొనివెళ్లుటకు తేలికగాను, కూర్చొనినపుడు, తక్కినమంచ ములవలె శబ్దముకలుగదు.

అక్కడవున్న ఈకచెట్లువయస్సులో చాలచిన్నవి. అయిననూ అవిఇరువది అడుగులఎత్తువరకు పెరిగియున్నవి. వీనిలోఇంకను పెద్దచెట్లుకలవు. అవిఇంకనూ ఎత్తుపెరిగి యున్నవి. మకామును నిర్మించదగిన చెట్టునుచూచుకొని, ఎరనుచెట్టు మొదటిలో కట్టివేసితిని. అక్కడ అన్నియూ ఈక చెట్లుతప్ప, యితరచెట్లులేవు. ఈకచెట్టుకొమ్మలు చాలఎత్తు గానుండుటవలన, నేనుచాలఎత్తులో మకామునునిర్మించుకొని కూర్చొనవలసియున్నది.

నేను ఎక్కవలసినచెట్టుకు మొట్టమొదటి పన్నెండు అడుగులవరకు కొమ్మలులేనందున, చెట్టుఎక్కుటకు చాల యిబ్బంది పడవలసివచ్చెను. అందులోనిటారుగా ఉన్నచెట్టు ఎక్కుటలో నాకంతగా అనుభవములేదు. అందువలననేను ఒకఫారెస్టుగార్డు భుజములపైఎక్కి నేను చెట్టుకొమ్మనుఅందు కొని పట్టుచిక్కించుకొనువరకు, వారునన్నుపైకిఎత్తిరి. తరు వాత నేనుమెల్లిగా చెట్టుఎక్కితిని. ఈకచెట్టుఆకులు చాల పెద్దవిగాన, మకాము కన్పించకుండకప్పుట చాలతేలికపని. ఇకఅక్కడ ఉన్నచెట్లన్నియూ ఈకచెట్లేగాన మకామును

కూడ చెరకుఆకులలోనే కప్పితిమి. నేకూర్చొను మకాము భూమినుండి యిరువదిఅడుగుల ఎత్తులోనుండెను.

అచట ఎరగానుంచిన గేదెదూడనుపులి గతరాత్రిచంపి షుమారు సగమువరకు తినివేసెను. కాని ఇంకనూశవము సగముపైగా మిగిలియుండెనుగాన, పులితప్పక రావచ్చును.

రేంజిఆఫీసర్లకుగాని, ఫారెస్టుగార్డులకుగాని కారునడు పుట చేతగాదు. పైగా చెట్లుకొట్టు కూలీలుకూడ నావద్దనే ఉండిరి, ఒకపులిగనుక రోడ్డునుదాటి వచ్చినపుడు కారును చూచి, అనుమానించకుండ ఉండునట్లు, కారును, వీరందరితో షుమారు అరమైలుదూరము ముందునకునెట్టుకొని వెళ్ళమని చెప్పితిని. రోడ్డుసమమట్టముగా నుండెనుగాన. కారునునెట్టు కొని వెళ్ళుటకు వీరికంతశ్రమకాలేదు.

సాయంత్రము ఐదుగంటలప్రాంతములో వారునన్నా చెట్లపై వదలివెళ్లిరి. వారుయిరువది నిముషములకల్లా కారును ముందుకునెట్టుకొని వెళ్లుదురనియూ, ఇకపులివచ్చుటకు ఆటం కము ఉండదనియు తలచితిని. పులి నేనుతలచిన విధముగా రాలేదు.

పులి రాత్రి 8-15 గంటలకు చీకటి పడిన తరువాత అచ టికివచ్చెను. పులి తనరాకను ముందుగనే నాకు తెలియ పరచెను. లేళ్లు దుప్పులు "ఖార్ ర్ ర్ ర్ ఖా ర్ ర్ ర్" అనుశబ్దము చేయుచూ అటుగా పరుగెత్తెను. పులివచ్చుచున్న

విషయమును ఈజంతువులు అడవిలో నలుదిశలలకు తెలియునట్లుగా శబ్దముచేసెను. కాని పులులుతమ గమనమును యితర జంతువులకు తెలియకుండునట్లుగా సవ్వడిలేకుండనచ్చును. అసలు ఇదిక్రమమైన పద్ధతియా — అక్రమమైన పద్ధతియా? అందువలన అడవిలో నివసించు జంతువులకు ఇదిచాలక్లిష్ట సమస్య.

పులి నిశ్శబ్దముగనే వచ్చెను. అదిఆకుచెట్ల ఆకులపై నడచునపుడు కలిగినశబ్దము నాకుస్పష్టముగా వినిపించుచుండెను. అది శవముదగ్గర నిలబడి యుండెను.

నేను టార్చిలైటు వేసిచూచితిని. అది పైకినావంక చూసెను. టార్చిలైటుతో రెండుసెకండ్ల కాలమువరకు పులికి జూలు ఉన్నదో లేదో తెలుసుకొనలేక పోతిని. నేను వెంటనే రైఫులు కాల్చితిని. ఆ దెబ్బ దాని గుండెలో తగిలెను.

అది చచ్చినదో లేదో తెలుసుకొనుటకు పదిహేను నిముషములు చెట్టుపైననే వేచియుంటిని. అది అటు యిటు కదలక పోవుటవలన, చచ్చినదని ఊహించితిని. నేను చెట్టు దిగి, క్రింద పదెనిమిది అడుగులలోపు కొమ్మలు లేనందున, క్రిందకు దూకితిని. నేను బరువుపాటి మనిషినికాన, చెట్టును పట్టుకొని జారలేక పోయితిని. ఈ జంతువునకు జూలులేదు, కనుక మరియొకసారి నరమాంసభక్షి తప్పించుకొని పోయెను. దానికిబదులు నిర్దోషియైన మరియొకపులి క్రూరశిక్ష ననుభవించవలసివచ్చెను. అదియుగాక జిల్లా అటవీశాఖాధికారికి

నిర్దోషియైన పులినిచంపినందులకు క్షమాపణ చెప్పుకొనవల యును. జిల్లా అటవీశాఖాధికారి, నాకు వన్యమృగ సంరక్ష ణకేంద్రములో, నరమాంసభక్షకిని చంపుటకు ప్రత్యేక అను మతినిచ్చెను. గాని, నిర్దోషులను చంపుటకుకాదు.

నేను ఘోరపాటు చేసితిని.

నేను రోడ్డు పైకి వెళ్ళి, కారు కొంచెము దూరములో నుండునని, చోర్డీ వైపుకు నడచి వెళ్ళితిని. కాని అచట కారు కనిపించలేదు.

నేను చెప్పిన మాటను అపార్థము చేసికొని, వారు కారును రెండు మైళ్ళదూరములోనున్న చోర్డీ వరకు నెట్టు కొని వెళ్ళియుండవచ్చును.

కనుక నేను చోర్డీలో రేంజి ఆఫీసరు ఇంటికి వెళ్లితిని. నేను వెళ్లినప్పటికి ఇద్దరు రేంజి ఆఫీసర్లు ఇంటివద్దనే యుండిరి. నేను పులినికాల్చితిననియూ, జూలులేనిపులిని కాల్చితిననియూ చెప్పితిని.

కాని వారు మాత్రము అది తప్పక నరమాంసభక్షియే అయి యుండునని వాదించిరి. బహుశః దాని జూలు వెంట్రు కలు గత రెండు సంవత్సరములలో రాలిపోయి యుండునని కూడ చెప్పిరి. లేక ఒకవేళ దానికి అసలు మొదటినుండి జూలు ఉండియుండదు. జూలు ఉన్నదని చెప్పుట కేవలము భ్రమ

మాత్రమే అనికూడ వాదించిరి. నేను ఈ విషయమునకు ఒప్పుకొంటిని, కాని నాకు పూర్తి నమ్మకము కుదరలేదు.

నా కారును ఎచట వదలిరని నేను వారిని అడిగితిని. వారు వెంటనే కారును నడుపుట మాకు చేతకానందున, మీరు చెప్పిన ప్రకారము చోర్డి వైపునకు కాక రెండవ వైపునకు అరమైలు వరకు నెట్టుకొనివెళ్ళి ఆపితిమి • అని• చెప్పెను.

మనుష్యుల జీవితములు కూడ అంతేవన్నట్లు నేను ఒక నిట్టూర్పు విడచితిని. జీవితములలో మొరక పల్లము లుండుట సహజము. ఆరోజు రాత్రి వీటి రెంటిలో ఏది ప్రాముఖ్యము వహించెను ? • సమాధానము మాత్రము నాకు తెలియలేదు.

నేను కాఫీత్రాగినపిదప కొంతనుంచి మనుష్యులను, వాసములను, లైట్లు, తాళ్లుతీసుకొని బయలుదేరితిమి. వాళ్ళు పులిని త్రాళ్ళతో వాసములకు కట్టులోపల, నేనుకారును తెచ్చుటకు వెళ్ళితిని.

ఒక గంటసేపటిలో మేము కుమిలీకి చేరుకొంటిమి.

మరుసటిరోజు ఉదయము నేను పులిచర్మమును తీసితిని. యిద్దరు రేంజిఆఫీసర్లు ఈలోపల జిల్లా అటవీ శాఖాధికారికి రిపోర్టులువ్రాసిరి. నేను జూలులేని పులినికాల్చి తినని, వారు పైఅధికారికి వ్రాసిరి. కరదిచెట్ల వన్యమృగ సంరక్షణ కేంద్రములో నరమాంసభక్షిని చంపుటకు అనుమతినిచ్చిరికాని, వేరుజంతువును చంపుటకుగాదు. రేంజి ఆఫీసర్లు

యిద్దరూ, వారిస్టేటుమెంటులలో అవసరమైన చర్యతీసుకొను అధికారము పైఅధికారికే వదలిరి.

వారిద్దరు ఆవిధమైన రిపోర్టులు వ్రాసినందుకు నన్ను క్షమాపణ వేడిరి.

నేను నా సెలవు అయిపోవునంతవరకు అచటనేయుంటిని. కాని తక్కినఎరలు సజీవముగనేయుండెను. షిమోగాలోనున్న అటవీశాఖాధికారి తన క్రింది ఉద్యోగుల కిట్లు వ్రాసెను. నేను వన్యమృగ సంరక్షణకేంద్రములో నరమాంస భక్షినిచంపుటకు అనుమతినిచ్చితిగాని, మామూలుపులిని చంపుటకుకాదుగదా! అనియు నేనుమామూలు పులినిచంపితినని తెలియచేసినందున జిల్లా అటవీశాఖాధికారికి నేనుసంజాయిషీని చెప్పుకొనవలెననియుకూడ వ్రాసెను.

నేను హిందూదేశములోనే ఎక్కువజీవితమును గడిపితిని. ప్రతి ప్రభుత్వోద్యోగి ఏదో రివాజుకు అలవాటుపడినట్లు కన్పించుచున్నారు. జిల్లా అటవీశాఖాధికారి ఈ విధముగానాకు ఉత్తరమువ్రాసినందులకు నేను అంతగాకోపగించుకొనలేదు. నేను అటవీశాఖాధికారికి, మీకునిజవార్తను అందచేయలేదనియు, నేను నరమాంసభక్షిని కాల్చలేదని మీరుపొరపాటున వ్రాసిరని, నేను నరమాంసభక్షినే కాల్చితిననియు, నాకుయిచ్చిన అనుమతిప్రకారమే కేంద్రములో నరమాంసభక్షిని చంపితిననియూ, ఒకలేఖవ్రాసితిని.

ఈ ఉత్తరము అందినతరువాత, అందరుసంతోషముగ నుండిరి. అటవీశాఖాధికారులందరూ తృప్తిచెందిరి. ఈ విషయమునకు సంబంధించినవారందరు ఎవరివిధులనువారు సక్రమముగా నిర్వర్తించిరి.

నేను బెంగుళూరు వెళ్లుటకు ప్రయాణమైతిని. నాకు రేంజిఆఫీసర్లిద్దరూ చేసిన సహాయమునకు, నేను కృతజ్ఞత తెలియజేసి, తక్కిన నాలుగుఎరలను తిరిగి అమ్మివేసితిమి. నేను కొన్నఖరీదులో నాల్గవవంతు తగ్గించి వాటి యజమానులకే అమ్మితిమి. నేనుయింటికితిరిగి వచ్చుచుంటిని. దారిలో నేను షిమోగాలో ఆగి,జిల్లా అటవీశాఖాధికారికి కృతజ్ఞత తెలియజేయుటకు కొద్దిసేపాగితిని. అటవీశాఖాధికారి తను సంజాయిషీకోరిన ఉత్తరమునకు నేను చక్కని జవాబు యిచ్చితినని సంతోషమును వెలిబుచ్చెను. ఇంక అటవీ శాఖాధికారి, తనక్రింది ఉద్యోగులువ్రాసిన రిపోర్టులవలన సంజాయిషీ కోరవలసి వచ్చెననియూ, అట్లువ్రాసినందుకు క్షమించమనియూ కోరెను. నేను దానినిగూర్చి అంతగాబాధ పడవలదని అటవీశాఖాధికారితో చెప్పితిని. నేనే, రేంజి ఆఫీసర్లతో జూలు లేకపోవుటవలన, అసలుపులిని కాల్చలేదని చెప్పితిననెను. మేము అప్పటినుండి మంచిస్నేహితులమయితిమి. నేను ప్రయాణము సాగించితిని.

తరువాత ఒకసంవత్సరము గడిచెను. తండ్రీ కొడుకు చనిపోయిన తరువాత, మరల ఎవరును పులివాత పడలేదు. ఆసంవత్సరము మధ్యలోనో లేక కొన్నినెలల తరువాతనో

నాకు బాగా జ్ఞాపకములేదుగాని, జూలుకలి నరమాంసభక్షి విషయము వట్టిదేననియూ, నేను అసలు నరమాంసభక్షినే కాల్చితినని అందరూతలచిరి.

సాగర్ పట్టణము బయట కుమ్సీ ఆనందపురము రోడ్డుదిగువలో, జోగ్ జలపాతము దగ్గరలో పులి ఒక మనిషిని చంపెను. పదిహేను రోజులతదుపరి ఆనందపురము వద్ద మరియొకమనిషిని, తరువాత ఒక నెల తదుపరి తగర్తి, గౌజ అను గ్రామమువద్ద ఒకమనిషిని, స్త్రీని వరుసగాచంపెను. ఈ రెండు ప్రదేశములు ఆనందపురిమునుండి పదిమైళ్లు వృత్తాకారములోనున్నవి. ఆగస్టు నెలలో పట్టపగలు లంబాడీ కుర్ర వానిని పులిఎత్తుకొని వెళ్లెను. ఈకుర్రవాడు కుమ్సీ దగ్గరలో రోడ్డుప్రక్కగా పశువులను మేపుచుండగా పులి చంపెను.

నరమాంసభక్షి తండ్రికొడుకు యిద్దరుచెట్లుకొట్టు వాళ్ళను చంపినతదుపరి ఎచటికోవెళ్లి, మరల తిరిగివచ్చి మనుష్యులను ఎక్కువగా చంపుచుండెను. ఒకవేళ ఆజంతువు గాక, వేరొకపులి దీనిస్థానమును ఆక్రమించి మనుష్యులను చంపుచుండి యుండవచ్చును.

నేను ఏదోవిధముగా వారమురోజులు సెలవుసంపాదించి, కుమ్సీకి బయలుదేరితిని. షిమోగాలో యిదివరకున్న అటవీశాఖాధికారి మారిపోయి మరియొక ఉద్యోగివచ్చెను. క్రొత్తఉద్యోగికూడ తప్పకవిజయమును పొందుగాకయని సన్మాశీర్వదించెను. కుమ్సీచోర్డీలలో రేంజిఆఫీసర్లు యిదివర

నున్నవారేనా! అనినేనుఅడుగగా అవునని సమాధానము చెప్పెను,

నేను పాతస్నేహితులను కలుసుకొనవలెనని, వారిద్దరు ఉండు యిళ్ళకు వెళ్ళితిని. వారిద్దరూకూడ, ఈపులి వేరొక నరమాంసభక్షియనియూ, అసలునరమాంసభక్షిని నేను సంవత్సరముక్రితమే చంపితిననియు తెలియజేసి. ఆజంతువు చని పోయిన సంవత్సరమువరకు ఎవరునుచంపబడలేదు గనుకవారు అట్లుచెప్పిరి. కాని నేను నరమాంసభక్షిని చంపియుండక పోయిన, అది యిప్పటివరకు ఎచటనుండెనను సందేహము కలుగుచున్నది. పులిఒకసారి నరమాంసభక్షియైన, ఎప్పుడూ నరమాంసభక్షిగానే యుండును. పులులు అలవాటును ఎన్న టికిమానలేవు. ఈపులి అప్పటినుండి తిరుగుచున్నప్రదేశము లోతప్పక మనుష్యులను చంపియుండునని తలచితిమి.

వారుచెప్పినవాదన బాగుగనేయున్నదని నేను అంగీక రించితిని.

మేము అనుసరింపదగు కార్యక్రమమును చర్చించి తిమి. పులి, సాగర్, ఆనందపురము, తగర్తి, గౌడ, కుమిలా అనుప్రదేశములలో మనుష్యులను చంపెను. ఇదేప్రాంత ములో, రెండుసంవత్సరములక్రితము జూలుగలపులి అసలు నిజముగా ఉన్నట్లైన అనేకమంది మనుష్యులనుచంపెను. కనుక నేను ఎరలను ఏప్రదేశమునకు కట్టివేయవలయును ? ఎటునుండి ప్రారంభించవలెను ? ఈప్రశ్నలపై మేమింక ఏ నిర్ణయమును తీసికొనలేదు.

మేము మరుసటి దినమున ఒక నిర్ణయమునకు వచ్చితిమి. అదృష్టవశాత్తు పులి పశువులు కాయుకుర్రవానిని పట్టపగలు అమిరిగొల్ల అను ప్రాంతమువద్ద చంపితినెను. కరిదిబెట్ట వన్యమృగ సంరక్షణ కేంద్రము తూర్పుదిశలో అమిరిగొల్ల సరిహద్దువరకు గలదు. ఈ కేంద్రమునకు అమిరిగొల్ల ఈశాన్య సరిహద్దు అయియున్నది. ఫారెస్టు గార్డులు ఈ విషయమును చోర్డీలో రేంజిఆఫీసరుకు తెలియజేసిరి. రేంజి ఆఫీసరు వెంటనే కుమ్మీ వచ్చి సాయంత్రము మూడు గంటలకల్లా నా కావిషయమును తెలియజేసెను. నేను, ఇద్దరు రేంజిఆఫీసర్లు అమిరిగొల్ల చేరుటకు ఎగుడు దిగుడుగానున్న బండ్లత్రోవ వెంబడి నడిచివెళ్లితిమి. అమిరిగొల్లలో అటవీశాఖవారిది చిన్న బంగళా ఒకటికలదు. బంగాళా వెనుకనే చిన్న సెలయేరుకలదు. ఈ సెలయేరు రెండుమైళ్లు పోయినతరువాత, ఒక పెద్దచెరువులో కలిసెను. పులిచేత చంపబడిన కుర్రవాడు, ఈ చెరువుఒడ్డుననే పశువులను మేపుచుండెను. పులి సెలయేటిగుండావెళ్లి ఉదయము తొమ్మిదిగంటలకు కుర్రవానిని ఎదుర్కొనెను. ఈ కుర్రవాని చుట్టును పశువులు మేత మేయుచున్ననూ, పులి వాటిని ఎదుర్కొనలేదు. కుర్రవానిని చంపిన తరువాత, పులి శవమును నోట కరచుకొని సెలయేటిలో గుండ అడవి లోనికి వెళ్లిపోయెను.

పులి పశువులకాపరి కొరకు వచ్చినప్పటి గుర్తులు, శవమును నోటకరచుకొని వెళ్లునప్పుడు, అతని కాళ్లు నేలపై

రాచుకొనిపోయిన గుర్తులు యిసుకలో వారు నాకుచూపించిరి. త్రోవపొడుగునా రక్తపుగుర్తులు ఎక్కడనూ కన్పించలేదు. మేము ఈగుర్తులను చూచునప్పటికే ప్రొద్దు గ్రుంకెను. శవముకొరకు వెదకుటకు చీకటిపడిపోయెను. అప్పుడు నేను చాల బాధపడితిని. మాకీవార్తను ఆలస్యముగ చేర్చినందుకు కొంచము కోపగించుకొంటిని.

మాకువార్త చేరగనే, మేము ఆలస్యము లేకుండనే బయలుదేరితిమి. అమినిగోల వచ్చురోడ్డు చాల అధ్వాన్న ముగనుండెను. అసలు నడచుటకుకూడ వీలులేకుండ ఉండెను. త్వరగానడచి కాలుగాని, తొంటిగాని విరగగొట్టుకొన దలచు కొనలేదు. నేనుఆరోజు సాయంత్రము కుర్రవానిశవమును కనుగొనగలిగిన ఆరాత్రికి పులికొరకు వేచియుండెడివాడను. ఈ నా దురదృష్టమును చూచి విసుగుకొంటిని.

ఇద్దరు రేంజిఆఫీసరులు బంగళాలోని ఒకగదిలో నిద్రించిరి. నేను వేరొక గదిలోనిద్రించితిని. గార్డులిద్దరూ బంగళా నానుకొనియున్న వేరొకగదిలో తలుపులువేసుకొని పరుండిరి.

అర్ధరాత్రిసమయములో పులిఅరచుచుండెను. అది బంగళాకు ఒకమైలుదూరములోనే యుండెను. పులిమరల అరచినప్పుడు రేంజిఆఫీసరులు అరుపునువినిరి. వారు వెంటనే నేను నిద్రించుచుంటిననితలచి, అరుపువినుటకు నాతలుపుతట్టిరి నేనుతలుపు తెరచి వారినిలోనికిరమ్మని చెప్పితిని. నేనుకూడ పులిఅరుపును వినుచుంటినని వారికిచెప్పితిని.

నేనుతరువాత సింహద్వారమును తెరచి వరండాలోనికి ప్రవేశించితిని. వెన్నెలకాంతి వరండాలో ప్రతిబింబించు చుండెను. నేను బయటకువెళ్లి వెన్నెలలో నటుయిటు తిరుగు చున్నప్పుడు, పులిఅరుపును మరలవింటిని. ఈసారివిన్పించిన అరపు ఇంకనూదగ్గరనుండి విన్పించెను. ఆజంతువు సెలఏటి కట్టపైనెళ్ళుచున్నదనియు. ఈబంగళాకు సెలయేటికట్ట కొద్ది దూరములోనే యున్నదిగాన ఆజంతువు ఇంకకొద్దిసేపటిలో ఇటురావచ్చునని తలచితిని. అసలుఇది నరమాంస భక్షి యేనా ?

నా అదృష్టమును పరీక్షించదలచు కొంటిని.

నేను కొద్ది నిమిషములలో టార్చిలైటును రైఫులుకు బిగించితిని. బంగళా వెనుకనున్న స్నానము గదిగుండా బయటికి వెళ్లి ఫరివిచెట్టు ప్రక్కగా నడచి సెలయేటివద్దకు వెళ్లితిని.

వెన్నెల కాంతిలో సెలయేటిలోని నీళ్లు మెరయు చున్నట్లుగా కన్పడుచుండెను. నేను నిలబడిన సెలయేటికట్టపై చెట్లుండుటవలన అచటఅంతా చీకటిగానేయుండెను. కలిరి చెట్ల కేంద్రమునకు ఈ సేలయేరు ఉత్తరసరిహద్దులలో నుండెను. సెలయేటి ఆవలిగట్టుకూడ కేంద్రములోనిదేకాని, బంగళా మరియు నేనునిలబడిన సెలయేటి ఆవలిగట్టుమాత్రము కేంద్ర సరిహద్దునకు యివతలనున్నది.

పులి మరలఅరచెను. అదివేగముగా నావైపుకే వచ్చుచుండెను. ఆజంతువునాకు రెండుఫర్లాంగుల దూరము

లోనేయుండెను. నేను దానినిచంపుటకు యికత్వరగా ప్రయ త్నించవలెను.

ముఖ్యమైనవిషయము అసలుపులి ఆవలిగట్టుపై నున్నదా, లేక యీవలిగట్టుపైనా ? జంతువు ఆవలిగట్టుపై నున్న, నేనునీళ్ళవరకు వెళ్ళిననేగాని, నేనుదానిని స్పష్టముగా చూచికాల్చలేను. లేక పులిగనుక, నేనున్నకట్టపైనేయున్న నేను నీళ్ళదగ్గరకువెళ్ళిన, అదినన్ను వెన్నెలలో తప్పకచూడ గలుగుటయేగాక, అదినాకన్న ఎత్తైన ప్రదేశములోనుండును. కనుక అట్లుండుటవలన నాకుఎక్కువ ప్రమాదముకలదు. అది నన్ను తేలికగా ఎదుర్కొనగలదు.

అది మరలబిగ్గరగా అరచెను. ఈసారి పర్లాంగుదూర మునుండి అరచెను. ఇక ఏమాత్రము ఆలస్యముచేయుటకు వీలులేదు. తప్పకకాల్చవలయునని తలచితిని. కానిఒకవేళ పులి ఆవలిగట్టుపై నున్నదేమో !

ఈలోపల నేను దాగుకొనుచోటు కొరకు వెదకు చుంటిని. ఒకవిధమైన ఎర్ర గడ్డి, బీళ్ళలో కట్టకన్న రెండు అడుగుల ఎత్తువరకు పెరిగియుండెను. సెలయేటిలోనికి మెల్లిగా దిగి గడ్డిలోనికి శబ్దములేకుండ వెళ్ళితిని నేనా గడ్డిలో మోకా ళ్ళపై కూర్చుంటిని రెండు మూడు నిముషములవరకు నిశ్శబ్ద ముగా గడచెను. కట్టపైన చెట్లనీడవలన, కట్టపైన ఏమున్నది నేను చూడలేక పోయితిని.

పులి మరల నా ఎదురుగా పెద్దగా అరచెను. నేను యిప్పటివరకు నిలబడిన కట్టపైన యుండెను. నేను చూచి నపుడు పులి మెల్లగా వెళ్ళుచుండెను.

పులి నా ఎత్తుతో సమానముగా వచ్చువరకు నేను ఒకటి, రెండు, మూడు, నాలుగు అని లెక్కపెట్టుచుంటిని. ఇంతలో నేను లైటు వేసి చూచితిని. మచ్చలుగలపులి నాకు పదిహేను గజముల దూరములో నుండెను.

పులి వెంటనే ఆగి తిరిగి నావైపుచూచెను. పులి కుడి ప్రక్క నావైపుకుండెను గాన, నేనుదానికుడి భుజముపైకాల్చి తిని. ఆదెబ్బతగలగనే అదిఎగిరి వెనుకకు పడిపోయెను. నేను వెంటనే రెండవసారి, మూడవసారి కాల్చితిని.

పులి అప్పటికి నన్ను గుర్తించి నాకొరకు పాకివచ్చు చుండెను. ఐదుగజముల దూరములో నుండగనే, నేనుకాల్చిన గుండు దానిపుఱ్ఱెలోనికి వెళ్లెను.

నేనుదానిని తరువాత పరీక్షించితిని. దానిమెడచుట్టూ ఉన్నజూలును చూచి ఆశ్చర్యపడితిని. దాని మెడచుట్టూ జూలు క్రమముగా పెరిగియుండెను.

అడవిలో కన్పించు కొన్నిరహస్యములను మనము తెలుసుకొనలేము ఈ పులికి జూలు ఎందువలన వున్నదో ఎవరు చెప్పలేరు.

—o—

4. పెగిపాలయము నరమాంస భక్షి

ఇదినరమాంస భక్షియైన పులినిగూర్చి సంపూర్ణమైన కథమాత్రముకాదు. పులిజరిపిన దండయాత్రలు, చివరకు దానినిచంపు విషయము యీకథలోకన్పించవు. ఎందువలననగా నేనీగ్రంథమును వ్రాయునప్పుడు ఆజంతువు సజీవియే. ఆ జంతువు పదునాలుగు మంది మనుష్యులను చంపి తిన్నట్లుగా అధికారపూర్వకమైన ఆధారములున్ననూ, అనధికారపూర్వకముగా ముప్పదిఏడు మంది మనుష్యులను, పిల్లలను, స్త్రీలను చంపి తిన్నట్లు చెప్పబడుచుండెను. అనధికార పూర్వకమైన అంచనాల ప్రకారము, యిందులో సగము మందిని పూర్తిగనో కొంతభాగమునో తినెననియు, తక్కినవారిని కాలిగోళ్ళతోపీకి నాశనము గావించెననియు చెప్పుదురు. అధికార పూర్వమైన అంచనాలో పూర్తిగా చంపి తిన్నవారినీ లెక్క వేసిరి. గాని గోళ్ళతో పీకి చంపిన వారిని లెక్కలోనికి తీసికొనలేదు. అధికార, అనధికార పూర్వకములైన లెక్కలలో మరణముల సంఖ్యలో కూడ తేడాయుండెను.

నేను మీకుచెప్పబోవు కథలోని ముఖ్య విశేషమేమన, ఈ కథలోని పులి, నేనింతకుముందు వ్రాసిన గ్రంథములో See Man-eaters and Jungle Killers (London Allen and unwin L. T, D) ని "రాజనగరపు వినాశకారి

ఇవి రెండును ఒకటేనని నానమ్మకము. నేనాగ్రంథమును వ్రాయునపుడు, పులియొకటి, ఉత్తరకోయంబత్తూరుజిల్లాలోని డింబుమ్ దగ్గరకల అడవిలో కొండపైకి వెళ్ళి ఘాటురోడ్డు, సత్యమండలము అను పట్టణములకు మధ్యలో నివాసమేర్పరుచుకొనెను.

ఆకొండవద్దగల పొదలతోనిండిన అడవికిసమీపమున రాజనగరముఅను చిన్నగ్రామముకలదు. ఈ గ్రామమునుండి పశువులకాపరులు పసువులనుమేతకై అడవికితోలుకొని వెళ్ళినప్పుడు పులివారిని చంపుచుండెను. అదిఅప్పటినుండియు రాజనగరప్రాంతపు పులియనిప్రసిద్ధిచెందెను. అదియునుగాక అదిఒక విచిత్రమైనఅలవాటును కలిగియుండెను. ఆజంతువు పసువులకాపరులను వెనుకకుండావచ్చి ఎదుర్కొని కాలిగోళ్ళతో చీల్చి చంపి, తరువాత సమీపములో మేతమేయుచున్న పశువులలో తనకు నచ్చినపశువులను తీసుకొనివెళ్ళుచుండెడిది. అదిఅప్పటివరకు చంపినవారితో ఎవరినిగాని కొరికిచంపినట్లుగా అధికారపూర్వకమైన ఆధారములులేవు. ఒకరిద్దరు పులివాతనుపడి తప్పించుకొనిరిగాని, వారినిపులికొరికినట్లుగా ఆధారములు కన్పించలేదు. కనుక ఈపులి మనుష్యులను ఎదుర్కొనినపుడు, గోళ్ళతోపీకి నాశనముచేసెడిదికాని, నోటితో కరచెడిదికాదని అందరూచెప్పుకొనుచుండెడివారు.

పులి ఈఅలవాటును కలిగియుండుటవలన, దానిముఖములోగాని, లేకనోటిలోగాని, కరచుటకు, కొరకుటకు వీలులేకుండ ఎవరోగాయపరచిరని, తలంచిరి. మరలఅది పశువుల

కాపరులను ఎదుర్కొని చంపినతదుపరి, పశువులనుచంపి, శుభ్రముగాతినెడిది. కనుకఅది అవసరమైనప్పుడు కొరికితినె డిదని రుజువగుచున్నది.

మొత్తముమీద ఇటువంటిఅలవాటును కలిగియుండుట విచిత్రమైనవిషయమేకాని, దీనినిగూర్చి ఏవేవో కట్టుకథలు చెప్పుటేగాని, ఈ అలవాటుకుగల కారణమును ఎవరునూ వివరించి చెప్పలేకపోయిరి.

నేను ఈ పులికొరకు ప్రయత్నించి, ఎట్లు విఫలమైనది ఈ కథలో వివరించితిని, ఈ జంతువు ఆకృతిలో చాల పెద్దది. నేను మొట్టమొదటిసారి ఈ జంతువును చంపుటకు ప్రయత్నించితిని కాని విఫలుడనయి బెంగుళూరునకు తిరిగివచ్చితిని. సదవకాశముకొరకు వేచియుండి మరియొక పర్యాయము వెళ్లి దానిని చంపవలయునని తలచితిని.

నా స్నేహితులు కొందరు ఈ పులిని గూర్చిన వివరములను తెలుసుకొనుటకొరకు నాకు ఉత్తరములను కూడ వ్రాసిరి, నా పురాతనస్నేహితుడైన జోకెరనీ అను నాతడు కాలిఫోర్నియాలోని లాస్ ఏంజిల్సేనుండి పులిని గూర్చిన తదుపరి విశేషములకొరకు ఎదురు చూచుచుంటినని తంతిని పంపెను.

కాని రాజనగర వినాశకారి యైన పులి కొంతకాలము మనుష్యులను నాశనము గావించుట మాని, అచటనుండి అదృశ్యమయ్యెను. కాన. నేను, నామిత్రులకు కావలసిన విషయ

మును తెలియజేయ లేకపోయితిని. మేమందరము, బహుశ ఆజంతువు ఒక వేళ ఈ దుర్గుణమును విడచిపెట్టి, క్రొత్త సంవత్సరముతోపాటు నూతన జీవితమును మంచిగుణములతో జీవితమును కొనసాగించుచున్నదా అని తలచితిమి. ఒక వేళ అదిదూరప్రాంతములకు వెళ్ళి చనిపోయి యుండవచ్చునని కూడ తలచితిమి.

కాలము గడచినకొలది రాజనగరపు రైతులు యథావిధిగ పశువులను మేతకొరకై అడవికి తోలుకొనివెళ్ళి సాయంకాలమునకు సురక్షితముగ నింటికి చేరుచుండిరి.

తొమ్మిది నెలలతరుపరి ఒకరోజు సాయంసమయములో నిద్దరు పశువుల కాపరులు — యిద్దరిలో నొకడు పెద్దవాడు రెండవవాడు కుర్రవాడు, పశువులను పెగిపాలియము అను గ్రామమునకు తోలుకొని వచ్చుచుండిరి.

ఆప్రదేశమురో అడవిదట్టముగా పెరిగియుండెను. చిన్న చిన్న సెలయేళ్లు ప్రవహించుచుండెను. వర్షాకాలములో నీరు సెలయేళ్ళగుండా తూర్పునకు ప్రవహించి, అచట కొండలపై నుండి జలపాతములవలె నీరుపడుచుండెను. ఆరోజునమాత్రము సెలయేటిలో నీరులేదు. ఆప్రశాంత వాతావరణములో "బుల్ బుల్" మరియు "వెన్ సిస్టర్" అను పక్షుల ధ్వనులు చక్కగా వినిపించుచుండెను.

పశువులు సెలయేటిని దాటుచుండెను. పసులకాపరులిద్దరిలో పెద్దవాడు సెలయేటిమధ్యలో నుండెను. చిన్నకుర్రవాడు యీవలివడ్డున నుండెను. త్రోవ వెనుక వెదురుచెట్లు

గడ్డితో అల్లుకొనబడి వంగియుండుటవలన ముందువెళ్లుచున్న మనిషి కన్పించుటలేదు. అదియుగాక పశువులు నడచునపుడు, లేచినదుమ్ము ఇంకనూ అణగిపోలేదు. కుర్రవాడు ఏవో ఆలోచనలతో పశువులవెనుక పోవుచుండెను.

ముందున్న పశువుల కాపరి పెద్దశబ్దమును విని ఏమిటో తెలుసుకొనవలెనని వెనుదిరిగి చూచెను. అచట ఏమియూ కన్పించుటలేదు. అతని వెనుకనున్న త్రోవ వెనుకుపొదలలోగుండా కలదు. అతనికి ఏమియూ కన్పించ నందున, కుర్రవాడు వచ్చునను ఉద్దేశ్యముతో, అతను మరల నడకను ప్రారంభించెను.

పశువులకాపరి పెగియపాలెము వెళ్లిన తరువాత వెను దిరిగి చూచెను. కుర్రవాడు మాత్రము కన్పించుటలేదు. అతను కుర్రవానిని "వెంకట్ వెంకట్" అని పేరుపెట్టి బిగ్గ రగా పిలచెను. కాని సమాధానములేదు. పశువులకాపరి విసుగుచెంది కొంచెముసేపు ఆగి మరల పిలచెను. మరల సమాధానములేదు. ఈ లోపల పశువులు గ్రామములోనికి వెళ్ళుటవలన, పశువులనతడు వదలి వెళ్ళుటకు యిష్టములేక, వానివెనుకనే తనుకూడ వెళ్లెను. గ్రామము చేరిన పిదప కుర్రవాడు రాలేదని తెలుసుకొనెను.

కుర్రవాడు ఏదోకారణమువలన తిరిగి రాలేదని తృప్తి పొందిరి. అతడు ఆలస్యము చేసినందులకు ఏదోకారణ ముండుననని ఊహించిరి. ఒకగంటగడచిననూ కుర్రవాడు

తిరిగి రాకపోవునప్పటికి, పశువులకాపరి, దారి వెదురు బొంగుల చుట్టచుట్టి యున్నచోట నీకుఱ్ఱవానిని కోల్పోయితి నని తలచెను. ఆ ప్రదేశములోనే తానువిన్న శబ్దమును గుర్తుకు తెచ్చుకొని, కుఱ్ఱవానికి ఏదోజరిగియుండునని ఊహించెను. బహుశ అతనిని పాముకరచి యుండవచ్చునని తలచెను. నరమాంసభక్షిగాని లేక చిరుత విషయమును గాని అతనికి గుర్తురాలేదు. పెగిపాలయము ప్రాంతములో యిది వరలో ఎన్నడును ఈజంతువులు మనుష్యులను చంపలేదు.

అతడు వెంటనే వెదురుపొదల దగ్గరకు వెళ్లెను అచటదారిలో, పశువుల కాలిగుర్తులు, వానిపై తనకాలి గుర్తులు తరువాత పులి కాలిగుర్తులు కొద్ది ఘర్షణజరిగిన గుర్తులు పిల్లవాడిని లాగిన గుర్తులు స్పష్టముగా కన్పించు చుండెను.

పెగిపాలయము ప్రాంతపు నరమాంస భక్షియైన పులివిషయము అందరకు తెలిసెను.

కాలము గడచినకొలది, చనిపోయిన మనుష్యుల సంఖ్య వివిధ ప్రదేశములనుండి — దక్షిణముగా ముప్పది మైళ్ళ దూరములోనున్న తలవడి, తళైమలై మరియు— తూర్పున పొన్నచిమలై కొండలు — కావేరినది ఒడ్డున నలుబదిమైళ్ళ దూరములో నున్న అలాబడి అనుచోట, ఉత్తరముగా కొళ్లేగల్ పట్టణమునకు ఆరుమైళ్ళ దూరము లోను పులివాతన పడినట్లుగా వార్త తెలియు చుండెను. చివరకు ఉదయము పదిన్నర గంటలకు పదిహేను సంవత్సర

ముల పిల్లవాడిని పొలములో నుండగా పులి ఈడ్చుకొని వెళ్లెను. పెగియపాలెములో మొదటాపశువుల కాపరియైన పిల్లవాడిని చంపిన మూడు నెలలకు, ఈ పులిని గూర్చిన విశేష మొకటి అప్పటికి తెలుసుకొనిరి. అదివరలో అడవినుండి కొట్టిన వెదుళ్ళు తోలుకొనివచ్చిన బండ్ల వలన ఏర్పడిన దారి వెంబడి ముగ్గురుమనుష్యులు వచ్చు చుండిరి. నరమాంసభక్షి పరిసరములలో నున్నదని తెలిసిన తదుపరి, అత్యవసరమైన నేతప్ప. ఎవరునూ అడివిలోనికి పోవుటలేదు. ఒకవేళ వెళ్ళిననూ, పగటిపూట గుంపుగా వచ్చుచుండిరి. వీరు మధ్యాహ్నము రెండుగంటలవేళ అత్యావసరమయిన పనియుండి • ముగ్గురును కలసి బయలుదేరిరి. వీరందరు మధ్యాహ్నభోజనము పెగియపాలెములో చేసి, గమ్యస్థానమునకు చేరిరి. సాయంత్రము 3-30 గంటలకల్లా తిరిగి రావచ్చునని తలచిరి.

వీరునడచుచుండగా పులి ముందున్నవానిపై దూకెను. తక్కిన వారిద్దరు భయముతో ఆగిపోయిరి. పులి వెనుక కాళ్ళపై నిలబడి అతని ముఖముపై గోళ్ళతో గాయపరచు చుండెను. తక్కినవారిద్దరూ దగ్గరలోనున్న చెట్టును ఎక్కిరి. పులిచేత ఎదుర్కొనబడిన మనిషి, ధైర్యముతో, (షలో గాలవలె దారిలో పొదలు మొదలగు వానిని నరకుటకు కత్తి ఉండుటవలన) కత్తిని తీసి పులిపైకి ఉరికి పులిని తలప్రక్కన గాయపరచెను. పులి బాధతో అరచుచూ, జరిగిన ప్రతీ

కారమునకు భయపడి, తక్కిన నరమాంసభక్షుల వలెనే పొదలలోనికి పారిపోయెను.

చెట్టుపైనున్న వారిద్దరూ చెట్టు చిటారికొమ్మ నుండి క్రిందిభయంకర దృశ్యమును చూచుచుండిరి. పులిగోళ్ళతో అతనిముఖము, బొమ్మపైచేసిన గాయములనుండి ఊటబావి లోని నీరువలె, రక్తము కారుచుండెను. అతడు భయముతో నేలపై కూర్చొనెను. చెట్టుపైనుండి అతని స్నేహితులు "మిత్రమా, వచ్చి త్వరగాచెట్టుఎక్కు......క్రింద ఉండుట అంత శ్రేయస్కరము కాదు. నరమాంసభక్షి మరల తిరిగి రావచ్చు" ననుచూ కేకలు వేయుచుండిరి.

గాయపడినవాడు ఆమాటలువిని, లేచినిలబడి తల పాగాతో రక్తమును తుడుచుకొనుచుండెను. చెట్టుపైనున్న వారు మరల పిలిచిరి. చెట్టు ఎక్కవలెనని గాయపడినవాడు చెట్టువైపుకు వెళ్లుచుండెను. కాని భూమిమీద ఆతనికి నూకలు నాటితో సరిపోయినవి. నరమాంసభక్షి పిరికితనమునువదలి, గాయమువలన కల్గినబాధతో పౌరుషముగా, అతనిపైఅమాంత ముగాదూకెను. దానిముందు కాళ్ళతో అతని మెడవెనుకభాగ మును గాయపరచెను. అతడు క్రిందపడగనే పులిఅతనిని నోట కరచుకొని చెట్టుపైనున్నవారు చూచుచుండగనే అడవిలోనికి అదృశ్యమయ్యెను.

ఈ సంఘటన జరిగినవెంటనే నేను కల్లేగల్, పెగియ పాలయము వెళ్లి వీరిద్దరిని అడిగి తెలుసుకొంటిని. వారిద్దరు

జరిగిన విషయమున్ను తు, చ, తప్పక తెల్పిరి. వారిదరూ పులి రెండుసార్లు ఎదుర్కొనినపుడు కూడా గోళ్ళతోనే ఎదు ర్కొనె నని చెప్పిరి.

నేను పాతసంఘటనలను గుర్తుతెచ్చుకొంటిని. నేను మొట్టమొదటిసారి ప్రయత్నించినపుడు తప్పించుకున్న రాజ నగరపు వినాశకారియైన పులి, కాలము గడచిన్నకొలది ధైర్య సాహసములతో ఎక్కువ నరమాంస భక్షణ చేయుచూ, మరల పెగియపాలెము నరమాంసభక్షిగా కన్పించుచుండెనా అని అనుమానము కలిగెను. వారిద్దరూ చెప్పిన విషయము లనుబట్టి, ఆ పులి — ఈ పులి ఒకేజంతువు అనికన్పించు చుండెను.

నేను చాలకష్టపడి పెగియపాలెములోనేకాక, యింక రెండుమూడు చోట్లకూడ నరమాంసభక్షి మనుష్యులను చంపిన గ్రామములలోను, కొల్లేగల్‌లోగల అటవీశాఖ వారి నుండి కొంతవిషయ సేకరణ చేసితిని. పులిచంపి పూర్తిగా తినులోపల శవములను అచటి ప్రజలు వెదకి కనుగొనిరి. అందరిని గోళ్ళతోనేపీకి చంపెను. కొందరిని నోటితోకూడ గాయపరచెను. ఏమైనప్పటికి అదిపూర్తిగా గోళ్ళతోపీకి మనుష్యులను చంపినట్లుగా పూర్తి ఆధారములులేవు. పులి ఎవరిని చంపినను గోళ్ళు, నోటిని రెంటిని సాధారణముగా ఉపయోగించును.

నేను మొదటిసారి పెగియపాలెములో ఒకవారము మాత్రమే ఉంటిని. కానిపులి నేనుంచిన ఎరలను దేనిని చంప

లేదు. నేను అచట ఉన్నరోజులలో దానిని గూర్చిన వార్తలు కూడ ఏమియులేవు. సెలవు అయిపోయినందున నేను బెంగుళూరు తిరిగి వచ్చితిని.

నేను వెళ్ళివచ్చిన తదుపరి నరమాంస భక్షి మరల కొల్లిగల్ పట్టణమునకు ఆరు మైళ్ళదూరములో పదిహేను సంవత్సరముల కుర్రవానిని చంపెను. ఈసారి నాకుమారుడైన డోనాల్డ్ దానిని వేటాడుటకు వెళ్ళెను. అదృష్టవశాత్తు అతడైన చంపగలడేమో.

డోనాల్డ్ ఆ జంతువును కాల్చిననేతప్ప, నేను చెప్పిన జంతువు, ఇది ఒక్కటేనని ఋజువు చేయుటకు ఆధారములు లేవు. డోనాల్డ్ కనుక ఆ జంతువును చంపగలిగిన, అడవి సంబంధమైన రహస్యముచు తెలిసికొనగలము.

కాని ఈ ఉద్దేశ్యములు ఈ పేజీలు ఈ నాదస్సూరిలో వ్రాసిన విషయము నాకు కన్పించకుండ పోవుచుండెను. ఊహాచిత్రముతో, నా ఎదుట. ఎర్రనికాంతితో మండుచున్న మంటనుండి నిప్పురవ్వలు సెలయేటి ప్రవాహమువలె చీకటి మునిగి ప్రవహించుచుండెను. పొగ చుట్టలు చుట్టలుగా ఆకాశములోనికి వెళ్ళుచున్నట్లు కన్పించుచుండెను. ఆ చీకటిలో కొన్ని వేలనక్షత్రములు మండుచున్న నిప్పు కాంతివలన స్పష్టముగా కన్పించుచుండెను. ఆ కాంతి చుట్టూ ఆవరించియున్న చీకటిని పది పదిహేను గజములదూరము వరకు పారద్రోలినట్లుండెను. తక్కిన ప్రదేశమంతయూ నల్లగాను, నిశ్శబ్దముగాను నల్లని కంబళము కప్పబడినదానివలెను కన్పడుచుండెను.

నేను కాల్చుచున్న చుట్టనుండి పొగ ఇంకను ఎక్కు-వగుచుండెను. మంటలనుండి వచ్చుపొగ, నేకాల్చుచుట్టనుండి వచ్చు పొగ— ఈ పొగఅంతయూ, ఆకాంతిలోగుండ క్రమ క్రమముగా అదృశ్యమగుచుండెను.

మంటలు చిటపటలాడు ధ్వనితప్ప, నా చుట్టూ అంతయూ నిశ్శబ్దముగా నుండెను.

తదుపరి దూరముననున్న కొండలనుండి క్రమక్రమ ముగా నాదగ్గరకు వచ్చుచున్నట్లుగా "ఓ–ఓ–ఓ–న్ ఓ–ఓ–న్ ! ఎ ఓ ఓ న్ న్ !" అను పులి అరపు వినబడు చుండెను.

ఈవిధమైన అరపును నేను ఇదివరలో పలుమార్లు వింటిని. ఈ భయంకరమైన అరపును వినినకొలది ఒళ్లు పులక రించినట్లుండుటయే గాక, వినుటకు చెవులకింపుగ నుండెను.

ఓగ్–ఓగ్–ఓగ్ ! ఓనగ్హ్ం ! ఓనగ్ ! ఓ–ఓ–న్–ఓ... న్ ! అను శబ్దము మరల విన్పించెను. పులి క్రమముగా నాదగ్గరకు వచ్చుచునట్లుగా యుండెను.

ఈ పులియే పెగియపాలయము ప్రాంతమున నర మాంసభక్షియని ఊహించితిని.

M. V. KRISHNA RAO
Minister for Education & Cultural Affairs,
Executive President,
WORLD TELUGU CONFERENCE
HYDERABAD 1975.

182

Check List

Book Number	MB01RN07	Date	27-12-2021
Front Cover	NO	Back Cover	NO
Blank Pages	iv, 182		
Missing Pages	NO		
Prepared By	manisha	Cutting By	manisha
Scanned By	manisha	Pages	191